www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

## అవినాశ్‌రెడ్డి బయట ఉంటే సాక్ష్యాలు తారుమారు



ఇద్దరు పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని కేసును తప్పుదారి పట్టించాలని చూశారు

రాంసింగ్, సునీత దంపతులపై అన్యాయంగా కేసులు.. వైసీపీ ఎంపీ బెయిల్ రద్దుచేయండి

సుప్రీంకు సీనియర్ న్యాయవాది లూథ్రా వినతి.. సునీతారెడ్డి వ్యాజ్యాలపై విచారణ జూలై చివరి వారానికి వాయిదా.. అప్పటికి తాను రిటైరవుతానన్న సీజేఐ

పిటిషన్లను మరో ధర్మాసనానికి మార్చాలని రిజిస్ట్రీకి సూచన 12

బుధవారం | 30-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 14

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: తదియ మ.2.13 తదుపరి చవితి, నక్షత్రం: రోహిణి సా.4.18 తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ.9.07-10.33, రా.9.26-10.54, దుర్ముహూర్తం: ఉ.11.47-12.37, అమృతఘడియలు: మ.1.25-2.51, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.53, సూర్యాస్తమయం: 6.31

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ



మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ దినేశ్ త్రిపాఠి, ఎయిర్ చీఫ్ అమర్ ప్రీత్‌సింగ్‌లతో సమావేశమైన ప్రధాని మోదీ

ఉగ్రదాడికి ప్రతిగా ఎక్కడ, ఎప్పుడు, ఎలా దాడి చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారిదే

వారి శక్తి సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది

ఉగ్రవాదులకు, వారిని పెంచి పోషిస్తున్నవారికి ఊహైనా అందనంత కఠిన శిక్షలు విధిస్తాం

అత్యున్నతస్థాయి రక్షణ భేటీలో ప్రధాని మోదీ

నేడు రెండోసారి సమావేశం కానున్న సీసీఎస్

కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా

**'పహల్గాం'పై చర్చకు పార్లమెంట్‌ను సమావేశపరచండి**

ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే లేఖలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా.. ఎలాంటి దాడులైనా చేసేందుకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని.. ఎక్కడ (టార్గెట్), ఎప్పుడు (టైమింగ్), ఎలా (మోడ్) చేయాలో నిర్ణయించే అధికారం కూడా వాటిదేనని ప్రధాని మోదీ అన్నారు. మంగళవారం ఇక్కడ తన నివాసంలో అత్యున్నత స్థాయి రక్షణ సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ.. భారత దళాల శక్తిసామర్థ్యాలపై తనకు పూర్తి విశ్వాసం ఉన్నదని స్పష్టం చేశారు. ప్రధాని నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు, మహా దళపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ఈ సమావేశంలో పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నది జాతీయ సంకల్పమన్న ప్రధాని.. పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను, దాడి కుట్రదారులను, వారిని పెంచి పోషిస్తున్నవారిని

మిగతా 12వ పేజీలో...

### పాకిస్థాన్ దిగ్బంధం?

దాయాదిని అన్ని అంశాల్లో ఇరుకునపెట్టేందుకు కేంద్రం యత్నాలు

ఇప్పటికే అమల్లోకి దౌత్య, వాణిజ్యపరమైన ఆంక్షలు

పాక్ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని మూసేసే యోచన

ఆ దేశ నౌకలు మన పోర్టుల్లో ఆగకుండా చర్యలు

ఏ క్షణమైనా భారత్ వైమానిక దాడులకు దిగొచ్చని పాక్ ఆందోళన

సరిహద్దులకు రాడార్ల తరలింపు.. సైబర్ దాడులకు విఫల యత్నం

**'పహల్గాం' పాపం పాక్‌దే!**

దాడిలో మాజీ పారా కమాండో మూసా పాల్గొన్నట్టు తాజాగా వెల్లడి

### కొట్టాలి.. తిప్పికొట్టలేకుండా!

పాక్ ఉగ్రశిబిరాలు, ఆయువుపట్లపై దాడి

భారత సైన్యం ప్రతీకార వ్యూహమిదే!

పాక్ స్పందించలేని రీతిలో బుద్ధి చెప్పాలి

పూర్తిస్థాయి యుద్ధానికి చాన్స్ తక్కువే!

అడ్డుకునేందుకే పాక్ అణు బెదిరింపులు





పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా!? ప్రతిస్పందించాలో నిర్ణయించే పూర్తి స్వేచ్ఛను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్రివిధ దళాలకు ఇచ్చారు! ఉగ్రవాదం ఇక కోలుకోకుండా దెబ్బ కొట్టాలనీ నిర్దేశించారు! మరి.. ఈ పరిస్థితుల్లో భారత సైన్యం వ్యూహమేంటి!? అందుకు మన సన్నద్ధత ఎంత!? పూర్తిస్థాయి లేదా పరిమిత యుద్ధమే వస్తే పాకిస్థాన్ ప్రతిస్పందన ఎలా ఉండనుంది!? అటువంటి పరిస్థితుల్లో అమెరికా, రష్యా, చైనా ఏం చేసే అవకాశముంది!? అణు దాడి జరిగే అవకాశముందా!? జరిగితే.. ఏ స్థాయిలో ఉండనుంది!? తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి' రక్షణ ప్రతినిధి అందిస్తున్న సమగ్ర విశ్లేషణ..



### ఇది దేశ సమగ్రతపైనే దాడి

పర్యాటకుల హత్య అత్యంత హేయం

కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే

ఎవరికైనా పాక్‌పై ప్రేమ ఉంటే అక్కడికే వెళ్లాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

పహల్గాం అమరులకు ఘన నివాళి

**జన సైనికుడి కుటుంబానికి 50 లక్షల సాయం**

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అతి హేయమని, అది దేశ సమగ్రతపైనే దాడి అని డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పహల్గాం ఉగ్ర దాడిలో మృతిచెందిన 26 మంది అమరులను స్మరించారు. ఈ దాడిలో మరణించిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సోమిశెట్టి మధుసూదనరావుకు ఘన నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. క్రియాశీలక సభ్యత్వ బీమా కింద మరో రూ.5 లక్షలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.పది లక్షల పరిహారం ప్రకటించిందని, ఇంకా ఏమైనా అదనంగా సాయం చేయగలమేమో పరిశీలిస్తామన్నారు. ఉగ్రవాదం జన సైనికుడిని

మిగతా 14వ పేజీలో...

# ఆర్థిక ప్రగతికి మద్దతివ్వండి

## బ్యాంకర్లకు సీఎం పిలుపు

రాష్ట్రానికి భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయి

వచ్చే నాలుగేళ్లలో సంపద సృష్టి, ఇంటికో పారిశ్రామికవేత్త, పేదరిక నిర్మూలనపై దృష్టి

పీపీపీ విధానం విస్తృతంగా అమలు

పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలి

మత్స్యకారులకు నేరుగా రుణాలివ్వాలి

డ్వాక్రా, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదుగుదలకు సాయం చేయాలి

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ భేటీలో సీఎం

2025-26కు 6.60 లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

లక్ష్యాన్ని అధిగమిస్తామన్న బ్యాంకర్లు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా వచ్చే నాలుగేళ్లలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నాం. ఓవైపు ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. మరోవైపు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 2029కల్లా పేదరికం నిర్మూలించేలా జీరో పావర్టీ-పీ4 విధానం అమలు చేసి, అసమానతలు తొలగించేందుకు కృషి చేస్తున్నాం.

- సీఎం చంద్రబాబు



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల, సీఎస్ విజయానంద్, బ్యాంకుల ప్రతినిధులు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక ప్రగతికి బ్యాంకులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రానికి భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పని చేస్తూనే.. 2029కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని, వీటన్నింటికీ బ్యాంకులు సహకారం అందించాలన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో

మిగతా 14వ పేజీలో...



12

### 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్

14న ప్రమాణ స్వీకారం

కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్

### ప్రజల విశ్వాసం కోల్పోతున్న సీబీఐ!

ఆ సంస్థపై అవినీతి ఫిర్యాదులు పెరుగుతున్నాయి: మద్రాస్ హైకోర్టు

సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలని సూచన 12

### కెనడా ప్రధానిగా కార్నీ!

విజయం దిశగా లిబరల్ పార్టీ

కొనసాగుతున్న కౌంటింగ్..

ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ ఓటమి అంగీకారం 12

ప్రభావం చూపని ఖలిస్థానీ అనుకూల న్యూడెమోక్రటిక్ పార్టీ

అధ్యక్ష పదవికి జగ్మీత్ రాజీనామా

## కేసుల ఉచ్చులో పీఎస్ఆర్

తాజాగా మరొకటి నమోదు 2

ఏపీపీఎస్సీ అక్రమాలపై ఫిర్యాదు



హాయ్‌ల్యాండ్ వేదికగా రాంగ్‌రూట్

గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలు రెండు సార్లు మూల్యాంకనం

పీఎస్ఆర్ నేతృత్వంలో మొదటిసారి

కోర్టు ఆర్డర్‌తో రెండోసారి దిద్దుబాటు

అభ్యర్థులు పసిగట్టి న్యాయ పోరాటం



### డీఎస్సీ అభ్యర్థులకు ఉపశమనం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీలో 40 శాతం మార్కులున్నా అర్హులే 14

సర్టిఫికెట్ల అప్‌లోడ్ ఐచ్ఛికం: విద్యాశాఖ

## విమానయానం రయ్ రయ్!

### ఏపీలో ఊపందుకున్న విమాన ప్రయాణం



2

వృద్ధిలో అగ్రపథాన విజయవాడ ఎయిర్‌పోర్టు

ఏడాదిలో ఇక్కడి నుంచి 13.8 లక్షల మంది రాకపోకలు

40% వృద్ధి నమోదు.. తర్వాతి స్థానాల్లో రాజమండ్రి, తిరుపతి

రాజమండ్రిలో 15.1, తిరుపతిలో 14.4, విశాఖలో 6% వృద్ధి

కర్నూలు, కడప విమానాశ్రయాల్లో తగ్గిన ప్రయాణికులు

# విమానయానం రయ్ రయ్!

## ఏపీలో ఊపందుకున్న విమాన ప్రయాణం

- 40% వృద్ధితో అగ్రపథంలో విజయవాడ ఎయిర్‌పోర్టు
- ఏడాదిలో ఇక్కడినుంచి 13.8 లక్షల మంది రాకపోకలు
- రాజమండ్రిలో 15.1, తిరుపతిలో 14.4 % వృద్ధి
- కర్నూలు, కడప విమానాశ్రయాల్లో తగ్గిన ప్రయాణికులు



విజయవాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో విమాన యానం ఊపందుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రధాన విమానాశ్రయాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం 40 శాతం భారీ వృద్ధితో అగ్రస్థానంలో నిలవగా... రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రయాణికుల సంఖ్యాపరంగా చూస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో విశాఖ విమానాశ్రయం నుంచి 29,55,089 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ సంఖ్య పెద్దగానే ఉన్నప్పటికీ వృద్ధిలో మాత్రం గతేడాదితో పోలిస్తే 6 శాతమే పురోగతి కనిపించింది. ఇక విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంఏపీలోనే టాప్‌లో నిలిచింది. ఐదేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక విజయవాడ విమానాశ్రయానికి పునర్వైభవం వచ్చినట్టయింది. 2017-18లో సాధించిన పది లక్షల (మిలియన్) ప్రయాణికుల మార్కుని మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 2024-25లో అందుకుంది. ఈ ఏడాది ఇక్కడి నుంచి అత్యధికంగా 13,88,943 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో ఇక్కడ రికార్డు స్థాయిలో 40 శాతం వృద్ధి నమోదైనట్టు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఆక్యుపెన్సీ 90శాతం పైగా ఉండటమే వృద్ధికి కారణమని తెలుస్తోంది. దీన్నిబట్టి విజయవాడ నుంచి మరిన్ని విమానాలకు డిమాండ్ ఉందని స్పష్టమవుతోంది.

### అంతర్జాతీయ సర్వీసులకూ డిమాండ్

విజయవాడ నుంచి అంతర్జాతీయ సర్వీసులకు కూడా డిమాండ్ ఉంది. ప్రస్తుతం షార్జాకు మాత్రమే వారంలో రెండు రోజుల పాటు సర్వీసులు నడుస్తున్నాయి. దుబాయ్, సింగపూర్, మలేసియా, శ్రీలంక దేశాలకు అత్యవసరంగా డిమాండ్ ఉంది. దేశీయంగా చూస్తే కేరళ, కోల్‌కతా, వారాణసీ, గుజరాత్ వంటి ప్రాంతాలకూ డిమాండ్ ఉంది. రానున్న రోజుల్లో ఈ ప్రాంతాలకు కూడా సర్వీసులు ఏర్పాటు చేస్తే విజయవాడ ఎయిర్‌పోర్టు మరింత వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పది నెలల్లోనే విజయవాడ నుంచి కొత్తగా 7 విమానాలు పెరిగాయి. ముంబైకి 2, ఢిల్లీకి అదనంగా ఒకటి, బెంగళూరు, విశాఖకు రెండేసి చొప్పున పెరిగాయి. అమరావతి పునర్నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం వల్ల కూడా రాకపోకల్లో పురోగతి కనిపించింది. మరోవైపు రాజమండ్రి విమానాశ్రయం కూడా అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాదిలో రాజమండ్రి నుంచి 4,89,114 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించడంతో ఇక్కడ 15.1 శాతం వృద్ధి నమోదైంది. తిరుపతి విమానాశ్రయం (14.4 శాతం వృద్ధి) నుంచి 9,95,640 మంది రాకపోకలు సాగించారు. కాగా.. కడప, కర్నూలు ఎయిర్‌పోర్టుల పరిస్థితి మాత్రం దిగజారింది. కడప విమానాశ్రయం నుంచి 52,745 ప్రయాణీకులు రాకపోకలు సాగించినా వృద్ధి -19.5 శాతంగా, కర్నూలు నుంచి 19,427 మంది రాకపోకలు సాగించగా.. వృద్ధి -51.1 శాతంగా నమోదైంది.

**ఏ విమానాశ్రయంలో ఎంత..?**

| విమానాశ్రయం | ప్రయాణికులు | వృద్ధి% |
|---|---|---|
| విజయవాడ | 13,88,943 | 40 |
| రాజమండ్రి | 4,89,114 | 15.1 |
| తిరుపతి | 9,95,640 | 14.4 |
| విశాఖపట్నం | 29,55,089 | 6 |
| కడప | 52,745 | -19.5 |
| కర్నూలు | 19,427 | -51.1 |

## లోకం తీరు




## రాజ్యసభ అభ్యర్థిగా పాకా నామినేషన్


సీఎం చంద్రబాబును కలిసిన బీజేపీ రాజ్యసభ అభ్యర్థి పాకా సత్యనారాయణ

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కూటమి తరపున బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా పాకా వెంకట సత్యనారాయణ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. శాసనసభ ప్రాంగణంలో రిటర్నింగ్ అధికారి వనితారాణికి ఆయన తన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక కారిడార్లకు సహకరించండి: భరత్

రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోని ఓర్వకల్లు నోడ్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కింద కృష్ణపట్నం నోడ్‌ల అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేసేలా నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చర్యలు చేపట్టాలని మంత్రి భరత్ మంగళవారం ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి కార్మికులకు ప్రత్యేకంగా మేడే వేడుకలు

ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికుల కోసం ఈ ఏడాది ప్రత్యేకంగా మేడే వేడుకలు నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయించారు. గురువారం మంగళగిరిలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి జిల్లా నుంచి పది మంది చొప్పున శ్రామికులు హాజరుకానున్నారు.

## అడ్డగోలు భూపందేరాలు చేసింది జగనే: అశోక్‌బాబు

అక్రమ భూకేటాయింపులకు పెట్టింది పేరు జగన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు విమర్శించారు. ఉర్సాకు భూకేటాయింపులపై జగన్ పత్రిక రాతలు అబద్ధాలని తేలితే వారి ముక్కు నేలకు రాయాలని, జగన్ పత్రిక కార్యాలయంలో చంద్రబాబు ఫొటో పెట్టుకుని పాలాభిషేకం చేసి, ఆయన ఫొటోకు దండం పెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం అశోక్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ఉర్సాకు 99 పైసలకే భూకేటాయింపు చేశారంటూ జగన్ తన సొంత పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్ధాలు ప్రచారం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగన్ హయాంలోనే అడ్డగోలుగా భూపందేరాలు చేశారని మండిపడ్డారు.

## 1300 కోట్లతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి: సంధ్యారాణి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో గిరిజన ప్రాంతాల్లో రూ.1,300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రూ.వెయ్యి కోట్లతో డోలీ మోతలు నివారించేందుకు, రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. మంగళవారం సచివాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అరకు కాఫీని లక్ష ఎకరాల్లో సాగు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. శ్రీశైలంలోని చెంచులు, యానాదులకు ఆధార్, రేషన్ కార్డులు ఇవ్వాలని ఆదేశించామన్నారు.



# ప్రమాదపుటంచుల్లో తుంగభద్ర

## గేట్లు దెబ్బతిన్నట్లు గుర్తించిన కేఎస్ఎన్‌డీటీ సర్వీసెస్

- తక్షణం అన్నింటినీ మార్చాల్సిందేనని నివేదిక
- 60 కోట్లతో టెండర్లు పిలిచిన టీబీపీ బోర్డు
- 2026 జూన్ చివరికి మొత్తం గేట్లన్నీ మార్చేందుకు సన్నాహాలు


తుంగభద్ర జలాశయం

కర్నూలు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు సహా కర్ణాటకకు జలప్రదాయినిగా పేరుగాంచిన తుంగభద్ర డ్యాం ప్రమాదపుటంచుల్లో ఉంది. మూడు రాష్ట్రాల్లో 17.33 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీటిని అందించే ఈ ప్రాజెక్టు మరమ్మతులపై తక్షణం దృష్టి పెట్టకపోతే పూడ్చలేని నష్టం ఏర్పడుతుందని అధ్యయన నివేదికలు స్పష్టం చేయడంతో తుంగభద్ర బోర్డు అప్రమత్తమయింది.

### గేట్లు మొత్తం మార్చాల్సిందే

తుంగభద్ర డ్యాంకు 33 క్రస్ట్ గేట్లు ఉన్నాయి. 2024, ఆగస్టులో 19వ నంబరు గేటు కొట్టుకుపోయింది. దీంతో డ్యాం భద్రతపై ప్రశ్నలు తెలెత్తాయి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ), డ్యాంను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన ఏకే బజాజ్ కమిటీ సిఫార్సుల మేరకు గేట్లు, ప్రాజెక్టు సామర్థ్యంపై టీబీపీ బోర్డు అధ్యయనం చేయించింది. ప్రతి గేటుకు 15 రకాల పరీక్షలు నిర్వహించిన కేఎస్ఎన్‌డీటీ సంస్థ నివేదికను బోర్డుకు ఇటీవల సమర్పించింది. 'గేట్లన్నీ భారీగా తుప్పుపట్టి పెద్ద రంధ్రాలు పడ్డాయి. కొన్నిచోట్ల రంధ్రాల వల్ల గేటు ప్లేట్లు బాగుచేయలేనంతగా ధ్వంసమయ్యాయి. 19 గేట్ల సామర్థ్యం 40-55%కి తగ్గిపోయింది. గుస్సెట్ ప్లేట్లు, దిగువ స్టిఫ్‌నర్లు, గేట్లకు సపోర్టుగా ఉండే గడ్డర్లు, సపోర్టింగ్ ప్లేట్లు కూడా తుప్పుపట్టి చిల్లులు పడ్డాయి. వెల్డింగ్ దెబ్బతిని, పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా వరకు రివిట్లు స్వరూపాన్నే కోల్పోయే పరిస్థితుల్లో ఉన్నాయి. మొత్తం గేట్లు మార్చాల్సిందే' అని పేర్కొంది. ప్రాజెక్టుల మెకానికల్ నిపుణుడు కన్నయ్య నాయుడు 'గేట్ల సామర్థ్యం 45 ఏళ్లే. కానీ, తుంగభద్ర గేట్లు పెట్టి 70 ఏళ్లు దాటింది. అన్నింటినీ మార్చాల్సిందే' అని గతంలో స్పష్టం చేశారు. బజాజ్ కమిటీ కూడా ఇదే అభిప్రాయాన్ని ప్రకటించింది.

### అప్రమత్తమైన తుంగభద్ర బోర్డు

కేఎస్ఎన్‌డీటీ నివేదికతో టీబీపీ బోర్డు అప్రమత్తమైంది. 19వ గేటు స్థానంలో కొత్తగేటు ఏర్పాటుకు రూ.1.98 కోట్లతో ఇప్పటికే టెండర్లు పిలిచారు. గుజరాత్‌కు చెందిన 'హార్డ్‌వేర్ టూల్స్' సంస్థ టెండరు దక్కించుకుంది. జూలై నుంచి జలాశయంలోకి వరద చేరుతుంది. అంటే మిగిలిన సమయం 2 నెలలే. దీంతో 2026, జూన్ ఆఖరుకు మిగిలిన 32 గేట్లు మార్చేందుకు రూ.60 కోట్లతో టీబీపీ బోర్డు ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్లు ఈ నెల 19న పిలిచింది. మే 5లోగా ఆన్‌లైన్ టెండరు షెడ్యూల్ దాఖలు చేయాలి.

### గేట్లన్నీ మార్చేందుకు టెండర్లు పిలిచాం

'కేఎస్ఎన్‌డీటీ నివేదిక ఇచ్చిన మాట నిజమే. 2026 సీజన్ నాటికి మొత్తం గేట్లు మార్చేసి కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.60 కోట్లతో టెండర్లు పిలిచాం. గడువులోగా గేట్లు మారుస్తాం. గత ఏడాది కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు టెండర్ సంస్థ డిజైన్ ఇచ్చింది. సీడబ్ల్యూసీ, ఆంధ్రప్రదేశ్ సీఈ సీడీవోకు పంపించాం. అప్రూవల్ రాగానే పనులు మొదలు పెడుతాం.'

- నారాయణ నాయక్, ఎస్ఈ, టీబీపీ బోర్డు, హోస్పెట్


తెలుగు ప్రవాసీయులతో ప్రధాని మోదీ

## సౌదీ పర్యటనలో బాపట్ల మహిళతో ప్రధాని మాటామంతీ

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రధాని మోదీ ఇటీవల సౌదీ అరేబియా పర్యటన సందర్భంగా తెలుగు ప్రవాసీయుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీలోని బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంకు చెందిన దుర్గాభవానీ ప్రధానితో మాట్లాడారు. 'మీరు ప్రధాని అయినందుకు సంతోషంగా ఉంది' అనగా.. తానేమి నేరుగా ప్రధాని కాలేదని, మీరంతా కలిసి ఎన్నుకున్నారని, అందుకు మీకు కృతజ్ఞతలని మోదీ జవాబిచ్చారు.

## ప్రవాసాంధ్రులకు తోడ్పాటు: కొండపల్లి

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో స్థిరపడిన ప్రవాసాంధ్రులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలో నిర్వహించిన ఏపీఎన్ఆర్‌టీఎస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి మంత్రి కొండపల్లి అధ్యక్షత వహించారు. అమరావతిలో నిర్మించతలపెట్టిన ఐకానిక్ ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్న తెలుగువారికి అండగా నిలబడటంతోపాటు రాష్ట్రంలో ఉన్న వారి కుటుంబాలకు భరోసానిచ్చే దిశగా ఏపీఎన్ఆర్‌టీఎస్ సంస్థ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆ సంస్థ సీఈవో హేమలత, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు వేమూరి రవికుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# హాయ్‌ల్యాండ్ వేదికగా అక్రమాలు!

- గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలు రెండు సార్లు మూల్యాంకనం
- పీఎస్ఆర్ నేతృత్వంలో మొదటిసారి
- కోర్టు ఆర్డర్‌తో రెండోసారి దిద్దుబాటు
- అభ్యర్థులు పసిగట్టి న్యాయ పోరాటం
- హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనంపై గోప్యత పాటించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్
- పక్కా ఆధారాలతో అడ్డంగా దొరికిన వైనం
- ఎవరి కోసం ఈ అడ్డగోలు మూల్యాంకనాలు?
- విచారణలో కూపీ లాగుతున్న అధికారులు
- ఐపీఎస్ ఆంజనేయులు చుట్టూ ఆరోపణలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు ఉన్న సమయంలో గ్రూప్-1లో అక్రమాలు జరిగాయి. అసలు ఆఫీసుతో సంబంధం లేని గుంటూరులో ఉన్న పర్యాటక ఆతిథ్య ప్రాంతం హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను మూల్యాంకనం చేయించారు. అప్పుడే అక్రమాలు జరిగాయన్న విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత రెండోసారి మూల్యాంకనం చేయించినా, రెండుసార్లు మూల్యాంకనం జరిగిందనే విషయాన్ని ఏపీపీఎస్సీ గోప్యంగా ఉంచింది. హాయ్‌ల్యాండ్ అనే పేరు కూడా తమకు తెలియదన్నట్టుగా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొని అడ్డంగా దొరికిపోయింది. హాయ్‌ల్యాండ్‌లో మొదటిసారి మూల్యాంకనం కోసం చేసిన ఏర్పాట్లు, నగదు చెల్లింపుల వివరాలను అభ్యర్థులే స్వయంగా ఆధారాలతో సహా నిరూపించారు. దీంతో హైకోర్టు మెయిన్స్‌ను రద్దు చేసింది. అయితే ఈ మొత్తం వ్యవహారం వెనుక చక్రం తిప్పింది అప్పట్లో కార్యదర్శిగా వ్యవహరించిన పీఎస్ఆర్ ఆంజనేయులేనని స్పష్టమవుతోంది.

### ఎప్పుడెప్పుడు ఏం జరిగింది?

- 2018లో ఏపీపీఎస్సీ 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. నోటిఫికేషన్‌లో మాన్యువల్ విధానం(చేతితో దిద్దే)లో మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందని పేర్కొంది. వైసీపీ హయాంలో 2020, డిసెంబరు 14 నుంచి 20 వరకు మెయిన్స్ పరీక్షలు జరిగాయి. 6,807 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. కరోనా కారణం చూపుతూ ఏపీపీఎస్సీ మాన్యువల్‌గా కాకుండా డిజిటల్ విధానంలో మూల్యాంకనం చేయించింది. దీనిపై అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా మాన్యువల్‌గానే మూల్యాంకనం చేయాలని న్యాయస్థానం ఆదేశించింది.
- ఆ సమయంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉన్న పీఎస్ఆర్ అడ్డగోలు వ్యవహారాలకు తెరతీశారు. ఏపీపీఎస్సీతో ఎలాంటి సంబంధం లేని గుంటూరులోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం చేయించేందుకు ఏర్పాట్లు చేశారు. మూల్యాంకనం చేసే ప్రొఫెసర్లకు ఏర్పాట్లు, ఇతర సిబ్బంది అవసరాలకు కామ్‌సైన్ అనే కంపెనీకి రూ.1.14 కోట్లు చెల్లించారు. 2021, డిసెంబరులో ప్రారంభించిన మూల్యాంకనానికి హాయ్‌ల్యాండ్‌లో 26 రోజులకు హాల్ అద్దె, సిబ్బందికి భోజనాలు, ఇతర అవసరాలంటూ రూ.20.06 లక్షలు చెల్లించారు. ఓఎంఆర్ షీట్లు, డిజైన్ కోసం మరో కంపెనీకి నిధులు విడుదల చేశారు.
- హాయ్‌ల్యాండ్‌లో జవాబుపత్రాలకు భద్రత కోసం కర్నూలు పోలీస్ యూనిట్ నుంచి 15 రోజులకు ఒక బ్యాచ్ చొప్పున 32 మంది సిబ్బందిని హాయ్‌ల్యాండ్‌లో నియమించారు. 2021, డిసెంబరు 5 నుంచి 2022, ఫిబ్రవరి 26 వరకు వారు అక్కడే ఉన్నారు. అంతకముందు విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి గుంటూరులోని హాయ్‌ల్యాండ్‌కు జవాబుపత్రాల తరలింపునకు గుంటూరు అర్బన్ ఎస్పీకి పీఎస్ఆర్ ఆంజనేయులు లేఖ రాశారు.
- హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీపీఎస్సీ రెండోసారి మాన్యువల్‌గా జవాబుపత్రాలు మూల్యాంకనం చేయించి తుది ఫలితాలు ప్రకటించింది. రెండోసారి ఏపీపీఎస్సీ కార్యాలయంలోనే మూల్యాంకనం జరిగింది. అంతకంటే ముందే పీఎస్ఆర్‌ను అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది.


పీఎస్ఆర్‌ను వైద్య పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చిన పోలీసులు

### ఆధారాలున్నా అడ్డగోలు వాదన

గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలను హాయ్‌ల్యాండ్‌లో మొదటిసారి మూల్యాంకనం చేశారనేందుకు పలు ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నా అప్పటి వైసీపీ ప్రభుత్వం, ఏపీపీఎస్సీ అప్పటి చైర్మన్ గౌతం సవాంగ్‌లు ఈ వాదనను తోసిపుచ్చారు. తొలిసారి మాన్యువల్ మూల్యాంకనం చేసినప్పుడు తమకు అనుకూలంగా ఉండే అభ్యర్థులు ఎంపిక కాలేదనే ఉద్దేశంతో రెండోసారి మూల్యాంకనం చేశారని, ఫలితంగా డిజిటల్ మూల్యాంకనానికి, రెండోసారి మాన్యువల్ మూల్యాంకనానికి మధ్య ఎంపికైన అభ్యర్థుల్లో 62శాతం వ్యత్యాసం వచ్చిందని అభ్యర్థులు వాదించారు. డిజిటల్ మూల్యాంకనం చేసినప్పుడు ఇంటర్వ్యూలకు 326 మందిని ఎంపిక చేయగా, వారిలో 202 మంది రెండోసారి మాన్యువల్ మూల్యాంకనంలో అనర్హులుగా మారారు. అయితే, అసలు మొదటిసారి మూల్యాంకనం చేశారనే విషయాన్ని ఏపీపీఎస్సీ దాచిపెట్టి, అసలు హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనమే జరగలేదని కోర్టుకు తెలిపింది. కానీ, అభ్యర్థులు దీనికి సంబంధించి పలు ఆధారాలను సమర్పించడంతో న్యాయస్థానం ఏకీభవించింది.

### ప్రైవేటు రిసార్ట్స్‌లో ఎందుకు?

ఈ మొత్తం వ్యవహారంలో హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం అనుమానాస్పదంగా మారింది. అసలు ఒక ప్రైవేటు రిసార్ట్స్‌లో అత్యంత కీలకమైన గ్రూప్-1 జవాబు పత్రాలను మూల్యాంకనం ఎందుకు చేయించారనేది ప్రధాన ప్రశ్న. ఆ సమయంలో చైర్మన్ కూడా లేకపోవడంతో అన్నీ తానై వ్యవహరించిన పీఎస్ఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. నిబంధనల ప్రకారం ఏ పోటీ పరీక్షల మూల్యాంకనం అయినా ఏపీపీఎస్సీ కార్యాలయంలోనే జరగాలి. కానీ, దీనికి విరుద్ధంగా వ్యవహరించిన పీఎస్ఆర్ ప్రైవేటు రిసార్ట్స్‌కు జవాబుపత్రాలను తరలించారు. పైగా ఏర్పాట్ల కోసం రూ.1.14 కోట్లు చెల్లించారు. అసలు ప్రైవేటు ప్రాంతంలో మూల్యాంకనం ఎందుకు చేశారనే కోణంలోనే ఇప్పుడు పీఎస్ఆర్‌పై నమోదైన కేసులో అధికారులు విచారణ చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలకు మేలు చేయడం కోసమే మూల్యాంకనాన్ని అక్కడికి మార్చారా? లేక, కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇవ్వడం కోసం చేశారా? అనే అంశాలపై దృష్టి సారించారు.

## గున్నీతో మాట్లాడినట్లు గుర్తులేదు!: పీఎస్ఆర్

దర్యాప్తు అధికారి: జెత్వానీ కేసు వల్లే మీరు సస్పెండ్ అయ్యారా?.
పీఎస్ఆర్: నాపై తప్పుడు కేసు పెట్టారు.
దర్యాప్తు అధికారి: విశాల్ గున్నీతో జెత్వానీ కేసు గురించి ఏమైనా మాట్లాడారా?.
పీఎస్ఆర్: విశాల్ గున్నీతో మాట్లాడినట్టుగా గుర్తులేదు.

...ఇవీ సీఐడీ విచారణలో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పిన సమాధానాలు! సీఐడీ అధికారులు మంగళవారం కానూరులోని తమప్రాంతీయ కార్యాలయంలో పీఎస్ఆర్‌ను ప్రశ్నించారు. రెండు దర్యాప్తు బృందాలు 40 ప్రశ్నలు సంధించాయి. అడిగిన ప్రతి ప్రశ్నకు తనకేమీ తెలియదనే సమాధానం మాత్రమే వచ్చింది. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ గురించి ప్రశ్నించినప్పుడు.. తనకు సెల్‌ఫోన్ మాత్రమే ఉందని, ఇంటెలిజెన్స్ డీజీగా పనిచేసిన ఐదేళ్లలో ఏనాడూ ట్యాబ్ ఉపయోగించలేదని చెప్పారు. ముంబై నటి జెత్వానీ, వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ గురించి ప్రశ్నించినప్పుడు.. వాళ్లెవరో తనకు తెలియదన్నారు. విశాల్ గున్నీతో ఈ కేసు గురించి మాట్లాడారా? అని అడిగితే.. 'నాకేమీ గుర్తులేదు' అంటూ దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చారు.

## కేసుల ఉచ్చులో పీఎస్ఆర్

- తాజాగా మరో కేసు నమోదు
- ఏపీపీఎస్సీ అక్రమాలపై ఫిర్యాదు

విజయవాడ/అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి పి. సీతారామాంజనేయులు(పీఎస్ఆర్) చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ముంబై నటి కాదంబరి జెత్వాని కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనపై మరో కేసు నమోదైంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూపు-1 పరీక్ష పత్రాల మూల్యాంకనంలో ఆయన అక్రమాలకు తెరదీశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా వీటిపైనే క్రైం నంబరు 56/2025తో ఈ కేసు నమోదైంది. ఉన్నతాధికారులు ఈ కేసు విచారణ బాధ్యతలను నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్‌కు అప్పగించారు. గ్రూపు-1 పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనాన్ని గుంటూరు జిల్లా హాయ్‌ల్యాండ్‌లో చేయించారని ఆరోపణలు ఉన్నాయి. నాడు పరీక్షలు రాసిన అభ్యర్థులు ఇదే విషయాన్ని బహిరంగంగా చెప్పారు. అయితే, అలా ఎందుకు చేయాల్సి వచ్చిందన్నది ప్రశ్న. ఈ క్రమంలో మంగళవారం దర్యాప్తు అధికారులు ఇద్దరు వ్యక్తుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేసినట్టు తెలిసింది.

### ఆ కేసు వివరాలు ఇవ్వండి: హైకోర్టు

గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో అప్పటి నిఘా విభాగాధిపతి పాత్ర ఉందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గత ఏడాది గుంటూరు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ పీఎస్ఆర్ హైకోర్టును ఆశ్రయించారు.

### పూజకు.. పుస్తకాలు ఇవ్వట్లేదు: పీఎస్ఆర్

జైలులో తాను పూజ చేసుకోవడానికి పుస్తకాలు, నుదుటున పెట్టుకోవడానికి బొట్టు ఇవ్వడం లేదని ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు న్యాయాధికారికి విన్నవించారు. సీఐడీ కస్టడీ ముగిసిన అనంతరం పోలీసులు మంగళవారం ఆయనను విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పి. భాస్కరరావు.. "కస్టడీలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా?" అని అడిగారు. దానికి సీతారామాంజనేయులు జవాబు ఇస్తూ.. "నేను పూజ చేసుకోవడానికి పుస్తకాలు, నుదుటన పెట్టుకోవడానికి బొట్టు ఇవ్వడం లేదు. నేను జైలుకు వెళ్లిన మర్నాడు వాకింగ్‌కు వెళ్లినప్పుడు టీవీ ఉందని చెప్పారు. తర్వాత టీవీ లేదన్నారు. నా వల్ల ఇతర ఖైదీల సదుపాయాలు పోతున్నాయి. నేను జైలుకు వెళ్లడానికి ముందు ఇతర ఖైదీలకు 5 ములాఖత్‌లు ఉండేవి. నేను వెళ్లిన తర్వాత వాటిని మూడుకు కుదించారు. కస్టడీలో పోలీసులు ఇబ్బంది పెట్టలేదు. నేను ఫిట్‌గా ఉన్నప్పటికీ బీపీ ఎక్కువగా ఉందని పోలీసులు ఒక రోజు కస్టడీలోకి తీసుకోలేదు. మరోసారి పోలీసు కస్టడీకి ఇచ్చినా సహకరిస్తా" అని తెలిపారు. జైలులో ఏమైనా సదుపాయాలు కావాలంటే ఒక పిటిషన్ వేసుకోవాలని న్యాయాధికారి ఆయనకు సూచించారు. అనంతరం పీఎస్ఆర్‌ను పోలీసులు విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

# అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు

» త్రుటిలో తప్పించుకున్న అరుణ, జగన్, ఉదయ్

» నక్సల్స్ కోసం ఉధృతంగా గ్రేహౌండ్స్ గాలింపు

కొయ్యూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు ప్రాంతం తుపాకుల మోతతో ఉలిక్కిపడింది. మఠంభీమవరం పంచాయతీ కాకులమామిడి, కంఠారం గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో రెండు దఫాలు మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. కాల్పులు జరుపుతూనే మావోయిస్టులు అక్కడినుంచి తప్పించుకున్నారు. వీరిలో డీసీఎం అరుణ, ఉదయ్, జగన్‌లతో పాటు మరో 11 మంది సభ్యులు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. మఠంభీమవరం పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతం (కాకినాడ జిల్లా సరిహద్దు)లో మావోయిస్టుల కదలికలు ఉన్నట్టు పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు సోమవారం ఉదయం కాకినాడ జిల్లాకు చెందిన ప్రత్యేక బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఉధృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే రెండు సార్లు ఎదురుకాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు. ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్, 20 బుల్లెట్లతోపాటు కొన్ని మందులు, సిరంజులు, కిట్ బ్యాగ్‌లు, ఆహార పదార్థాలు అక్కడ స్వాధీనంచేసుకున్నారు. దాడి నుంచి తప్పించుకున్న మావోయిస్టుల కోసం గ్రేహౌండ్స్, ప్రత్యేక పోలీస్ పార్టీ కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. జీకే వీధి నుంచి మందపల్లి, పుట్టకోట మీదుగా సరిహద్దు ప్రాంతాల వరకూ గాలింపు నిర్వహిస్తున్నాయి. కాగా, ఎదురుకాల్పులు చోటు చేసుకోవడం వాస్తవమేనని చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా తెలిపారు. కాగా, కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీ తీగలమెట్టలో 2021 జూన్ 15న ఎదురుకాల్పులు జరిగాయి. ఆ ఎన్‌కౌంటర్‌లో గాలికొండ దళానికి చెందిన ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. నాటి నుంచి నేటి వరకూ ఈ ప్రాంతంలో ఏ విధమైన సంఘటనలూ జరగలేదు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల సామగ్రి

రాష్ట్రంలో ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగడంతో వాతావరణ అనిశ్చితి నెలకొని మంగళవారం అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతుందని, పగటి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

# పీ-4 తొలి అడుగు పడింది

» బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల 'మెరుగు'

» కోరుకున్న విధంగా ఉపాధి అవకాశాల కల్పన

» పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కలెక్టర్ లక్ష్మీశ

చందర్లపాడు, ఏప్రిల్ 29: మహనీయుడు జగ్జీవన్‌రామ్ జయంతి ఏప్రిల్ 5న ఆయనకు నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబు ప్రారంభించిన పీ-4 పథకం ఆచరణ దిశగా తొలి అడుగులు వేసింది. ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలోని 41 బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు(పారిశ్రామిక వేత్తలు) నాడు ముఖ్యమంత్రి అప్పగించారు. దేశానికే స్ఫూర్తినిచ్చేలా రూపొందించిన ఈ పథకం ప్రారంభించిన 20 రోజుల్లోనే మార్గదర్శకులు కార్యాచరణలోకి దిగారు. సోమవారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జిల్లా కలెక్టర్ లక్ష్మీశల సమక్షంలో ఈ పథకానికి పారిశ్రామిక వేత్తలు శ్రీకారం చుట్టారు. పథకం ప్రారంభం రోజు సీఎం చంద్రబాబు సందర్శించిన ఇంటికి వెళ్లిన కలెక్టర్, ఎమ్మెల్యే ఆ కుటుంబ సభ్యులతో కొద్దిసేపు గడిపారు. ప్రారంభ సభలో వారు సీఎంని కోరిన విధంగా ఆటో, కుట్టుమిషన్, ఇంటి స్థలం ఇస్తున్నామని, త్వరలో ఇల్లు కూడా కట్టిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ సాయంతో బంగారు కుటుంబాలుగా ఉన్న మీరు ఎదిగి మార్గదర్శులుగా తయారు కావాలని వారు ఆకాంక్షించారు.



వెంకట్రావమ్మకు ఇంటి స్థలం కేటాయింపు పత్రాన్ని అందిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

### సీఎం కలను సాకారం చేసే దిశగా...

ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించిన ఇంటి యజమాని వెంకట్రావమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి 'సెంధినీ బయోటెక్' పరిశ్రమ ఆటో రిక్షా అందజేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన మూడు సెంట్ల ఇంటి స్థలం పత్రాన్ని, స్థానిక పారిశ్రామిక వేత్త చందోలు భానుమూర్తి అందించిన కుట్టు మిషన్‌ను వెంకట్రావమ్మకు అందజేశారు. అలాగే నాగరత్నం కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి 'క్రక్స్ బయోటెక్' పరిశ్రమ వారికి ఆటోను అందజేసింది. పారిశ్రామిక వేత్త చందోలు భానుమూర్తి కుట్టు మిషన్ అంద జేశారు. కాగా, లక్ష్మయ్య, రమాదేవి దంపతులను దత్తత తీసుకున్న 'అంబా కోచ్' పరిశ్రమ ఇరువురికీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేసింది. పరిశ్రమ అధినేత అనూరాధ మాట్లాడుతూ, 'మా పరిశ్రమ ద్వారా ఈ కుటుంబాన్ని అత్యున్నత శిఖరాలకు చేరుస్తాం. చంద్రబాబు ఆశించిన పేదరిక రహిత సమాజం కోసం పాటుపడతాం' అని చెప్పారు. మరో నాలుగు బంగారు కుటుంబాలకు చందోలు భానుమూర్తి కుట్టు మిషన్లు అందజేశారు. కొన్ని కుటుంబాలకు అవసరమైన మందులు పంపిణీ చేశారు.

# ఎంపిక కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే

» ఆ నిర్ణయాన్ని సమీక్షించడానికి వీలు లేదు

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

» వినియోగదారుల ఫోరం అధ్యక్షులు, సభ్యుల నియామకంలో వైసీపీ ప్రభుత్వం అధికార పరిధి దాటి వ్యవహరించిందని వ్యాఖ్య

» నెల రోజుల్లో ఎంపిక కమిటీని పునర్నియమించాలి

» 2 నెలల్లో నియామకాలు పూర్తిచేయాలని ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాల వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు, సభ్యుల నియామకం విషయంలో మెరిట్ ఆధారంగా ఎంపిక కమిటీ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాల్సిందేనని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. కమిటీ నిర్ణయాన్ని ప్రభుత్వం తిరిగి సమీక్షించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అభ్యర్థుల గురించి ఏదైనా అదనపు సమాచారం అందితే వివరాలను ఎంపిక కమిటీ ముందు ఉంచాలి తప్ప నియామకాల విషయంలో ప్రభుత్వం నేరుగా నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదని పేర్కొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారీతిన చేపట్టిన కడప, గుంటూరు, నెల్లూరు జిల్లాల వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు.. కడప, తిరుపతి కమిషన్ సభ్యుల నియామకాన్ని రద్దుచేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. అధ్యక్షులు, సభ్యుల నియామకం విషయంలో అప్పటి ప్రభుత్వం అధికార పరిధి దాటి వ్యవహరించిందని పేర్కొంది. నిబంధనల మేరకు నెల రోజుల్లో ఎంపిక కమిటీని పునర్నియమించాలని ఆదేశించింది. ఈ మూడు జిల్లాల వినియోగదారుల ఫోరాల అధ్యక్ష, కడప, తిరుపతి ఫోరాల సభ్యుల పదవుల కోసం దరఖాస్తు చేసుకున్నవారి నేపథ్యం, రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం, ఇతర సమాచారాన్ని పునఃపరిశీలన కోసం ఎంపిక కమిటీ ముందుంచాలని స్పష్టం చేసింది. నియామక ప్రక్రియను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ ఎన్.విజయ్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు, కడప, తిరుపతి ఫోరాల సభ్యుల నియామకాన్ని రద్దుచేస్తూ గతేడాది నవంబరు 15న సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ గుంటూరు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఫోరం అధ్యక్షులు టి.సునీత, అబ్దుల్ రసూల్, జింక రెడ్డి శేఖర్, అనిత, కడప, తిరుపతి ఫోరం సభ్యులు డి.అమృత, నాగశశిధర్‌రెడ్డి గతేడాది ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ధర్మాసనం ఇటీవల తుది విచారణ జరిపింది. కడప, గుంటూరు, నెల్లూరు జిల్లాల వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ అధ్యక్షులు, కడప, తిరుపతి కమిషన్ సభ్యుల నియామకాన్ని రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం సమర్థించింది. చిత్తూరు జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షురాలి నియామక రద్దును పక్కనపెట్టింది.

## టీడీపీ ఖాతాలో బొబ్బిలి మున్సిపాలిటీ

» వైసీపీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

బొబ్బిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపాలిటీ టీడీపీ వశం కానుంది. వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావుపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం మంగళవారం నెగ్గింది. మంగళవారం ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. అవిశ్వాసానికి అనుకూలంగా పది మంది టీడీపీ కౌన్సిలర్లు, తొమ్మిది మంది వైసీపీ రెబెల్ కౌన్సిలర్లు, ఒక స్వతంత్ర కౌన్సిలర్ చేతులెత్తి మద్దతు తెలిపారు. వీరితో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడైన బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే బేబినాయన కూడా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. పది మంది వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా చేతులెత్తారు. ఆర్డీవో రెండు సార్లు లెక్కించి.. అవిశ్వాసానికి అనుకూలంగా 21 మంది, వ్యతిరేకంగా 10 మంది ఓటు వేసినట్లు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిందని వెల్లడించారు.

## పనుల నత్తనడక సహించం

» కాంట్రాక్టర్లు, అధికారులకు నిమ్మల హెచ్చరిక

» త్వరలో హంద్రీ-నీవా పనులను

» సీఎం స్వయంగా పరిశీలిస్తారని వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, వెలిగొండ ప్రాజెక్టు పనులు లక్ష్యాలను చేరుకోకపోవడంపై నిర్మాణ సంస్థలు, అధికారులపై జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల నత్తనడక సహించబోమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన టార్గెట్లను అందుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్‌నాటికి హంద్రీ-నీవా, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి కావలసిందేనని స్పష్టంచేశారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని తన చాంబర్లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో ఆయన సమీక్ష జరిపారు. జిల్లాల్లోని ఎస్ఈలు, ఈఈలు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొన్నారు. ఈ మూడు ప్రాజెక్టుల కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులూ హాజరయ్యారు. హంద్రీ-నీవా పనులను త్వరలోనే క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి పరిశీలిస్తారని, ఆయన పర్యటనలోగా నిర్మాణ వేగం పెంచాలన్నారు. వచ్చే నెల నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ దాకా ప్రాజెక్టు ప్రాంతంలో అంతర్జాతీయ నిపుణులు పర్యటించనున్నారని.. ఆలోగా డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణానికి మూడు కట్టర్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వీటి పనులను సకాలంలో చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు కట్టర్లు, రెండు గ్రాబర్ల సాయంతో 217 మీటర్ల వాల్ నిర్మాణం పూర్తయిందని, మే మొదటివారంలో మూడో కట్టర్‌తో పనులు మొదలుపెడతామని అధికారులు వివరించారు. వర్షాకాలం మొదలయ్యేలోపు ఎగువ కాఫర్ డ్యాంను పటిష్టపరుస్తామని తెలిపారు. బట్రస్ డ్యాంను మే చివరినాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టులో టన్నెల్-2లో బెంచింగ్ లైనింగ్ పనులు ఈ నెలలో నిర్దేశించిన మేరకు పనులు పూర్తిచేయకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులకు వెంటనే టెండర్లు పిలవాలన్నారు.

## ఐదంతస్తుల భవనంపై నుంచి పడి ముగ్గురు తాపీ మేస్త్రీల దుర్మరణం

» మృతుల్లో బావబావమరిది.. తిరుపతిలో విషాదం

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనంపై నుంచి పడి ముగ్గురు తాపీ మేస్త్రీలు మంగళవారం దుర్మరణం చెందారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అండాలయ్య.. మంగళం తుడా క్వార్టర్స్‌లోని హెచ్ఐజీలో నిర్మిస్తున్న భవనానికి ప్లాస్టింగ్ పనులు మంగళవారం మొదలుపెట్టారు. కొయ్యల సారవపై నిలబడి గోడకు ప్లాస్టింగ్ చేస్తుండగా ఉదయం 10.40 గంటల సమయంలో అడ్డసారవ కట్టిన కొయ్యల తాడు ఊడిపోయింది. దీంతో వాటిపై నిలబడిఉన్న పెళ్లకూరు మండలం అక్కగారిపేటకు చెందిన బి.శ్రీనివాసులు, ఒంగోలుకు చెందిన కె.శ్రీనివాసులు, టి.వసంత్ (బావమరదులైన వీరిద్దరూ పదేళ్ల కిందటే వలసొచ్చి శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు) కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ఇద్దరూ మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న మరొకరు 108 అంబులెన్స్ రప్పించే లోపే మరణించారు.

## గుత్తి వద్ద రైలు దోపిడీ

» ఆరుగురి నుంచి నగలు లాక్కెళ్లిన దుండగులు

» అర్ధరాత్రి వేళ.. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ఘటన

గుత్తి/రూరల్, తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి రైల్వేస్టేషన్ ఔటర్‌లో నిలిచి ఉన్న నిజామాబాద్- తిరుపతి (రాయలసీమ) ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12794)లో సోమవారం అర్ధరాత్రి దొంగలు దోపిడీకి పాల్పడ్డారు. ఎస్-2, ఎస్-3, ఎస్-5 బోగీల్లో భయోత్పాతాన్ని సృష్టించారు. తిరుపతి రైల్వే సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటల ప్రాంతంలో అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు లైన్ క్లియర్ చేయడం కోసం రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి శివారులో నిలిపారు. సరిగ్గా ఆ సమయంలో దుండగులు స్లీపర్ కోచ్‌లో కిటికీల పక్కన నిద్రిస్తున్న మహిళా ప్రయాణికుల మెడల్లో నుంచి బంగారు నగలు లాగేశారు. ఇలా ఆరుగురి నుంచి 231 గ్రాముల బంగారు నగలు, కొంత నగదు, ఇతర విలువైన వస్తువులు అపహరించుకుని వెళ్లారు. బాధితులు గమ్యస్థానం చేరిన తర్వాత తిరుపతిలో ఉదయం జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును గుత్తికి బదలాయించారు.

## నేడు 'డీజీపీ' ప్యానెల్ సమావేశం

» ఢిల్లీ వెళ్తున్న సీఎస్ విజయానంద్

» 5 పేర్లతో జాబితా పంపిన రాష్ట్ర ప్రభుత్వం

» ప్రస్తుత డీజీపీ గుప్తాకే అవకాశం!

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ని కేంద్రం ఖరారు చేయనుంది. బుధవారం ఢిల్లీలో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోం శాఖ కార్యదర్శి యూపీఎస్సీ ప్రతినిధితో కూడిన కమిటీ.. డీజీపీ పదవి కోసం ప్రభుత్వం పంపిన ప్యానెల్ జాబితాను పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం సీఎస్ కె.విజయానంద్ బుధవారం ఢిల్లీ వెళ్తున్నారు. ప్రస్తుతం హరీశ్‌కుమార్ గుప్తా డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం పంపిన జాబితాలో ఆయనతో పాటు సీనియర్ ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, మాదిరెడ్డి ప్రతాప్, కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, అమిత్ గార్గ్ ఉన్నారు. కమిటీ వీరిలో మూడు పేర్లను రాష్ట్రప్రభుత్వానికి పంపుతుంది. ఆ ముగ్గురిలో ఒకరిని ప్రభుత్వం ఖరారు చేస్తుంది. గుప్తానే పూర్తిస్థాయి డీజీపీగా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కుగా ఉన్నాయని అంటున్నారు. అదే జరిగితే ఆయన రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతారు.

## ఈసెట్‌కు 35,187 దరఖాస్తులు

» 1 నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఈసెట్-2025)కు ఏపీ, తెలంగాణతో కలిపి 35,187 దరఖాస్తులు వచ్చాయని సెట్ నిర్వాహక కమిటీ చైర్మన్, అనంతపురం జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం ఏపీలో 109, హైదరాబాద్‌లో ఒకటి మొత్తం 110 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మే 1 నుంచి హాల్ టికెట్స్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఆన్‌లైన్ పద్ధతిలో మే 6న.. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు.

## సంపద సృష్టించే కేంద్రంగా అమరావతి

» మంత్రి జనార్దన్‌రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించే కేంద్రంగా అమరావతిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిని నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌దేనని విమర్శించారు. మే 2న రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి ప్రధానమంత్రి మోదీ హాజరవుతున్నారని, ఈసందర్భంగా జరిగే రోడ్ షోను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఖరీఫ్ నాటికి మెరుగైన విద్యుత్ సరఫరా

» మంత్రి గొట్టిపాటి

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ నాటికి వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా జరిగేలా కరెంటు పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలని జలవనరులు, విద్యుత్ సంస్థల అధికారులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# వంద రోజుల్లోనే కిందకు!

ప్రతి వంటవాడూ పరిపాలించగలడు (Every cook can Govern) –ప్రాచీన గ్రీకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని ట్రినిడాడ్ రచయిత, మార్క్సిస్టు చింతకుడు సిఎల్ఆర్ జేమ్స్ అలా స్ఫూర్తిదాయకంగా సంక్షేపించాడు. ఆయనే గత శతాబ్ది మధ్యనాళ్లలో అమెరికా వినోద పరిశ్రమ హాలీవుడ్ ధోరణులను నిశితంగా విశ్లేషిస్తూ అమెరికా ఉదారవాద సంస్కృతి క్షీణముఖం పట్టి నియంతృత్వ పాలకులు ప్రభవించవచ్చుని భావించాడు. జేమ్స్ భయాలు 21వ శతాబ్దిలో, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ రాజకీయ రంగంలోకి వచ్చిన తరువాత నిజమవుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టి నేటితో 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా అమెరికా ప్రజానీకం, మేధో శ్రేణులు, రాజకీయ వర్గాలలోనూ అటువంటి అభిప్రాయాలే గట్టిగా వ్యక్తమవుతున్నాయి. 'అమెరికా రాజ్యాంగం ప్రమాదంలో పడింది. పౌర, మానవ హక్కులు అణచివేయబడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ ఏమైపోయినా ట్రంప్‌కు కావాల్సింది మాత్రం అవధులు లేని సంపూర్ణ అధికారం. నియంతృత్వంలోకి అమెరికా జారిపోతోంది' అని బిల్‌క్లింటన్ ప్రభుత్వంలో కార్మిక శాఖ కార్యదర్శిగా ఉన్న రాబర్ట్ రెయిష్ వాపోయారు.

గత నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలలో అమెరికా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో నమ్మకంతో ట్రంప్‌ను భారీ మెజారిటీతో గెలిపించారు. అయితే పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచీ ట్రంప్ చేపడుతున్న చర్యలేవీ అత్యధికులకు ఆమోదయోగ్యంగా లేవు. పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే ఒక దీవితో సహా ప్రపంచ దేశాలన్నిటిపైనా ఆయన ప్రారంభించిన సుంకాల యుద్ధం తమను తీవ్ర ఆర్థిక మాంద్యంలోకి నెట్టివేస్తోందని అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగానే గత ఎనభై సంవత్సరాలలో ఏ అధ్యక్షుడి వంద రోజుల పాలన కంటే ట్రంప్ తొలి వంద రోజులు (ఇప్పుడేకాదు, మొదటి పర్యాయం కూడా) అధ్వాన్నంగా ఉన్నట్టు అనేక సర్వేలలో వెల్లడయింది.

ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానంతో చిరకాలంగా నమ్మకమైన మిత్రులుగా ఉన్న యూరోపియన్ దేశాలు అమెరికాపై చిరచిరలాడుతున్నాయి. అధికారాన్ని అప్పగిస్తే ఉక్రెయిన్ యుద్ధాన్ని 24 గంటలలో నిలిపివేస్తానన్న ట్రంప్‌ను రష్యా లెక్క చేయడం లేదు. యూరోప్‌లో శాంతి సుదూర గమ్యంగా మిగిలిపోయింది. పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలకే కాదు, తన సొంత కుటుంబ లబ్ధి కోసం కూడా మానవతను హతమారుస్తున్న ఇజ్రాయిల్‌ను ట్రంప్ వెనకేసుకొస్తున్నాడు. భౌగోళిక సామ్రాజ్యవాదానికి మళ్లీ ఊపిరిపోయడానికి సిద్ధమైన ట్రంప్‌కు కెనడా ఓటర్లు తమ పార్లమెంటరీ ఎన్నికలలో చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు. కెనడా 51వ రాష్ట్రంగా అమెరికాలో చేరాలని సతాయిస్తున్న ట్రంప్‌కు వందరోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కెనడియన్లు మంచి గుణపాఠమే చెప్పారు.

అమెరికాను మళ్లీ గొప్పదేశంగా చేయాలన్న ఆరాటంతో ట్రంప్ పూర్తిగా అసంబద్ధ విధానాలను అనుసరిస్తున్నారు. ఏ రంగమూ ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందేందుకు అవి తోడ్పడేవి కావు. విద్యావేత్తలు, విద్యార్థులు, పాత్రికేయులు, మేధావులు, వృత్తి నిపుణులు అందరూ ట్రంప్ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో రగిలిపోతున్నారు. చివరకు ట్రంప్ నియమించిన న్యాయమూర్తులు సైతం ఆయన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ తీర్పులు వెలువరిస్తున్నారు. ఇంతవరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలపై వ్యక్తులు, ప్రభుత్వాలు, వృత్తి సంఘాలు, ప్రజాసముదాయాలు న్యాయపోరాటాలు చేస్తున్నాయి. సమీప భవిష్యత్తులోనే సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్కరించడానికి ట్రంప్ సాహసించవచ్చుని రిపబ్లికన్ పార్టీ వర్గాలే కలవరపడుతున్నాయి. దీన్ని బట్టి అమెరికా 47వ అధ్యక్షుడు ఎంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు.

మాజీ అధ్యక్షుడు జో బైడెన్ గత జనవరిలో వైట్‌హౌజ్ నుంచి నిష్క్రమిస్తూ అమెరికా పాలనా వ్యవస్థ పూర్తిగా బిలియనీర్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. అమెరికాలో ఇప్పుడు అల్పజన పాలన జరుగుతుందనడంలో సందేహం లేదు. ట్రంప్‌కు సన్నిహితులుగా ఉండి వివిధ ప్రభుత్వ విభాగాలకు ఆధ్వర్యం వహిస్తున్న ధనవంతులు అమెరికా ప్రయోజనాల కంటే సొంత లాభానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. దీంతో అమెరికా సమాజంలో అమానవీయమైన మనోవైఖరులు ప్రబలుతున్నాయి. సమాజజీవనంలో సంప్రదాయ విలువలు లుప్తమైపోతున్నాయి. అత్యున్నతస్థాయిలో అమెరికా ప్రభుత్వం తన మహోన్నత ప్రజాస్వామిక చరిత్రను విస్మరించి నిర్లజ్జగా సామ్రాజ్యవాద అభిజాత్యాలకు పోతోంది. అమెరికా ప్రభుత్వం చట్టాల చేత నడుపబడేదేకాని, వ్యక్తులు నిర్వహించేదికాదని అమెరికా సంస్థాపకులలో ఒకరైన జాన్ ఆడమ్స్ ప్రవచించారు. ఆడమ్స్ భావాలకు పూర్తి భిన్నంగా ట్రంప్ ఏలుబడిలో వర్తమాన అమెరికా ఉన్నదని ప్రత్యేకంగా చెప్పాలా?

---

**అబ్రహాం మతాల – యూదు, క్రైస్తవ, ఇస్లాం–కు జన్మస్థలమైన ఫలస్తీనాను సందర్శించి ఆ పుణ్యభూమిలో రక్తపాతాన్ని పోప్ ఫ్రాన్సిస్ తప్పుపట్టారు. అరబ్బు దేశాలలోని ఇస్లామిక్ మత గురువులతో మైత్రిని ఆకాంక్షించి వారితో సౌహార్ద సంబంధాలు నెలకొల్పుకున్నారు. ఇస్లాం, క్రైస్తవ మత గురువులు సంయుక్తంగా ప్రపంచ శాంతికి కృషి చేయాలని కోరిన విశాల హృదయుడు పోప్ ఫ్రాన్సిస్.**

# మానవతను మేల్కొల్పిన మహాత్ముడు

ఉన్నత స్థానాలలోని వ్యక్తుల ప్రసంగాలను ప్రజానీకం శ్రద్ధగా ఆలకించడం కద్దు. వాటి నుంచి స్ఫూర్తి, ప్రేరణ పొందుతారు. అందునా ఆధ్యాత్మిక ప్రముఖుల ప్రవచనాల ప్రభావశీలత ప్రజలపై అధికంగా ఉంటుంది. సాధారణంగా దైవభక్తి ప్రవచనాలను బోధించే మత గురువులు వర్తమాన సామాజిక సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తే, సహజంగానే జనులు అందరూ వాటిని అమితాసక్తితో వింటారు.

ఇటీవల మరణించిన అత్యున్నత క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ నిస్సందేహంగా ఒక విశిష్ట వ్యక్తి. వినయం, కరుణ, శాంతి సందేశాలతో కోట్లాది ప్రజలకు స్ఫూర్తినిచ్చిన సమున్నత ఆధ్యాత్మికవేత్త. మెరుగైన జీవన స్థితిగతులకు ఆరాటపడుతూ అభివృద్ధి చెందిన దేశాలకు వలస వెళ్లిన వారి పక్షాన తన గొంతుక వినిపించిన మహానుభావుడు పోప్ ఫ్రాన్సిస్. అమెరికా, ఐరోపాలు అవలంబిస్తున్న కఠోర వలస విధానాలను విమర్శించి, తమ మాతృభూమిని వదిలి వచ్చిన వారి పట్ల సానుభూతి చూపాలని సంపన్న రాజ్యాల ప్రభుత్వాధినేతలకు పోప్ ఫ్రాన్సిస్ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వలస వ్యతిరేక విధానాలను ఆయన ఆక్షేపించారు. అంతేకాదు, మెక్సికో – అమెరికా సరిహద్దులో సామూహిక ప్రార్థనలు నిర్వహించి వినూత్నంగా తన అసంతృప్తిని వ్యక్తం చేసిన మానవతావాది పోప్ ఫ్రాన్సిస్. ప్రపంచ క్రైస్తవ మత పెద్దగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంప్రదాయాలకు భిన్నంగా ఆయన ఇటలీలోని ఒక జైలుకు వెళ్ళి ఖైదులో ఉన్న అక్రమ చొరబాటుదారుల పాదాలను పవిత్ర జలాలతో అభిషేకించారు. తద్వారా పాశ్చాత్య దేశాలు అనుసరిస్తున్న శరణార్థి వ్యతిరేక విధానాలను ఆయన నిరసించారు. పొట్టకూటి కొరకు వచ్చే పేదలూ మానవులే అని పాశ్చాత్య దేశాల పాలకులకు సందేశమిచ్చారు.

గల్ఫ్ లేఖ

ఆఫ్రికా నుంచి లిబియా మీదుగా వచ్చే శరణార్థులతో సతమతమవుతున్న ఇటలీ అనేక సందర్భాలలో ఆ అభాగ్యులను తీసుకువచ్చే పడవలను తమ తీరప్రాంతాలకు చేరేందుకు అనుమతి నిరాకరించి అవి మునిగిపోవడానికి కారణమై విమర్శలకు గురయింది. అదే విధంగా గ్రీస్‌పై కూడ వలసకారుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ రెండు దేశాల సముద్ర జలాలలో నిరీక్షిస్తున్న




శరణార్థుల వద్దకు వెళ్ళి వారికి సంఘీభావం ప్రకటించిన దైవ పుత్రుడు ఫ్రాన్సిస్. సిరియా నుంచి ఐరోపాకు పారిపోతూ మార్గమధ్యంలో గ్రీసులో చిక్కుకుపోయిన ఒక డజను మంది సిరియన్ ముస్లింలను తన విమానంలో వాటికన్ నగరానికి తీసుకువచ్చిన మానవతామూర్తి పోప్ ఫ్రాన్సిస్.

క్రైస్తవ మత కేంద్రమైన వాటికన్ నగరం స్వయం ప్రతిపత్తి ఉన్న దేశమైనా, అది పూర్తిగా ఇటలీపై ఆధారపడి ఉన్నది. అయినా, పోప్ ఫ్రాన్సిస్ తన అతిథ్య దేశమైన ఇటలీ వలస విధానాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేయడానికి ఎప్పుడూ వెనుకాడలేదు.

మతం ప్రాతిపదికన రక్తపాతం జరుగుతున్న బర్మా, సిరియా, ఫలస్తీనా, సిరియా, ఇరాఖ్, ఇంకా అనేక ఆఫ్రికా దేశాలలో పర్యటించి అక్కడి హింసకాండను ఖండించిన పోప్, మతాలకు అతీతంగా సమస్త మానవాళికి ఒక ఆదర్శ పురుషుడు. అబ్రహం మతాల – యూదు, క్రైస్తవ, ఇస్లాం–కు జన్మస్థలమైన ఫలస్తీనాను సందర్శించి ఆ పుణ్యభూమిలో రక్తపాతాన్ని పోప్ ఫ్రాన్సిస్ తప్పుపట్టారు. అరబ్బు దేశాలలోని ఇస్లామిక్ మత గురువులతో మైత్రిని ఆకాంక్షించి వారితో సౌహార్ద సంబంధాలను పెంపొందించుకోవడంలో ఆయన కొంతవరకు సఫలీకృతులయ్యారు. ఇస్లాం అధ్యాత్మిక ఫత్వాలకు ప్రపంచవ్యాప్తంగా కేంద్రమైన ఈజిప్టు రాజధాని కైరోలోని వేయి సంవత్సరాల చరిత్ర కలిగిన అల్ అజహర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి దాని ప్రధాన గురువు శేఖ్ అహ్మద్ తయూబ్‌తో సమావేశమై సమాలోచనలు జరిపారు. ఇస్లాం, క్రైస్తవ మత గురువులు సంయుక్తంగా ప్రపంచ శాంతికి కృషి చేయాలని కోరిన విశాల హృదయుడు పోప్ ఫ్రాన్సిస్. సహజంగానే ఆయన పట్ల ముస్లిం సమాజాలలో గౌరవాదరాలు పెరిగాయి. మక్కాలో హాజ్ నమాజుకు నేతృత్వం వహించిన ఇస్లామిక్ విద్వాంసుడు శేఖ్ మొహమ్మద్ అల్ ఈసా కూడ వాటికన్‌కు వెళ్ళి పోప్‌తో సమావేశమయ్యారు.

యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ రాజధాని అబుధాబి నగరంలో మూడు మతాలకు కలిపి ఒక చోట ఒకే పరిమాణంలో నిర్మించిన మసీదు, చర్చి, సినగోగ్‌లతో కూడిన అబ్రహం హౌస్ ప్రారంభోత్సవానికి హాజరు కావడం ద్వారా పోప్ ఫ్రాన్సిస్ మతసహన సందేశాన్నిచ్చారు.

భారతదేశంలో క్రైస్తవుల సంఖ్య స్వల్పమే. అయితే భారతీయ క్రైస్తవ జనాభా అనేక దేశాలలోని క్రైస్తవుల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. భారతదేశాన్ని సందర్శించే అవకాశం పోప్ ఫ్రాన్సిస్‌కు రాలేదు. 2017లో ఆయన భారత్‌ను సందర్శిస్తారని భావించినా, అధికారికంగా ఆయనకు ఆహ్వానం అందకపోవడంతో బర్మా, బంగ్లాదేశ్‌కు వెళ్ళారని క్రైస్తవ ప్రముఖులు చెబుతారు, 2021లో ప్రధాని మోదీ వాటికన్‌ను సందర్శించి పోప్‌ను భారత పర్యటనకు అధికారికంగా ఆహ్వానించారు. పోప్ అంత్యక్రియల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వాటికన్‌కు వెళ్ళి ఆయనకు నివాళి అర్పించడం ముదావహం.

రాబోయే కొత్త పోప్‌తో పాటు ప్రపంచంలోని అన్ని మతాల గురువులు మానవీయ విలువలను తమ చేతల ద్వారా బోధిస్తే సమస్త మానవాళిలో సౌభ్రాతృత్వం విలసిల్లుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

---

# కశ్మీర్ విసురుతున్న సరికొత్త సవాళ్లు



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

రాజ్యాలు, ప్రభుత్వాలు అత్యంత బలంగా ఉన్నప్పుడు విముక్తి పోరాటాలైనా, విచ్ఛిన్నకర పోరాటాలైనా ఎంత సుదీర్ఘకాలం జరిగినా విజయవంతమయ్యే అవకాశాలు లేవని ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ నుంచి ఎల్‌టీటీఈ వరకు అనేక సంస్థలు నిర్వహించిన సంఘర్షణలు రుజువు చేస్తున్నాయి. ప్రజాస్వామిక స్ఫూర్తితో పాటు ప్రజాచైతన్యం వెల్లువలా లేనంతవరకూ, శక్తియుక్తులపై సరైన అవగాహన లేనంతవరకూ నెత్తురు టేరులు పారడం తప్ప వేరే ప్రయోజనం ఉండదు. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న సంస్థలకు ఎంత పొరుగు దేశం నుంచి మద్దతు అందుతున్నా మొత్తం భారతదేశ ప్రజల ఆకాంక్షలను అధిగమించి విజయం సాధించడం ఏనాడూ సాధ్యం కాదని ఇప్పటికే తేలిపోయింది. అయినా పహల్గామ్ ఘటనలో అమాయకులైన పర్యాటకుల్ని పొట్టనపెట్టుకోవడం ఉగ్రవాదులకే కాదు, వారిని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు కూడా స్వయంఘాతుక చర్యగా మారిందనడంలో సందేహం లేదు.

'సర్జికల్ దాడుల తర్వాత మోదీ ప్రభుత్వం సీమాంతర ఉగ్రవాదాన్ని దాదాపు అరికట్టింది.' అని హోంమంత్రి అమిత్ షా గత ఏడాది ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 6–8 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో విస్తృతంగా పర్యటించిన అమిత్ షా సరిహద్దుల్లో భద్రతా చర్యలను సమీక్షించారు. అన్ని భద్రతా ఏజెన్సీలు కలిసికట్టుగా సమన్వయంతో జమ్ము కశ్మీర్‌లో శాంతి భగ్నం కాకుండా చూడాలని కోరారు. వాస్తవాధీన రేఖ వద్ద అధునాతన ఎలెక్ట్రానిక్ నిఘా వ్యవస్థల్ని ప్రవేశపెట్టే విషయం కూడా ఆయన చర్చించారు. జమ్ముకశ్మీర్‌లో అమిత్ షా పర్యటించి వచ్చి రెండు వారాలు కాకముందే ఉగ్రవాదులు పహల్గామ్‌లో పెద్ద ఎత్తున పర్యాటకుల్ని కాల్చి చంపారు. 20 నిమిషాల పాటు పర్యాటకుల్ని కాల్చి చంపుతున్నప్పుడు రాష్ట్ర పోలీసుల కానీ, సీఆర్‌పీఎఫ్ కానీ ఒక్కరు కూడా దరిదాపుల్లో లేరు రా, సైన్యం, ఐబీ, బీఎస్ఎఫ్, పోలీసు లేదా ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఏమి చేస్తున్నాయి?

ఈ సంఘటన తర్వాత దేశ ప్రజల రక్తం మరిగిపోయినట్లు దేశ వ్యాప్తంగా వెల్లువలా వచ్చిన ప్రతిస్పందనలు స్పష్టమవుతున్నాయి. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలైంది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసి ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ 11 సంవత్సరాల్లో అడపాదడపా ఉగ్రవాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్ని చర్యలు తీసుకున్నా ఉగ్రవాదుల నెట్‌వర్క్ విచ్ఛిన్నమైనట్లు దాఖలాలు కనపడడం లేదు. 2016లో యూరిలో 14 మంది, 2018లో కుల్గామ్, పుల్వామాలో 56 మందిని, 2023లో రియాసీలో 9 మందిని చంపడం పెద్ద ఘటనలు కాగా అయిదుగురి లోపు బలిగొన్న సంఘటనలు ఎన్నో. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 2024 జూన్ 9 నుంచి 2025 వరకు ఉగ్రవాదుల హింసాకాడకు 60 మందికి పైగా ప్రజలు బలయ్యారు. వీరిలో 33 మంది సైనికులు కూడా ఉన్నారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే పహల్గామ్‌లో ఇంత పెద్ద సంఖ్యలో పర్యాటకుల్ని మతం అడిగి చంపడం ఒక ఎత్తు. 2000 సంవత్సరంలో అమరనాథ్ వెళుతున్న 32 మంది యాత్రికుల్ని ఇదే పహల్గామ్‌లోని నున్వాన్ బేస్ క్యాంప్ వద్ద కాల్చి చంపారు. ఈ నేపథ్యంలో జూలై 3 నుంచి ఆగస్టు 9 వరకు జరగాల్సిన అమర్‌నాథ్ యాత్ర పరిస్థితిపై ఆందోళన నెలకొన్నది. పర్యాటకులపై దాడి చేసి స్థానిక ఆర్థిక వ్యవస్థల్ని భగ్నం చేయాలన్న ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో ఈ పహల్గామ్ దాడి జరిగినట్లు పాక్ సైనికాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ మాటల్ని బట్టి అర్థమవుతుంది. మరి మనకెందుకు ఉప్పందలేదు?

సీమాంతర ఉగ్రవాదం కశ్మీర్‌లో ప్రజలను ఇంకెంతకాలం బలిగొంటుంది? నిజానికి ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి వచ్చి, మొక్కవోని జాతీయవాద దృక్పథం ఉన్న నరేంద్రమోదీ వంటి బలమైన నాయకుడు గతంలో ఎప్పుడూ లేరని ఆయన అభిమానులు సందర్భం వచ్చినప్పుడల్లా చెప్తుతూ ఉంటారు. 'నా కవిత్వం యుద్ధ ప్రకటనతో సమానం. అది ఊకదంపుడు కాదు. అది ఓడిపోయిన సైనికుడి హృదయ స్పందన కాదు, కాని విజయం సాధించాలనుకునే యోధుడి పట్టుదల' అని అటల్ బిహారీ వాజపేయి 2000 సంవత్సరంలో కార్గిల్‌లో పాక్ చొరబాటు తర్వాత ప్రకటించారు. ఆరు రోజుల్లో భారత సైన్యం సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లో ప్రవేశించేందుకు వాజపేయి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుసుకుని అప్పటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్ జోక్యం చేసుకోవడంతో పాక్ చొరబాటుదారులు వెనక్కు తగ్గారు. సంకీర్ణ ప్రభుత్వం నడిపిన వాజపేయి అంత సాహసానికి సిద్ధపడితే నరేంద్రమోదీ లాంటి నాయకుడు ఇంకెంత సాహసం ప్రదర్శించాలి?

కాని పహల్గామ్ ఘటన తర్వాత జరిగిన భద్రతా వ్యవహారాల కేంద్ర కేబినెట్ తొలి సమావేశంలో ప్రకటించిన చర్యలు ఎంతో మృదువుగా ఉన్నాయి. 65 సంవత్సరాల సింధు జల ఒప్పందాన్ని రద్దుచేసినా భారతదేశం పాక్‌కు ఈ నదీజలాల్ని వెంటనే ఆపగలిగిన పరిస్థితి లేదు. సింధూ లోయ నదుల నీటి సంరక్షణ కోసం నిర్మాణ పనులు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకైనా కొన్ని సంవత్సరాలు పడుతుంది. దౌత్య అధికారులను ఉపసంహరించుకోవడం, పాక్ పౌరులను వెంటనే వెళ్లిపొమ్మనడం పెద్ద చర్యలేమీ కాదు.

అయినా పహల్గామ్ సంఘటన భారత రాజకీయాల తీరుతెన్నుల్ని మార్చే అవకాశం ఉన్నది. ఇక నుంచి ఏ బహిరంగ సభ జరిగినా అధికార పార్టీ నేతలు ఈ ఘటన గురించి ప్రస్తావించకమానరు. ఈ ఘటన తర్వాత హిందువులు ఏకం కావాల్సిన అవసరం కనపడుతోందని, ఏకమైతే మనవెవరూ ఏమీ చేయలేరని ముంబైలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. బీజేపీ, సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు ఈ ఘటనను దేశ భక్తిపై భావోద్వేగాలను రగిల్చేందుకు తప్పక ఉపయోగించుకుంటాయి. ప్రజల ఓటింగ్ శైలిపై కూడా ఈ ఘటన ప్రభావం పడక తప్పదు. పహల్గామ్ నేపథ్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్‌తో సహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మోదీ సర్కార్ ఏ చర్య తీసుకున్నా అండగా నిలుస్తామని చెప్పాయి. ఇది మోదీ బాధ్యతను మరింత పెంచింది.

మరోవైపు ఈ ఘటన తర్వాత ఇతర రాజకీయ అంశాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడడం కొంతకాలం వరకు అసందర్భంగా మారవచ్చు. 'ఉగ్రవాదులు కులం అడిగి కాదు, మతం అడిగి కాల్చేశారు. వెళ్లి మోదీకి చెప్పుకోమన్నారు' అన్న వ్యాఖ్యలు చాలా కాలం పాటు ప్రభావం చూపుతాయి. బిహార్‌లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ కుల సమీకరణలకు భిన్నంగా మతం కీలక పాత్ర పోషించే, కనీస ప్రజా సమస్యలు కూడా పక్కతోవన పట్టే అవకాశాలు లేకపోలేదు. దేశ రాజకీయాల్లో ముస్లింల ప్రాతినిధ్యం మరింత తగ్గిపోయేందుకు ఇది ఆస్కారం కలిగిస్తుంది. ఇండియా కూటమి రానున్న రోజుల్లో తమ వ్యూహరచన విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితులు కనపడుతున్నాయి. ఈ విషయం తెలిసినందువల్లే ఈ సంఘటన జరిగిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన విదేశీ పర్యటనను రద్దు చేసుకుని వచ్చి బిహార్‌లో బహిరంగ సభలో పాల్గొని ఇంగ్లీషులో హెచ్చరికలు చేశారు! అంటే పహల్గామ్‌పై అంతర్జాతీయ సమాజానికి ఒక సందేశం పంపడం కూడా ఆయన ఉద్దేశం. పహల్గామ్ నేరస్థుల్ని పాతిపెట్టేందుకు సమయం ఆసన్నమైందని, వారు ఊహించిన దానికంటే ఎక్కువ శిక్షపడుతుందని ఆయన అన్నారు. 'తాము తక్షణం బలమైన చర్యలు ప్రారంభిస్తాం' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా చెప్పారు. ఈ హెచ్చరికల అర్థం ఏమిటి? గాజాలోని హమాస్ స్థావరాలపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ లాగా మోదీ పాక్‌పై దాడులు చేయిస్తారా లేక కేవలం బిహార్, బెంగాల్‌లో ఎన్నికల ప్రయోజనాలు పొందేందుకే ఈ వాతావరణాన్ని ఉపయోగించుకుంటారా అన్నది వేచి చూడాల్సి ఉన్నది. ప్రజలు బహిరంగ సభల్లో ఇలాంటి హెచ్చరికలకు ఇప్పటికే అలవాటుపడ్డారు. పుల్వామా విషయంలో జరిగినట్లు కాకుండా మోదీ తన రాజకీయ ప్రయోజనాలు, మనుగడకు మించి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా ప్రజల్లో మతం, జాతీయవాదం, దేశభక్తి కలిసిపోయి ప్రతిదానిపైనా ఉద్వేగ పూరితంగా స్పందించే తత్వం పెరిగింది. అనేక ప్రాంతాల్లో ప్రజలు బయటకు వచ్చి పాక్ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. వారిని శాంతింపచేయడం అంత సులభం కాదు. ప్రజల భావోద్వేగాలు నేతలకు అనుకూలంగా మారినప్పుడు ఆ అనుకూలతే ఒకోసారి సింహంపై స్వారీలాగా మారుతుంది.

మరో వైపు కశ్మీర్ మరింత అంధకార బంధురమయ్యే పరిస్థితులు లేకపోలేదు. 'మేమిక్కడ జన్మించడమే మా దురదృష్టం' అని కశ్మీరీ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత అజుర్ దా శ్రీనగర్ నుంచి పంపిన వాట్సాప్ సందేశంలో చెప్పారు. ఇటీవలి కాలంలో పహల్గామ్ తదితర అందమైన ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం ప్రారంభమైంది. బ్లూమ్స్ బరీ లాంటి సంస్థలు కశ్మీర్ ప్రకృతి సౌందర్యంపై, మారుతున్న ప్రజా జీవనంపై కాఫీ టేబుల్ బుక్స్‌ను ప్రచురించాయి. ఇప్పుడు మళ్లీ పర్యాటక స్థలాలన్నీ మూసివేస్తున్నారు. కశ్మీర్‌కు మంచి రోజులు వచ్చాయి అని ప్రభుత్వం ఇప్పట్లో చెప్పుకునే పరిస్థితి కనపడడం లేదు.

నిజానికి 31 సంవత్సరాల క్రితమే పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1994 ఫిబ్రవరి 22న ఆక్రమిత కశ్మీర్ నుంచి పాక్ ఖాళీ చేయాలని, లేకపోతే తామే దాన్ని విముక్తం చేస్తామని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అప్పుడు ప్రతిపక్ష నేతగా అటల్ బిహారీ వాజపేయి ఉన్నారు. ఈ తీర్మానాన్ని అమలు చేసేందుకు ఇప్పుడు సమయం ఆసన్నమవలేదా? గతంలో లాహోర్ వరకు మన సైన్యం వెళ్లినా అంతర్జాతీయ ఒత్తిడులకు లోనై వెనక్కి తగ్గాల్సి వచ్చింది. మోదీ వాటికి భిన్నంగా వ్యవహరిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)




**నిజానికి 31 సంవత్సరాల క్రితమే పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1994 ఫిబ్రవరి 22న ఆక్రమిత కశ్మీర్ నుంచి పాక్ ఖాళీ చేయాలని, లేకపోతే తామే దాన్ని విముక్తం చేస్తామని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అప్పుడు ప్రతిపక్ష నేతగా అటల్ బిహారీ వాజపేయి ఉన్నారు. ఈ తీర్మానాన్ని అమలు చేసేందుకు ఇప్పుడు సమయం ఆసన్నమవలేదా?**

---

# సౌభ్రాతృత్వమే సామాజిక ధర్మం

భారతీయ మహోన్నత్వాన్ని ఈ ప్రపంచానికి అందించిన తత్వవేత్తలలో బసవేశ్వరుడు అగ్రగణ్యుడు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక కోణాలలో సంఘసంస్కరణకు కృషిచేసిన 12వ శతాబ్దపు అభ్యుదయవాది ఆయన. వచన కవిగా, ఆధ్యాత్మికవేత్తగా, రాజనీతిజ్ఞుడుగా ఆయన అందించిన బోధనలు, బసవతత్వం మానవాళికి నిత్య చైతన్య స్ఫూర్తిగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా బసవేశ్వరుని జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తున్నది.


సర్వజన హితాన్ని కాంక్షించి, విశ్వ మానవ ప్రేమను బోధించిన తొలి సంస్కర్తగా, విశ్వజ్యోతిగా పిలవబడే మహాత్మా బసవేశ్వరుని విగ్రహాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలతో పాటు భారత పార్లమెంటు ఆవరణలో ఏర్పాటయ్యాయి. భారత ప్రభుత్వం 2006లో ఐదు రూపాయలు, 100 రూపాయల నాణాలను బసవేశ్వరుని బొమ్మతో ముద్రించి, ఆ మహాత్ముని స్మరించుకుంది. లండన్‌లో బసవేశ్వరుని విగ్రహాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. బసవేశ్వరుడు తెలిపిన ప్రజాస్వామ్య మానవీయ విలువలను నేటికీ అధ్యయనం చేస్తున్నారు.

ఆనాటి సంఘంలోని అంధ విశ్వాసాలను, అసమానతలను బసవన్న ప్రశ్నించాడు. వేళ్లూనుకున్న సామాజిక రుగ్మతలపై సమర శంఖం పూరించాడు. శాసించడానికి అలవాటుపడిన సంప్రదాయ రాజ్యసభను, సమస్యలకు పరిష్కారాలు చూపే వేదికగా మలచాడు. నేటి చట్టసభలకు (పార్లమెంటరీ విధానం) మాతృకగా నాడు బసవన్న అమలు పరిచిన అనుభవ మండపాన్ని పేర్కొంటారు. ధర్మాధర్మాలు, సంప్రదాయాలు, పాలకుల శాసనాలు సకల జనులకూ ఒక్కటేనన్నాడు.

కర్ణాటకలోని బీజాపూర్ జిల్లా ఇంగులేశ్వర బాగేవాడిలో 1134లో మాదిరాజు, మాదాంబిక దంపతులకు బసవన్న జన్మించాడు. అక్క నాగమ్మ చెప్పిన శివశరణుల కథలు బాల్యం నుండే బసవన్నకి బోధపడ్డాయి. ఆడంబరాల పూజల కన్నా నిర్మల హృదయంతో చేసే భక్తిపూర్వక పనులు గొప్పవని గ్రహించాడు. ఉపనయనం చేయబోతే అక్కకు లేని ఉపనయనం నాకెందుకు? అని లింగ వివక్షతను ప్రశ్నించాడు. మనస్తాపంతో కూడల సంగమేశ్వరం చేరి విద్యాభ్యాసంలోనే పురాణాలు, అన్ని ఆగమాలు, జైన, బౌద్ధ, చార్వాక ధర్మ గ్రంథాలు... అవి ప్రతిపాదించిన తత్వాలను చదివాడు. ఆచరణాత్మకతకు ప్రాధాన్యమిస్తూ అగ్రశ్రేణి తాత్వికుడిగా పరిణతి చెందాడు.

మిత్రుడి ఇంటికి వెళ్లి పరామర్శించడాన్ని తప్పు పట్టిన భార్యతో సాటి మనిషి అంటరానివాడు ఎలా అవుతాడని కుల వివక్షను నిరసించాడు. నిజమైన మానవ ధర్మాలను మరుగునపరిచే, మనుషుల్లో వ్యత్యాసాలు సృష్టించే ఆచారాలు, అంటరానితనం నాకు వద్దని ఆనాడే అర్థం లేని సంప్రదాయాలపై తిరుగుబాటు బావుటా ఎగురవేశాడు.

తదనంతర కాలంలో బిజ్జల రాజు రాజ్యంలో ప్రధానమంత్రిగా నియమితుడైన బసవన్న, పాలనను ప్రజానురంజకం చేశాడు. ఒకవైపు పాలన చూస్తూనే మరోవైపు అసమానతలను సంస్కరించే వినూత్న ఆలోచనలకు పదును పెట్టాడు. శ్రమైక జీవన సౌందర్యానికి ప్రజలను ప్రోత్సహించాడు. కుల వృత్తులను, ఏదో ఒక పని చేయడమే అసలైన ధర్మ మార్గమని బసవన్న బోధించాడు. వృత్తులను బట్టి విభజించబడిన సమాజాన్ని ఏకం చేసి, వృత్తికి.. శ్రమకి.. భక్తికి లంకెవేసి శ్రమ చేసే వారికే అగ్రస్థానం కల్పించాడు; దేవుని స్పర్శకు కొందరిని, దేవాలయ ప్రవేశానికి మరికొందరిని దూరంగా ఉంచే కట్టుబాట్లను తన వినూత్న మార్గంతో బసవేశ్వరుడు బద్దలు కొట్టాడు. ఖర్చుతో కూడిన వైభవకు పూజలు వద్దన్నాడు. కులం, లింగం, వర్గాలతో సంబంధం లేకుండా ప్రతి మనిషి లింగాన్ని ధరించే లింగాయత ధర్మాన్ని స్థాపించాడు; శ్రమ ద్వారా లభించిన ఫలితంతోనే సేవ చేయాలన్నారు బసవన్న. అక్రమంగా కూడబెట్టినది, పెద్దలిచ్చిన సంపద దాసోహం(సేవ)కు పనికిరాదని, ధనం కచ్చితంగా శ్రమ మూలంగా వచ్చినది అయి ఉండాలని చెప్పారు. తమ వృత్తులను దైవ స్వరూపంగా భావించే పద్ధతిని చూపించాడు; ఆధ్యాత్మిక, ఆర్థిక, సామాజిక, పాలనాపరమైన నిర్ణయాలను చర్చించి నిర్ణయించే విధానాన్ని వేయి సంవత్సరాలనాడు బసవన్న అనుభవ మంటపం పేరుతో మహాగృహాన్ని నిర్మించాడు. ఇది నేటి పార్లమెంటరీ విధానానికి మాతృకగా చెబుతారు. జాతి, మత, ప్రాంత, లింగ విభక్తులు లేకుండా సర్వజనులకు ఇందులో స్థానం కల్పించాడు. మహిళలకు తగిన ప్రాధాన్యం ఇచ్చాడు. బసవన్న తన సిద్ధాంతాలపై చర్చాగోష్ఠులు చేయించి, అంగీకారం పొందినవే ఆచరింపజేశాడు.



ఈ అనుభవ మండపం చర్చల్లో వేల సంఖ్యలో పాల్గొన్న ప్రజల ద్వారా ధర్మం, మానవత్వం నియమాలు విశ్వవ్యాపితమయ్యాయి.

12వ శతాబ్దంలోనే సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక సంస్కరణలను ఏక కాలంలో తన బోధనల ద్వారా ఆనాటి సమాజాన్ని సంస్కరించడమే కాకుండా మానవజాతి ఉన్నంతవరకు ఆచరింపదగిన మహోన్నత తత్వమార్గాన్ని అందించిన విశ్వగురువు మహాత్మా బసవేశ్వరుడు. క్రీస్తుశకం 1196లో ఆయన పరమాత్మ సన్నిధికి చేరుకున్నారు. ఆయన అందించిన మార్గాన్ని ఆచరిస్తూ, విశ్వ మానవ సౌభ్రాతృత్వమే భారతీయ జీవన విధానమని ప్రపంచానికి చాటిచెబుదాం.

● సి. యాగంటీశ్వర్
రచయిత, పర్యావరణవేత్త

(నేడు బసవేశ్వర జయంతి)

---

# విభజన సమస్యలన్నీ పరిష్కరించాలి

నేటి విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పనులను మళ్ళీ పునః ప్రారంభించడానికి మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ అమరావతికి రావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నది. భారతదేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే చలామణి అవుతున్నది. రాష్ట్రం విడిపోవడం ఒక తప్పు అయితే... పది సంవత్సరాలు గడిచినా, సరైన రాజధాని లేకపోవడం మరొక తప్పు. అమరావతి పనులతో పాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను పరిష్కరించాలని ఆంధ్రులు ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు 100కు పైగా ఉన్నాయి. వీటిలో ఎన్.ఆర్.ఐ.డి., ఐ.సి.యం. (ఇన్‌స్టిట్యూట్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్) లాంటివి ముఖ్యమైనవి. ఇంకా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వంటి శిక్షణా సంస్థలు అనేకం అమరావతిలో ఏర్పాటు కావలసి ఉంది. రిజర్వు బ్యాంక్‌తో పాటు బ్యాంకింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఏర్పాటు కావలసి ఉన్నది. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో ఉన్న బస్‌భవన్ స్థలం రెండు రాష్ట్రాలకు సంబంధించినది. ఇంచుమించు రెండు వేల ఎకరాలు కలిగిన ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఇప్పుడు తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో నడుస్తున్నది), సెంట్రల్ యూనివర్శిటీ వంటి అనేక సంస్థల భూములన్నీ తెలంగాణకే వెళ్ళిపోయాయి. విభజన చట్టం ప్రకారం అనేక సంస్థల ఆస్తులను రెండు రాష్ట్రాలు సమానంగా పంచుకోవాలి.

పది సంవత్సరాల వరకు హక్కు కలిగిన సెక్రటేరియట్ ఆస్తులను జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్‌కు రాసిచ్చారు. జగన్ అభ్యంతరం వ్యక్తం చేయకుండా ముఖ్యమంత్రి హోదాలో ఆమోదం తెలపడంతో కేసీఆర్ కొత్త సెక్రటేరియట్‌ను నిర్మించారు. ఢిల్లీలోని ఆంధ్రాభవన్ ఆస్తుల విభజన కూడా ఇంతవరకు జరగలేదు. తెలంగాణ నుంచి, అనేక సంస్థల నుంచి నిబంధనల మేరకు భారీగా బకాయిలు (లక్ష కోట్లకు పైన) రావలసి ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వనప్పుడు కేంద్ర ప్రభుత్వం అయినా ఆ నష్టాన్ని భరించవలసి ఉంది. అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు... అనే విధంగా కేంద్రం ఇవ్వక... తెలంగాణ త్యాగం చేయకపోవడం వల్ల ఆంధ్రులు కట్టుబట్టలతో విజయవాడకు ఉసూరుమంటూ వచ్చేశారు.

నదీజలాల సమస్య కూడా రోజురోజుకూ తీవ్రం అవుతున్నది. కర్ణాటక, మహారాష్ట్రల కన్న ఘోరంగా కృష్ణా, గోదావరి నదుల మీద ఎగువన ఉన్న తెలంగాణ ఆధిపత్యం చెలాయిస్తున్నది. శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టులు భౌగోళికంగా ఆంధ్రా భూభాగంలో ఉన్నప్పటికీ, విద్యుత్ ప్రాజెక్టులు తెలంగాణ భూభాగంలో ఉన్నందున విద్యుదుత్పత్తి పేరుతో నీటిని అనవసరంగా దుర్వినియోగం చేస్తున్నారు. నీటి కేటాయింపులలో కృష్ణా, గోదావరి బోర్డుల మాటలు తెలంగాణ పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పూర్తిగా ఆంధ్రా భూభాగంలో పోలవరం నుంచి బనకచర్లకు ఏర్పాటు చేయబోతున్న ప్రాజెక్టుకు కూడా తెలంగాణ పాలకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమలోని హంద్రీనీవా కాలువ వెడల్పును, పూడిక తీతను కూడా వ్యతిరేకిస్తున్నారు. ఈ విధమైన అనేక రకాల సమస్యలు విభజన చట్టం ప్రకారం పరిష్కరించడానికి ప్రధానమంత్రి చొరవ చూపవలసి ఉంది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలకులతో పాటు అన్ని రాజకీయ పక్షాలు, సామాజిక మేధావులు, ప్రజలు ఒక తాటిమీదకు వచ్చి నరేంద్ర మోదీ మీద ఒత్తిడి పెంచవలసిన అవశ్యకత ఎంతైనా ఉన్నది.

– తిప్పినేని రామదాసప్పనాయుడు







# 90 శాతం పనులు పూర్తి

## నేటితో పూర్తికానున్న సభాప్రాంగణ పనులు

» ప్రధాని మోదీ భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన ఎస్పీజీ బలగాలు

» రూట్ మ్యాప్ విడుదల చేసిన సీఆర్‌డీఏ

రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే సభా ప్రాంగణం పనులు బుధవారంతో ముగియనున్నాయి. ప్రధాని భద్రతా దళాలు అమరావతి చేరుకుని మోదీ పర్యటించే ప్రాంతాలను జల్లెడపట్టాయి. సభ రూట్ మ్యాప్‌ను సీఆర్‌డీఏ అధికారులు విడుదల చేశారు.

6లో



# గన్నవరం@1 మిలియన్

## పది లక్షల మార్కు దాటిన విజయవాడ ఎయిర్‌పోర్టు!

- 13 లక్షల పైగా ప్రయాణికుల చేరవేత
- పెరిగిన విమాన సర్వీసులు

8లో

# మట్టి మాఫియా!

## నందిగామ మండలం పెద్దవరంలో మట్టి తవ్వకాలు

## ఎంసీ, ఏపీఐఐసీ, అటవీ భూములే లక్ష్యంగా దందా!

నందిగామ మండలం పెద్దవరంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ప్రకృతి సంపదను చెర పట్టింది. ఎంసీ, ఏపీఐఐసీ, అటవీ భూములే లక్ష్యంగా మట్టి తవ్వకాలు చేపట్టింది. భారీ యంత్రాలతో తవ్వి టిప్పర్లలో మట్టిని యథేచ్ఛగా నందిగామ, జగ్గయ్యపేట, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తోంది. టిప్పర్‌కు రూ.10 వేలు చొప్పున వసూలు చేస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులే ఈ మట్టి మాఫియాగా ఏర్పడి కొండలను కరిగించి కోట్లు కొల్లగొడుతున్నట్లు విమర్శలు వి నిపిస్తున్నాయి.

- నందిగామ, జగ్గయ్యపేట, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు ప్రాంతాలకు తరలింపు
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు టిప్పర్ రూ.10 వేలు చొప్పున విక్రయం
- అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కుమ్మక్కై మరీ దోపిడీ
- దెబ్బతింటున్న రోడ్లు.. మళ్లీ ఇబ్బందుల్లో ప్రయాణికులు



అధిక లోడ్‌తో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్

(ఆంధ్రజ్యోతి, నందిగామ): నందిగామ మండలం పెద్దవరం పంచాయతీ పరిధిలోని ఎంసీ(మైనర్స్ సర్క్యూట్ ల్యాండ్స్) భూములు, ఏపీఐఐసీ భూములు, అటవీ భూముల నుంచి మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. భారీ ఎస్కవేటర్ సహాయంతో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. నిత్యం వంద టిప్పర్ల వరకూ మట్టిని వివిధ ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు అదేదో తమ సొంత ఆస్తి అన్నట్లుగా మట్టిని అమ్ముతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు తదితర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భారీగా మట్టిని సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క టిప్పర్‌కు యాభై నుంచి డెబ్బై టన్నుల మట్టిని లోడ్ చేస్తూ అందిన చోట అందిన ధరకు అమ్ముతున్నారు. నిరంతరాయంగా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారానికి అడ్డు లేకుండా ఉండేందుకుగాను ప్రతిపక్ష పార్టీకి చెందిన వారిని కూడా కలుపుకొని దోపిడీ చేస్తున్నట్లు తెలిసింది. వైసీపీ నేతలు, వైసీపీకి ఓటు వేసిన వారంటే మాకు గిట్టదు అన్నట్లు సవాళ్లు విసిరే అధికార పార్టీ నాయకులు దోపిడీ విషయంలో మాత్రం అన్నదమ్ముల్లా మెసలడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్లన్నీ మళ్లీ ధ్వంసం

వైసీపీ పాలనలో విధ్వంసానికి గురైన రోడ్లకు కూటమి ప్రభుత్వం అతి కష్టం మీద ప్యాచ్‌లు వేయించింది. అవసరమైన చోట మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసింది. భారీగా దెబ్బతిన్న చందర్లపాడు మండలం కాండ్రపాడు నుంచి నందిగామ మండలం చెర్వుకొమ్ముపాలెం వరకూ 2.8 కిలోమీటర్లు రూ.98 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. మూడు నెలల క్రితమే నిర్మించిన ఈ రోడ్డుపై అక్రమార్కులు అధిక లోడ్‌తో మట్టి అక్రమ రవాణా చేస్తుండటంతో తిరిగి దెబ్బతినే స్థితికి చేరుతోంది. నిన్నమొన్నటి వరకూ అధ్వాన్నంగా ఉన్న రోడ్లపై అతికష్టంగా ప్రయాణించిన ప్రజలకు కూటమి ప్రభుత్వం అందించిన సదుపాయాన్ని అక్రమార్కులు చిదిమివేస్తున్నారు. ఇదేవిటని ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పార్టీ పెద్దలు, పోలీసుల పేర్లు చెప్పి ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి దోపిడీతో రూపు మారుతున్న ఏపీఐఐసీ భూములను, ఎంసీ భూములను రక్షించాల్సి ఉంది.



ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు జరుపుతున్న అక్రమార్కులు

### ఏపీఐఐసీ భూముల్లో భారీగా గోతులు

గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పెద్దవరం వద్ద 1100 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించింది. ఏపీఐఐసీ సుమారు వంద కోట్లతో ఆ భూమిని అభివృద్ధి పరిచి పరిశ్రమలకు విక్రయించేందుకు సిద్ధం చేసింది. ఆ భూముల నుంచి సైతం అక్రమార్కులు మట్టిని కొల్లగొడుతున్నారు. రోడ్లు ధ్వంసం చేస్తున్నారు. ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో పరిశ్రమల కోసం సిద్ధం చేసిన భూమిని గోతులమయంగా మారుస్తున్నారు. ఇదే తీరు కొనసాగితే ఏపీఐఐసీ మరో వంద కోట్లు వెచ్చించినా ఆ భూములను పరిశ్రమల కోసం సిద్ధం చేయలేని స్థితి నెలకొంటుంది. మరో వైపు ఆధ్యాత్మికతకు, ఆహ్లాద వాతావరణానికి నెలవైన పల్లగిరి, రామవాపురం కొండలను కూడా కరిగించేస్తున్నారు. ఇంత పెద్దయెత్తున మట్టి దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా పవిత్రమైన ఆ కొండలను నాశనం చేస్తున్నారు. ఏసీపీ, ఆర్డీవో, తహసీల్దార్, మైనింగ్ కార్యాలయాలకు అతి సమీపంలో ఉన్న ఈ రెండు కొండలు దోపిడీకి గురి కావడం పట్ల ప్రజలు విస్మయం చెందుతున్నారు. సాధారణ ప్రజలు ఒక బొచ్చ మట్టి తెచ్చుకుంటే వెంటాడి పట్టుకొనే అధికారులు ఎందుకు మిన్నకుండి పోతున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి అక్రమార్కుల చెర నుంచి మట్టిని రక్షించాల్సి ఉంది.

● ముప్పాళ్లలో పీ4 పండుగ



8లో

ఆటో సాయం పొందిన బంగారు కుటుంబం సభ్యుడితో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 పథకం అమలుతో ఎన్టీఆర్ జిల్లాలోని ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించిన ఇంటి యజమాని వెంకట్రావమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి సెంథినీ బయోటెక్ పరిశ్రమ ఆటో రిక్షా అందజేసింది. నాగరత్నం కుంటుబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి క్రక్స్ బయోటెక్ పరిశ్రమ ఆ టోను అందించింది. లక్ష్మయ్య, రమాదేవి దంపతులను దత్తత తీసుకున్న అంబా కోచ్ పరిశ్రమ ఇరువురికీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేసింది. చంద్రబాబు ప్రారంభించిన ఈ వినూత్న కార్యక్రమం వేగంగా అమలు జరగడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు జిల్లాకు తెలంగాణ సీఎం

» మాజీ మంత్రి దేవినేని ఉమా కుమారుడి వివాహానికి హాజరుకానున్న రేవంత్‌రెడ్డి

» నూతన దంపతులను ఆశీర్వదించనున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం కృష్ణాజిల్లా వస్తున్నారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు తనయుడు నిహార్ పెళ్లి వేడుకలకు హాజరుకానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ దగ్గర దిగుతారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో కంకిపాడులోని 'అయాన' కల్యాణ మండపానికి చేరుకుని వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం హైదరాబాద్ తిరిగి వెళతారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కూడా ఉదయం పెళ్లి వేడుకలకు హాజరుకానున్నారు.

### ఇన్‌చార్జి సీపీగా ఎస్ఎస్ త్రిపాఠి బాధ్యతల స్వీకరణ



విజయవాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్‌గా సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అమెరికా వెళ్లడంతో త్రిపాఠికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఆయన ప్రస్తుతం గుంటూరు రేంజ్ ఐజీగా ఉన్నారు. ఇన్‌చార్జిగా ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తారని ప్రచారం జరిగింది. మే రెండో తేదీన అమరావతి రాజధానిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఉండటం, అటు గుంటూరు రేంజ్, ఇటు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో బందోబస్తు బాధ్యతలను ఒకరే నిర్వహించేలా త్రిపాఠిని ఇన్‌చార్జిగా నియమించారు. మే 11వ తేదీ వరకు ఆయన ఇన్‌చార్జి సీపీగా వ్యవహరిస్తారు.

### బండి రామకృష్ణకు సముచిత స్థానం



8లో

# కొడాలి నాని.. ఇదేం పని!



Note: The estimate was sanctioned previously vide EE/O/GDV/NP(CAP) No:495/2023-24 Dt.13.02.2024 and the estimate was retriggered due to the applicant not paid the estimate charges before 90 days. Hence the revised estimate was sanctioned.

| | | | |
|---|---|---|---|
| Division | : DE OPN GUDIVADA | Section | : AE GUDIVADA RUR EAST |
| Profit Center | : 301100001 | Cost Center | : 301111401 |
| Estimate No. | : E-2023-01-01-11-04-031 | Est. Desc | : E/s@5KW DSC Dandamudi Seshagiri Rao |
| Network No. | : 520000419898 | Est Created Date | : 07.02.2024 |
| Reservation No. | : 8002051125 | Project Type | : LT SCs (New/AL) (Except AGL & Indl) |
| Application No | : 61111N138412024FEB02 | Apl. Group No | : |
| Consumer Name | : DANDAMUDI SESHAGIRI RAO | | |
| C/o : RAMAMOHANA RAO | | Cat : LT1 / Contr.Load : 5 | |

Estimate Status : (ESTIMATE APPROVED)
Estimate Sanctioned No.: EE/O/GDV/NP (CAP) NO:052/2024-25 Dt. 14.06.2024

| | |
|---|---|
| Application Reg. date | 15.06.2024 |

E-2023-01-01-11-04-031 Page 1 of 5 26.04.2025 / 18:54:33 520000419898

దండమూడి శేషగిరిరావు పేరుతో 2024 జూన్ 14న విద్యుత్‌శాఖ తయారు చేసిన ఎస్టిమేట్ అప్రూవుడ్ కాపీ

## డబ్బులు కట్టేది లేదు.. ఏం చేస్తారో చేస్కోండి!

* వివాదాస్పదంగా మాజీ మంత్రి కొడాలి నాని తీరు
* నాని వెంచర్‌లో విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
* కూటమి ప్రభుత్వం వచ్చాక.. విద్యుత్ సిబ్బంది బతిమిలాడినా కట్టని డబ్బులు
* చేసేదిలేక విద్యుత్ సిబ్బందే రూ. 6 లక్షలు కట్టారు!
* దండమూడి శేషగిరి, కాట్రగడ్డ పద్మజ పేరుతో డబ్బు చెల్లింపు
* జూన్ 10న హడావిడిగా అనుమతులు ఇచ్చేసినట్టుగా చూపి.. జూన్ 14న డబ్బులు కట్టించుకున్న వైనం
* దరఖాస్తు చేసిన వారి పేరుతో ఇప్పటికీ మీటర్లు కూడా లేవు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మాజీ మంత్రి కొడాలి నాని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో విద్యుత్ లైన్ల వ్యవహారంలో కొత్త విషయం వెలుగు చూసింది. చేసిన దొంగపని బయట పడుతుందన్న ఉద్దేశంతో డీఈఈ కట్టిన కొంత మేర చెల్లింపులు కూడా ప్రభుత్వం మారే వరకు కట్టలేదన్నది వెలుగు చూసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో.. ఏడీఈ వెంకటేశ్వరరావు, ఈఈ రామకృష్ణ భయపడిపోయారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి కొడాలి నాని దృష్టికి తీసుకు వెళితే నాకేం సంబంధం అన్నట్టు తెలిసింది. తానేమీ దరఖాస్తు చేసుకోలేదని, డబ్బులు చెల్లించేది లేదన్నట్టుగా కొడాలి నాని మాట్లాడటంతో ఏడీఈ భయపడిపోయి ఈఈ దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. దీంతో ఈఈ, ఏడీఈ మీద సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఈఈ కూడా తాను ఇబ్బందుల్లో చిక్కుకుంటానన్న ఉద్దేశంతో ఏడీఈ మీద ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఏడీఈ

మిగతా 6లో..



పచ్చదనం పరుచుకున్న రాజధాని దారులు

# అమరావతి హరిత సోయగం!



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన సభకు విచ్చేసే సందర్శకులకు అమరావతి హరిత సోయగంతో ఆహ్లాదాన్ని పంచబోతోంది.. రాజధానిలోకి అడుగు పెట్టగానే.. ఆహా అనిపించేలా ఎటుచూసినా పచ్చదనం ఉట్టిపడేలా వాతావరణం కల్పిస్తున్నారు. ప్రధాన రోడ్లు, జంక్షన్లు, సభా ప్రాంగణం ఇలా రాజధానిలో ఎటుచూసినా సర్వాంగ సుందరంగా కనిపించేలా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) నందనవనాలను సృష్టించింది. శంకుస్థాపన మహోత్సవానికి వచ్చే అతిథులకు ఆహ్లాదాన్ని కల్పించేలా అమరావతికి హరిత హారాలను అలంకరిస్తోంది.

రాజధాని అమరావతిలోకి ప్రవేశించగానే.. ప్రతి ఒక్కరినీ హరిత సోయగాలు కొత్త అనుభూతులను పంచనున్నాయి. రాజధానిలో ఏ రోడ్డు చూసినా ఉద్యానవనాలను తలపించేలా ఏడీసీఎల్ అద్భుత ఏర్పాట్లు చేపట్టింది. దీనికోసం పెద్దఎత్తున పూలకుండీలు, మొక్కలు తెప్పించారు. రెండు రోజుల్లో మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

- పునర్నిర్మాణ సభకు వచ్చే వారు మైమరిచిపోయేలా..
- ఉద్యానవనంలా ప్రధాన రోడ్లు, జంక్షన్లు, వేదికలు
- వినూత్న అనుభూతి కలిగేలా భారీగా ప్లాంటేషన్
- సందర్శకులకు ఆహ్లాదం పంచేలా ఏడీసీ కృషి



### అందమైన మొక్కలతో ముస్తాబు

రాజధానిలో రోడ్ల వెంబడి ప్రజలను విశేషంగా ఆకర్షించేలా మొక్కలతో రహదారులు, హెలీప్యాడ్, వేదికకు వచ్చే మార్గాలను ఏడీసీఎల్ ముస్తాబు చేసింది. ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి ఆదేశాలతో ఉద్యానవన విభాగం రాజధానిని పచ్చటి వనంగా మార్చివేసింది. ఎన్-9 రోడ్డు ప్రవేశద్వారాన్ని ఖర్జూరం చెట్లతో అందంగా తీర్చిదిద్దారు. ఈ ఖర్జూరం మొక్కల మధ్యన గడిచౌడి పసుపు పూల మొక్కలను నాటారు. చూడటానికి ఈ మార్గం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. వేదిక దగ్గర బోగన్‌విల్లా, ప్లమేరియా పుష్ప జాతుల మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. మందడం గ్రామం దగ్గర ప్రధాన రహదారికి రెండువైపులా డెండ్రోబియం పసుపు రంగు ఆకులతో కూడిన మొక్కల పెంపకం పూర్తయింది. ఈ మార్గం పొడవునా ఇవి అందాన్ని తెచ్చాయి.

### రోడ్ల వెంబడి పచ్చటి తివాచీల్లా..

అమరావతి ప్రధాన రహదారి అయిన సీడ్‌యాక్సెస్ రోడ్డును తివాచీ పరిచినట్టుగా పచ్చటి లాన్, గులాబీ రంగు లాగర్‌స్ట్రోమియా మొక్కలతో అలంకరించారు. ఈ మార్గం హైలెట్‌గా నిలుస్తోంది. సీడ్‌యాక్సెస్ రోడ్డుకు మూడు సెంట్రల్ మీడియంలను చక్కటి పూలచెట్లతో మనసును సాంత్వన పరిచేలా ఉద్యానవనం మధ్య నుంచి వెళుతున్నట్టుగా తీర్చిదిద్దారు. మల్కాపురం ఉద్యానవనం ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ల నుంచి ప్రధాన వేదిక వరకు రోడ్లకు రెండు వైపులా బోగన్‌విల్లా పూల కుండీలను ఏర్పాటు చేశారు. సచివాలయం ప్రవేశ ద్వారం దగ్గర తివాచీ పరిచినట్టుగా ఆకుపచ్చటి లాన్, ఫైకస్ పాండా, మాల్ఫిజియా కోన్, డ్రెస్సినియా మహాత్మా, ఖర్జూరం చెట్లతో అందంగా అలంకరించారు. అమరావతి పునర్నిర్మాణ సభలోకి వచ్చేవారెవరైనా సరే.. ఒక ఉద్యానవనం నుంచి ప్రాంగణంలోకి వచ్చేలా పచ్చదనాన్ని తీర్చిదిద్దారు.

# 90 శాతం పనులు పూర్తి

- పునర్నిర్మాణ సభకు చురుగ్గా ఏర్పాట్లు!
- నేటితో పూర్తికానున్న సభాప్రాంగణ పనులు
- ప్రధాని భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన ఎస్పీజీ బలగాలు
- రూట్ మ్యాప్ విడుదల చేసిన సీఆర్‌డీఏ



తుది దశలో బహిరంగ సభ ఏర్పాట్లు



**(ఆంధ్రజ్యోతి, విజయవాడ)** : అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన నేపథ్యంలో, రాజధానిలో బహిరంగ సభ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. సభ నిర్వహణకు కేవలం రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో.. మే 1 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యం దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే అమరాతిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మరోవైపు కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. ప్రధాని మోదీ భద్రతా దళాలు అమరావతి చేరుకున్నాయి. ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో ఎస్పీజీ దళాలు జల్లెడ పట్టాయి. హెలిప్యాడ్, సభా వేదిక మార్గం దగ్గర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లపై అదనపు డీజీ మధుసూదన్‌రెడ్డి ఎస్పీజీ బృందాలకు వివరించారు. సభకు వచ్చే వారికోసం సీఆర్‌డీఏ అధికారులు రూట్ మ్యాప్‌ను విడుదల చేశారు. సభకు చేరుకునేందుకు మొత్తం 6 రూట్లను నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కరకట్ట మీదుగా సభా ప్రాంగణం వరకు వీఐపీ కారిడార్‌గా నిర్ణయించారు. విజయవాడ వెస్ట్ బైపాస్ నుంచి కూడా సభాస్థలికి వెళ్లటానికి ఏర్పాట్లు చేశారు. మొత్తం ఆరుచోట్ల పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కొద్ది సేపట్లోనే సభా వేదిక దగ్గరకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

# నేటి సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తికావాలి

- అధికారులకు మంత్రి నారాయణ ఆదేశాలు

**అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)** : మే 2న ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో బుధవారం సాయంత్రానికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సచివాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. సమావేశంలో నారాయణ మాట్లాడుతూ.. సభకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆహారం ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశాలుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి సభావేదిక, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. సమావేశంలో నోడల్ ఆఫీసర్ వీర పాండ్యన్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మధుసూదన్ రెడ్డి, గుంటూరు ఎస్పీ, కలెక్టర్ నాగలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రి నారాయణ



బాధితురాలి కుటుంబసభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

# భార్యపై కత్తితో దాడి!

- మరదలికి తీవ్ర గాయాలు
- భార్య పరిస్థితి విషమం
- పరారీలో భర్త



భూమిక

**గుడివాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)** : వ్యసనాలకు బానిసై, అనుమానంతో భార్యపైనే కిరాతకంగా కత్తితో దాడిచేసిన ఘటన పట్టణంలో సంచలనం రేకెత్తించింది. స్థానిక ఇందిరాకాలనీలో నివాసముంటున్న మట్టా అశోక్(28), భూమిక (23)లకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. ఆటోడ్రైవర్‌గా పనిచేసే అశోక్ వ్యసనాలకు బానిసై తరచూ భార్యను వేధించేవాడు. వేధింపులు భరించలేక కొంతకాలంగా భూమిక, పిల్లలతో కలిసి పక్కవీధిలో ఉంటున్న తల్లి రాణి వద్ద ఉంటోంది. మంగళవారం తన దుస్తులను తీసుకువెళ్లేందుకు చెల్లి అనుష్కతో కలిసి భర్త ఇంటికి వచ్చింది. దీంతో వారిమధ్య మాట మాట పెరిగి అశోక్ భూమికపై కత్తితో దాడిచేసాడు. ముఖం, కడుపులో పొడవడంతో తీవ్రగాయాలయ్యాయి. అడ్డుకోబోయిన మరదలికి చేతికి తీవ్ర గాయమైంది. స్థానికులు ఇరువురిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. భూమిక పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నివిత్తం విజయవాడ తరలించారు. భూమిక తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఘటనపై డీఎస్పీ ధీరజ్ వినీల్ విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూమిక, అనుష్కలను పరామర్శించారు. కుటుంబసభ్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితుడు అశోక్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# జగన్ పద్ధతి మార్చుకోవాలి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**వన్‌టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)** : ఎన్నికల్లో 10శాతం మెజార్టీ రాకపోయినప్పటికీ ప్రతిపక్ష హోదా కావాలని జగన్ మాట్లాడటం సరైంది కాదని, జగన్ పద్ధతి మార్చుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హితవు పలికారు. మంగళవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ, ఐదేళ్ల పాటు జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే రాష్ట్ర రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీతో పునర్నిర్మాణ పనులు ప్రారంభించాల్సి వస్తున్నదన్నారు. జగన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు కానీ.. వాటిని సంబంధిత మంత్రులు, ఉన్నతాధికారులకు పంపడని, సొంత నియోజకవర్గమైన పులివెందుల్లో కూడా అర్జీలు స్వీకరించి సమస్యను పట్టించుకో లేదన్నారు. గన్నవరం నియోజకవర్గంలో రైతు సోదరులకు తన సొంత నిధులు వెచ్చించి రూ. కోటిన్నరతో మోటార్లు ఇచ్చినట్టు గుర్తుచేశారు. జగన్ అమరావతిలో నడయాడిన గౌతమ బుద్ధుడి చరిత్రను తెలుసుకోవాలన్నారు. అలాంటి అమరావతిని జగన్ నిర్లక్ష్యం చేశారన్నారు. రాజధాని విషయంలో జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విజయవాడలో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ప్రచారం చేసుకుంటున్నాడే తప్ప ఆయన రాసిన రాజ్యాంగంలోని చట్టాల గురించి తెలుసుకోడన్నారు. రానున్న రోజుల్లో అమరావతి రాజధాని అభివృద్ధి చెంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.





స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

## విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

- 'శ్రీ చైతన్య' స్పోర్ట్స్ మీట్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**విజయవాడ/కంకిపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)** : చైతన్య విద్యా సంస్థలు నాణ్యమైన, మెరుగైన విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ఇష్టమైన క్రీడాంశాల్లో ప్రోత్సహించడం మంచి పరిణామమని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం విజయవాడలో చైతన్య విద్యాసంస్థల రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చైతన్య లాంటి విద్యాసంస్థలు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. అనంతరం శ్రీచైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ మాట్లాడుతూ.. స్పోర్ట్స్ మీట్‌లో రాష్ట్రంలోని 298 బ్రాంచిల నుంచి 2.21 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో 32,780 మందికి జోనల్ స్థాయిలో పోటీలు నిర్వహించగా 1,392 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ జోన్ ఈజీఎం మురళీకృష్ణ, నెల్లూరుజోన్ ఏజీఎం శ్రీకాంత్, రాజమండ్రి ఏజీఎం పార్థసారథి, సురేష్, చిన్మయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

**కలెక్టరేట్/గుణదల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)** : ప్రధాని పర్యటనకు పటిష్ఠ ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మే 2న అమరావతి రాజధాని పనుల పునర్నిర్మాణ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, రూట్ ఆఫీసర్లు, లైజనింగ్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అందరి భాగస్వామ్యంతో ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని దశ దిశ నిర్దేశిస్తున్నారన్నారు. గ్రీన్‌ఫీల్డ్ రాజధాని లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఎటువంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు, పారిశ్రామికవేత్తలు, విద్య, వైద్య వివిధ రంగాలకు చెందిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరే బస్సులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి సుమారు లక్షమంది కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో తాగునీరు, ఆహారం, తదితర అవసరాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. ఏర్పాట్లపై నిరంతర పర్యవేక్షణకు స్థానిక కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి పర్యటనకు జిల్లా నుంచి చేసిన ఏర్పాట్లను మంత్రికి వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ధ్యానచంద్ర, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, విజయవాడ ఆర్డీవో కె.చైతన్య తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

### భారీ బందోబస్తు



సమీక్షా సమావేశంలో అడ్మిన్ డీసీపీ సరిత

ప్రధాని నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత తెలిపారు. కమిషనర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మోదీ గన్నవరం విమానాశ్రయం నుంచి సభావేదిక వద్దకు వెళ్లే మార్గాలన్నీ ఇప్పటికే రూట్ మ్యాప్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. నగరంలో షరతులు ఉన్న రూట్లు మినహా ఇతర మార్గాల్లో నగరప్రజలు రాకపోకలు సాగించేలా చూసుకోవాలన్నారు. వీవీఐపీలు రానుండటంతో ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ బందోబస్తు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ నిలిచిపోతే తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీలు ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ప్రసాద్, ఏడీసీపీలు పాల్గొన్నారు.

# కొడాలి నాని.. ఇదేం పని!

(5వ పేజీ తరువాయి)

రూ. 6 లక్షల మేర రెండు బిల్లుల్లో డబ్బులు చెల్లించాడు. బిల్లు చెల్లింపులు మాత్రం ఇద్దరి పేరుతో ఉన్నాయి. మొదటి బిల్లు దండమూడి శేషగిరి రావు పేరుతో రూ.3,15,020.05, రెండో బిల్లు కాట్రగడ్డ పద్మజ పేరుతో రూ.3,16,450.69 చెల్లించటం జరిగింది. జూన్ 14, 2024వ తేదీన పేమెంట్లు జరిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో విద్యుత్ శాఖాధికారులు ఆదరాబాదరాగా ఈ ఇద్దరి పేర్లతో అప్లికేషన్లు పెట్టించారు. 2022లో పెట్టాల్సిన అప్లికేషన్లను 2024లో పెట్టించి డబ్బులు వారి పేర్లతో కట్టారు. ఈ వ్యవహారం తమకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతో విద్యుత్ శాఖ అధికారులు ఫిబ్రవరి 2, 2024వ తేదీన ఏఈ ఎస్టిమేట్స్ వేసినట్టుగా చూపారు. జూన్ 10వ తేదీన రీ అప్రూవల్ ఇచ్చినట్టుగా చూపారు. అదే రోజున ఏఈకి అంచనాలు పంపించినట్టు.. అక్కడ ఆమోదం పొంది, ఏడీఈకి వాటిని పంపించినట్టు, అక్కడ కూడా ఆమోదం పొందిన తర్వాత డీఈకి పంపించినట్టు, అదే రోజున డీఈ ఆమోదించినట్టుగా చూపారు. జూన్ 10వ తేదీన అంచెలంచెలుగా ఉన్న అధికారులంతా కూడా కూడబలుక్కుని అనుమతులు ఇచ్చేసినట్టుగా ఇచ్చారు. ఆగమేఘాల మీద అధికారులంతా అన్ని అనుమతులు వెంట వెంటనే ఇచ్చేసినట్టుగా చూపించారు.

### డబ్బులు కట్టిన వారికి అసలు మీటర్లే లేవు!

ఎవరైతే అప్లికేషన్ పెట్టినట్టుగా, డబ్బులు చెల్లించినట్టుగా చూపిన దండమూడి శేషగిరిరావు, కాట్రగడ్డ పద్మజ పేరుతో అసలు మీటర్లే లేవు. దీనిని బట్టి ఈ పేర్లను పెట్టి అధికారులు డబ్బులు చెల్లించినట్టుగా అర్థమవుతోంది. వీళ్లకి సంబంధించి చూస్తే కేవలం అర కిలోమీటరు మేర మాత్రమే డబ్బులు చెల్లించారు. కానీ, కొడాలి నాని వెంచర్‌లో మొత్తం మూడు కిలోమీటర్ల మేర 60 విద్యుత్ స్తంభాలు వేశారు. అలాగే రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టారు. వీటికి ఇంకా రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉన్నా కూడా ఆ మొత్తాన్ని చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం విచారణ జరిపితే డబ్బులు కట్టినట్టుగా చెప్పుకోవటానికి వీలుగా తెలివిగా విద్యుత్ శాఖ అధికారులు ఈ ప్లాన్ వేసినట్టు తెలుస్తోంది.

### నాని తీరుపై విమర్శలు

మాజీ మంత్రి కొడాలి నాని రూ.30 లక్షల విద్యుత్ శాఖ సొమ్మును అప్పనంగా తన వెంచర్‌లో ఖర్చు చేయించటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 2022లోనే తన వెంచర్‌లో మూడు కిలోమీటర్ల పొడవునా విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా డబ్బులు చెల్లించలేదు. విద్యుత్ శాఖ అధికారులు భయపడిపోయి నాని దగ్గరకు వెళితే.. అస్సలు రూపాయి కూడా కట్టనని తెగేసి చెప్పటం కూడా తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. కొడాలి నాని డబ్బులు కట్టనని తెగేసి చెప్పటంతో చేసేదేమి లేక విద్యుత్ సిబ్బందే డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వ సొమ్ముతో అప్పనంగా తన వెంచర్‌లో పనులు చేయించుకున్న కొడాలి నానిపై విచారణకు ఆదేశించాలని స్థానికంగా డిమాండ్లు వస్తున్నాయి.

# రాజధాని ఆకాంక్షలు కూటమి ప్రభుత్వంతోనే సాకారం

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

**అవనిగడ్డ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)**: రాష్ట్ర ప్రజల రాజధాని ఆకాంక్షలను చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాకారం చేస్తోందని, ఈ పనులు ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతగా సభను జయప్రదం చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి అన్నారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేసేందుకు పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సమన్వయ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ రూ.45 వేల కోట్లతో రాజధాని అమరావతి పనులను ప్రధాని మోదీ ప్రారంభిస్తున్నారని, ఐదేళ్ల వైసీపీ పాలనలో నిలిచిన అమరావతి రాజధాని పనులను కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత చంద్రబాబు సారథ్యంలో పనులు పునఃప్రారంభమవుతున్నాయన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షులు మెండు లక్ష్మణరావు, నడకుదుటి జనార్దనరావు, బండే శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు, మత్స్యకార సంఘ నేత లకనం నాగాంజనేయులు, పార్టీ సీనియర్ నేతలు బండే కనకదుర్గ, కర్రా సుధాకర్, మాచవరపు ఆదినారాయణ, గొర్రెపాటి వెంకటరామకృష్ణ, మోర్ల జయలక్ష్మి, పార్టీ ముఖ్య నేతలు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మారెడ్డి పట్టాభి

## దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మహాలక్ష్మీ యాగం నేడు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** అక్షయ తృతీయ సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో కె.రామచంద్ర మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9 నుంచి యాగశాలలో వేదోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.సరోజినీదేవి కుటుంబ సభ్యులతో మంగళవారం దుర్గమ్మ దర్శించుకున్నారు. అనంతరం అధికారులను కలిసి అన్నవితరణకు రూ.1,71,000చెక్కు అందించారు. దర్శనానంతరం వేదాశీర్వాదం అందజేశారు.

# రోడ్డుపైనే వ్యాపారాలు!

- దర్శిపేట జంక్షన్‌లో ఎక్కడపడితే అక్కడ వాహనాల పార్కింగ్
- తరచూ ట్రాఫిక్ జామ్
- పట్టించుకోని పోలీసులు
- ఇబ్బందిపడుతున్న వాహనాదారులు

**(పటమట-ఆంధ్రజ్యోతి)**
ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వయా దర్శిపేట జంక్షన్ మీదుగా రామలింగేశ్వరనగర్ వంతెన వరకు ఉన్న రహదారి కార్లు, ద్విచక్ర వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రామలింగేశ్వరనగర్ నుంచి దర్శిపేట జంక్షన్ మీదుగా ఎన్ఎస్ఎం స్కూల్‌కు తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకువెళ్లి తీసుకువస్తుంటారు. పటమట లంక వాసులు పటమట యలమదలకుదురు వెళ్లేందుకు దర్శిపేట ఐదు రోడ్ల జంక్షన్ నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ టీస్టాల్స్, టిఫిన్ సెంటర్లు, నూడిల్స్ బండ్లు పెట్టడంతో వినియోగదార్లు యథేచ్ఛగా వారి వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసి అల్పాహారాలు తింటుంటారు. దీంతో అక్కడ పదే పదే ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



## విద్యార్థిని జననీకి సన్మానం

**పటమట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** పది పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 600లకు 592 మార్కులు సాధించి భాష్యం స్కూల్ టాపర్‌గా నిలిచిన బొర్రా జననీకి మదర్‌థెరెసా ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. అయ్యప్పనగర్ భాస్కర్‌హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్న బొర్రా జననీని ఆమె తల్లిదండ్రులను ట్రస్టు చైర్మన్ గోగినేని ధనశేఖర్ ఆధ్వర్యంలో సత్కరించారు.

## మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు సేవలు మరువరానివి

**వన్‌టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. వెంకట్రావు వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. కార్యదర్శి గన్నేప్రసాద్, కొత్త నాగేంద్ర కుమార్ (నాగబాబు) వెంకట్రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గొల్లపూడి నాగేశ్వరరావు, మరక శ్రీనివాస్ యాదవ్, బెజవాడ తిరుపతి గౌడ్, దేవర సత్యనారాయణ, బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీతారామయ్య

## ఏరోబిక్స్‌లో సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పతకాలు

**మొగల్రాజపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :** ఏరోబిక్స్ ఫెడరేషన్ కప్ జాతీయ చాంపియన్ షిప్‌లో వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతోపాటు కోచ్ వై.రామ్మోహన్‌ను మంగళవారం పాఠశాలలో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్ర రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కె.శ్రీసరయు (8బీ) అండ ర్ -14విభాగంలో రజిత, ఎం.హిమేష్ (7ఏ) అండర్-14లో వ్యక్తిగత విభాగంలో రజిత, అండర్ డ్యూయల్-11 విభాగంలో బంగారు పతకం, వి.మౌనిక (4డీ) అండర్-11 వ్యక్తిగత విభాగంలో రజిత, అండర్-11 డ్యూయల్ విభాగంలో బంగారు పతకం సాధించారన్నారు. దుబాయ్‌లో నిర్వహించే మూడో ఏషియన్ ఏరోబిక్స్ చాంపియన్ షిప్‌కు భారత జట్టు తరుపున ఎ.శ్రీసరయు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, హెచ్ఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు సొమ్ము చెల్లింపు

**వన్‌టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు నగదు చెల్లిస్తున్నట్లు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దె ప్రసాద్ అన్నారు. విజయవాడ టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ గత ప్రభుత్వం చెల్లించని బకాయిలను కూడా చెల్లించిందన్నారు. రైతులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం చూడాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

## సుందరయ్యనగర్‌లో చోరీ

**పాయకాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** పాయకాపురం సుందరయ్యనగర్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బి.పరమేశ్వరరావు సీటు కవర్లు కుడుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 23న కుమార్తెకు వివాహం చేశాడు. 53గ్రాముల బంగారపు ఆభరణాలు ఇంట్లో బీరువాలో పెట్టాడు. అనంతరం నాలుగు రోజుల తర్వాత చూడగా బీరువాలో ఉండాల్సిన బంగారపు ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితుడు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యర్థాల నుంచి ఎరువుల తయారీపై అవగాహన

**కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :** దక్షిణాది రాష్ట్రాలకు విజ్ఞాన యాత్రకు వెళ్లిన విజయవాడ నగరపాలకసంస్థ కార్పొరేటర్ల బృందం కేరళ రాజధాని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఆ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రాజు విజయవాడ కార్పొరేటర్ల బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడు తూ. 70 రకాల వ్యర్థాల నుంచి ఎరువును తయారు చేసే ప్లాంట్‌లు 70 ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. నగరంలో 64,430 కుటుంబాలకు డెస్ట్ బిన్లు పంపిణీ చేశామన్నారు.



తిరువనంతపురం డిప్యూటీ మేయర్ రాజుకు జ్ఞాపికను అందజేస్తున్న కార్పొరేటర్ల బృందం



ప్రసంగిస్తున్న కోవే ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు గీతా శ్రీకాంత్.. శిక్షణ శిబిరానికి హాజరైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు

# మహిళా వ్యాపారవేత్తలకు సువర్ణవకాశం

### స్టెల్లా కళాశాల్లో వ్యాపార నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**బెంజిసర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు జరిగే వ్యాపార నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరం మంగళవారం మారీస్ స్టెల్లా కళాశాలలో ప్రారంభమైంది. శిబిరాన్ని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ జసింతా క్వాడ్రాస్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జనరల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఔత్సాహిత మహిళా వ్యాపారవేత్తలకు ఈ శిక్షణా శిబిరం సువర్ణవకాశమన్నారు. దీనిని వినియోగించుకోవాలని కోరారు. కళాశాల విద్యార్థినులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందాలని కోరారు. సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తి రంగంలో అనేక వ్యాపార అవకాశాలు గ్లోబల్‌గా పెరుగుతున్నాయన్నారు. తమ సంస్థ ఆహార పరిశ్రమలకు చేయూత నిస్తుందని వివరించారు. కోవే ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళలు తమ ఇంట్లోనే ఆహార ఉత్పత్తులు తయారుచేసి ఈ-కామర్స్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా మార్కెటింగ్ చేసే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యం థీమ్‌తో నాణ్యతతో కూడిన ఉత్పత్తులు తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్స్ కొడాలి కవిత, శ్రావణి జెట్టి తెలిపారు. కార్యక్రమంలో సెల్లా కళాశాల గవర్నింగ్ బాడీ మెంబరు లతా రాజన్, విజయలక్ష్మి, సుశీల, యాళ్ల పద్మలత, కావ్య, భవాని, కల్యాణి పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

**కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :** పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని విజయవాడ నగరపాలకసంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం రామవరప్పాడు రింగ్, బెంజిసర్కిల్, నోవోటల్, కృష్ణలంక హైవే, విద్యాధరపురం ప్రాంతాలను పర్యవేక్షించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తీసివేయాలని సూచించారు. నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రధానమంత్రి మోదీ కార్యక్రమానికి పారిశుధ్య నిర్వహణకు ఇతర మున్సిపాలిటీల నుంచి వచ్చే కార్మికులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ సృజనను ఆదేశించారు. పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, అసిస్టెంట్ కమిషనర్ హెలెన్, శానిటరీ సూపర్‌వైజర్ శివరాం సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర



సమావేశంలో పాల్గొన్న లా బోర్డ్, ముస్లిం జేఏసీ సభ్యులు

## వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమం

### ముస్లిం జేఏసీ సభ్యులు

**లబ్బీపేట, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణల ద్వారా మత విభజన రాజకీయాలు చేస్తుందని రాష్ట్ర వక్ఫ్ జేఏసీ కన్వీనర్ రఫీక్ అహ్మద్ అన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డ్ కార్యాచరణ రాష్ట్రస్థాయి సమావేశం లబ్బీపేటలోని ఒక స్కూల్‌లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రఫీక్ అహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమం రాజ్యాంగ పరిరక్షణ పోరాటమన్నారు. ఈనెల 30 రాత్రి 9 నుంచి 9.15వరకు నివాసాలలో, పరిశ్రమలలో, దుకాణాలలో విద్యుత్ దీపాలు ఆర్పి నిరసన తెలపాలన్నారు. ప్రజాస్వామ్య వాదులను, లౌకిక వాదులను కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ముస్లిం లా బోర్డు సభ్యులు మౌలానా మహమ్మద్ ఇషాక్, మౌలానా జాకిర్ రషాది తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పర్యటన విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలి

**బెంజిసర్కిల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** ప్రధాని మోదీ పర్యటన విజయవంత చేయడానికి ప్రతి ఒక్కరూ భాగ్యస్వాములు కావాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పిలుపునిచ్చారు.మంగళవారం పటమటలంకలోని చెన్నుపాటి గాంధీ నివాసంలో తూర్పు నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం నుంచి 20వేల మందిని సమీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డివిజన్ నుంచి వచ్చే వారిని ఏవిధంగా సభాప్రాంగణానికి తీసుకువెళ్లాలి, అక్కడ ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, పి.సాయి బాబు, సొంగ సంజయ్ వర్మ, జి.నాగేశ్వరరావు, గురుప్రసాద్, ఈశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గద్దె, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన



మాట్లాడుతున్న మేత్రాసన పీఠాధిపతి ఫాదర్ తెలగతోటి జోసఫ్ రాజారావు

## క్రీస్తు అడుగు జాడల్లో నడవాలి

**మొగల్రాజపురం, ఏప్రిల్ 29 ( ఆంధ్రజ్యోతి) :** క్రీస్తు బోధనలను అనుసరించి విశ్వాసులు ఆయన అడుగు జాడల్లో నడవాలని మేత్రాసన పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు కోరారు. మొగల్రాజపురం ఆరో డివిజన్ ఫాతిమా దేవాలయం పదో వార్షికోత్సవం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ దివ్యపూజ అనంతరం మాట్లాడుతూ పొరుగు వారిని ప్రేమించాలన్నారు. విచారణ గురువులు ఫాదర్ మొలుగుమాటి ప్రకాష్ మాట్లాడుతూ పెజ్జోని ఫాదర్ సహకారంతో ప్రారంభమైన చర్చి దినదినాభివృద్ధి చెందుతూ 2015లో ఫాతిమా దేవాలయంగా ఫాదర్ నూతల పాటి కిషోర్ ఆధ్వర్యంలో మారిందన్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఫాదర్ మందపాటి లూయిస్ రాజు, ఫాదర్ పేరం దేవదత్తు తదితరులు పాల్గొన్నారు.

## పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు ర్యాంకులు

**మొగల్రాజపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :** ప్రసిద్ధ మానవ వనరుల అభి వృద్ధి మేగజైన్ ఎడ్యుకేషన్ వరల్డ్ విడుదల చేసిన ఉన్నత విద్యా విభాగం ర్యాంకింగ్‌లో పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 2025-26 సంవత్సరానికి జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు, రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తి కళాశాలలలో మొదటి ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ర్యాంకుల ఎడ్యుకేషన్ వరల్డ్ ఎడిటర్ దిలీప్‌కుమార్ దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఆఫీసర్ జి.చక్రవర్తికి కృష్ణా విశ్వ విద్యాలయం రెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి. బసవేశ్వరరావు సమక్షంలో అందించా రన్నారు. కళాశాల డైరెక్టర్ బాబూరావు మాట్లాడుతూ పాఠ్యాంశాల రూపకల్పన, బోధన, ప్లేస్‌మెంట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సదుపాయాలు, నాయకత్వం పాలనా నాణ్యత వంటి అరు అంశాల ఆధారంగా ర్యాంకులు నిర్ణయిస్తారన్నారు. అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు మలినేని రాజయ్య, పి.లక్ష్మణరావు, కన్వీనర్ లలిత్ ప్రసాద్ అభినందించారు.



ర్యాంకుల పత్రాన్ని అందుకుంటున్న అకడమిక్ ఆఫీసర్ జి.చక్రవర్తి, కేయూ రెక్టర్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు



ఉగ్రదాడిని నిరసిస్తూ నిరసన ప్రదర్శన చేస్తున్న రవాణా శాఖ ఉద్యోగులు

## ఉగ్రదాడి పిరికిపంద చర్య

### రవాణా శాఖ జోనల్ అధ్యక్షుడు రాజుబాబు

**కృష్ణలంక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) :** జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడి ఓ పిరికిపంద చర్య అని రవాణా శాఖ ఉద్యోగుల జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు అన్నారు. డీటీసీ కార్యాలయంలో భోజన విరామ సమయంలో మంగళవారం ఏపీ రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరుల ఆత్మ శాంతించాలని కోరుతూ నివాళులర్పించారు. అనంతరం రాజుబాబు, ఆర్టీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంతటి దారుణానికి పాల్పడిన ముష్కరులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉద్యోగులు భద్రాచలం, ఏవోలు సత్యనారాయణ, చంద్రకళ, జి.ఉషా, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్.ప్రదీప్ కుమార్

## సోలార్ ఎనర్జీ టెక్నాలజీపై అవగాహన

**లబ్బీపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** సూర్యకిరణాలను విద్యుత్‌గా మార్చి పర్యావరణ రహిత విద్యుత్‌ను అందించడమే సోలార్ ఎనర్జీ అని స్మార్ట్ హోమ్ అండ్ ఇండస్ట్రీయల్ సోల్యూషన్స్ డైరెక్టర్ ఎస్.ప్ర దీప్ కుమార్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం సోలార్ ఎనర్జీ టెక్నాలజీ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ, సోలార్ ప్యానల్స్ సూర్యరశ్మిని గ్రహించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే అవి విద్యుత్ బ్యాటరీలో నిల్వ అయి మనకు ఇంటి అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో లభించే సోలార్ విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్షన్ రూల్స్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలి

● ఏపీ స్టేట్ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్

గాంధీనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 1972 పెన్షన్ రూల్స్‌కు సవరణలు చేస్తూ తీసుకువచ్చిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నగరశాఖ తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు తమ మద్దతు ప్రకటించింది. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సూర్యరావు, కేఎస్ హనుమంతరావు మాట్లాడుతూ ఈ సవరణలు అమలు చేస్తే పాత పెన్షనర్లు భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెన్షనర్ల మధ్య వివక్షతకు దారి తీస్తుందని, పెన్షనర్లను రెండుగా విభజించే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, పాత పెన్షనర్లకు అన్యాయం జరగకుండా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్‌లో ఈ చట్టం రాష్ట్రంలోనూ అమలైతే రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడీ నాగేశ్వరరావు, జనార్ధన్‌సింగ్, ఏహెచ్‌ఎస్ ప్రసాద్, నారాయణరావు, సాయిబాబా, రామచంద్రరావు, పీఏ లక్ష్మీ పాల్గొన్నారు.

## రాష్ట్ర బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికలు

పెనమలూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 12న టీపీబీబీఏ సహకారంతో కదిరిలో నిర్వహించే మిస్టర్ ఆంధ్ర, క్లాసిక్ బాడీబిల్డింగ్, ఫిజిక్ స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎంపికలను సింగ్ నగర్ మనోహర్‌జిమ్‌లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల మనోహర్, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. మంగళవారం కానూరు అశోక్‌జిమ్‌లో వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు మే 4న ఆదివారం ఉదయం 9గంటలకు తమ ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 8686771358 నంబరును సంప్రదించాలని కోరారు.

## దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది కాంగ్రెస్సే: పద్మశ్రీ

ఉంగుటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నేతలను పాకిస్తాన్‌కు వెళ్లిపొండి అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఏఐసీసీ మెంబర్ సుంకర పద్మశ్రీ ఘాటుగా స్పందించారు. కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరులోని తన స్వగృహంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టింది, భారత నిర్మాణం చేపట్టడంలో ప్రధానభూమిక పోషించిది కాంగ్రెస్ పార్టీ అన్న విషయం గుర్తుపెట్టుకుని మాట్లాడాలని పవన్‌కల్యాణ్‌కు హితవు పలికారు. కులమతాలకు మీరు అతీతమనుకుని మిమ్మల్ని భుజాలపై మోసిన బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాల ప్రజలు రాజకీయ గుణపాఠం చెప్పేరోజులు దగ్గరలోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. ప్రధాని మోదీ రాజధాని పర్యటన సందర్భంగా ఆత్కూరులోని తన నివాసంలో మంగళవారం ఎస్బీ పోలీసుల హడావుడిపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజధాని అమరావతి ఉద్యమకారులకు సన్మానంచేసే ప్రణాళికను సిద్ధంచేసిన సీఎం చంద్రబాబునాయుడు రాజధాని అమరావతి కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన వారికిచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.

## కొరియర్ సంస్థపై ఫిర్యాదు

వన్‌టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బంగారం కొనుగోలు చేయగా ఓ కొరియర్ సంస్థ ద్వారా డెలివరీ తీసుకోగా అందులో నకిలీ బంగారం ఉందని హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌లోని కళ్యాణ్ హైట్స్‌లో జొన్నకూటి శైలజ కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె ఢిల్లీలో 51 గ్రాముల బంగారు చైన్‌ను ఆర్డర్‌పై చేయించుకుంది. ఆ చైన్‌ను ఢిల్లీ నుంచి దివ్యా లాజిస్టిక్స్ కొరియర్ ద్వారా విజయవాడ గాంధీనగర్‌లోని కొరియర్ ఆఫీస్‌కు వచ్చింది. ఆమె వ్యక్తిగత పనులపై సోమవారం విజయవాడ గాంధీనగర్‌లోని కొరియర్ ఆఫీసుకు వెళ్లి రూ.1,75,000లు నగదు చెల్లించి పార్శిల్‌ను తీసుకుంది. అక్కడి నుంచి ఆమె వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధి బీఆర్‌పీ రోడ్డులోని అమ్మ హోటల్ వద్ద ఉన్న సోదరుడు నల్లూరి రాజేష్ వద్దకు వెళ్లింది. ఆమె పార్శిల్ ఓపెన్ చేసి చూడగా, అనుమానం వచ్చింది. వన్‌టౌన్‌లోని ఓ బంగారు షాపునకు వెళ్లి టెస్ట్ చేయించగా నకిలీదని తేలింది. దీంతో బాధితురాలు కొరియర్ ఆఫీసు వద్దకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించగా మాకు తెలియదంటూ సమాధానం చెప్పారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# గన్నవరం @ 1 మిలియన్

విజయవాడ విమానాశ్రయం తన రాజధాని హోదాను నిలబెట్టుకుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు 13లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేసి 40 శాతానికి పైగా వృద్ధిని సాధించింది. ఎప్పుడో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకసారి 1 మిలియన్ మార్కును సాధించినా జగన్ ప్రభుత్వ హయాంలో తన ఉనికిని చాటుకోలేకపోయింది. ఇన్నాళ్లకు మళ్లీ కూటమి ప్రభుత్వ హయాంలో మరోసారి 1 మిలియన్ మార్కును చేజిక్కించుకుంది.

**పది లక్షల మార్కు దాటిన విజయవాడ ఎయిర్‌పోర్టు!**

- 13 లక్షల మందికి పైగా ప్రయాణికుల చేరవేత
- పెరిగిన విమాన సర్వీసులు
- విజయవాడ నుంచి మొత్తం 50 విమానాల రాకపోకలు



ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ విమానాశ్రయం మరోమారు సత్తా చాటింది. మిలియన్ (10 లక్షల) ప్రయాణికుల మార్క్‌ను అధిగమించి అసాధారణ వృద్ధిని నమోదు చేసింది. 2025 - 26 ఆర్థిక సంవత్సరంలో 13,88,943 మంది ప్రయాణికులను చేరవేసి 40శాతం పైగా వృద్ధిని నమోదు చేసింది. రాష్ట్రంలోనే అత్యధిక వృద్ధి నమోదుతో పాటు దక్షిణ భారత రాష్ట్రాల్లోని ఎయిర్‌పోర్టుల్లో కెల్లా అసాధారణ ప్రగతిని సాధించింది. ఇక్కడి నుంచి ప్రస్తుతం 50 సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. గత 11 నెలల్లో అదనంగా ఏడు కొత్త సర్వీసులు పెరిగాయి. ముంబాయికి 2, విశాఖపట్నానికి 2, బెంగళూరుకు 2, ఢిల్లీకి 1 చొప్పున సర్వీసులు పెరిగాయి. కొన్ని కారణాల వల్ల విశాఖపట్నం 1, బెంగళూరు (షిర్డీ) 1, సర్వీసులు రద్దయ్యాయి. 2017-18 మధ్య కాలంలో విజయవాడ విమానాశ్రయం స్వర్ణయుగాన్ని చవిచూసింది. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా ప్రకటించిన నేపథ్యంలో, రాష్ట్రానికే తలమానికంగా నిలిచింది. రాజధాని ఎయిర్‌పోర్టుగా పేరు గడించింది. రాజధానికి రాకపోకలు, సందర్శకుల సంఖ్య పెరగటంతో పాటు అప్పట్లో విమానయానంపై ప్రభుత్వం చూపిన శ్రద్ధ కారణంగా విజయవాడ విమానాశ్రయ మౌలిక సదుపాయాలు గణనీయంగా పెరిగాయి. విమానాశ్రయ విస్తరణకు భూసమీకరణ కింద భూములను సమీకరించి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు అప్పగించటంతో రాష్ట్రంలోనే అతిపెద్ద రన్‌వే కలిగిన ఎయిర్‌పోర్టుల్లో విజయవాడ అగ్రస్థానంలో కొనసాగుతోంది. రన్‌వే విస్తరణతో పాటు నూతన ఇంటీరియం టెర్మినల్ బిల్డింగ్, అదనపు పార్కింగ్ బేలు, టాక్సీవే, రోడ్ల విస్తరణ, కార్గో టెర్మినల్ నిర్మాణం, పాత టెర్మినల్ విస్తరణ, విమానాశ్రయం పరిసరాల ఆధునీకరణ, విమానాశ్రయ అగ్నిమాపక వ్యవస్థను మెరుగుపరచటం, నైట్ ల్యాండింగ్ సదుపాయాలు వంటివి కల్పించటం జరిగింది. దీంతో విజయవాడ విమానాశ్రయం ఒక్కసారిగా బిజీగా మారిపోయింది. 2017-18 మధ్యకాలంలో మిలియన్ మార్క్‌ను అందుకుంది. గత ఐదేళ్లలో విమానయానం కుంటుపడింది. కరోనా తదనంతర పరిణామాలతో విమాన సర్వీసులు సగానికి తగ్గిపోయాయి. గత ప్రభుత్వం విమానయాన రంగం పట్ల పెద్దగా ఆసక్తి చూపించకపోవటంతో సర్వీసులు తగ్గాయి. సింగపూర్ విమాన సర్వీసు రద్దుతో పాటు, ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు విమానాలు పెద్ద సంఖ్యలో రద్దయ్యాయి. దీంతో విజయవాడ విమానాశ్రయం ప్రాభవాన్ని కోల్పోయింది. మళ్లీ ఈ 10 నెలల్లో ఊపందుకుంది. ఆర్థిక సంవత్సరం ఆఖరుకు వచ్చేసరికి భారీ వృద్ధిని నమోదు చేసింది. ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీ-3, ముంబయి-2, హైదరాబాద్ - 8, బెంగళూరు - 5, చెన్నై - 4, విశాఖపట్నం - 2, కడప - 1, షార్జా - 1 విమాన సర్వీసు చొప్పున మొత్తం 25 విమానాలు విజయవాడ విమానాశ్రయం నుంచి నడుస్తున్నాయి. రాకపోకలతో కలిపి మొత్తం 50 సర్వీసులు నడుస్తున్నాయి. ప్రస్తుతం విమానయాన సంస్థలు విమానాల కొరతను ఎదుర్కొంటున్నాయి. భారీగా ఆర్డర్ కూడా ఇచ్చాయి. కొంత కాలం వేచి చూస్తే విమానయాన సంస్థలకు కొత్త విమానాలు రాగానే ఇక్కడి నుంచి అనేక ప్రాంతాలకు విమాన సర్వీసులు తిరగనున్నాయి. ముంబయికి మూడో సర్వీసు కూడా ప్రారంభం కావటానికి ప్రస్తుతం ఎయిర్ ఇండియా ఆసక్తి చూపిస్తోంది. రద్దు చేసిన షిర్డీ విమాన సర్వీసుతో పాటు, సూరత్, కోల్‌కతా, కేరళ, వారణాసికి దేశీయంగా విమాన సర్వీసులకు డిమాండ్ ఉంది. అంతర్జాతీయ సర్వీసుల విషయానికి వస్తే దుబాయ్, సింగపూర్, మలేషియా, శ్రీలంక దేశాలకు ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదికన డిమాండ్ ఉంది. త్వరలో ఇవన్నీ సాకారమైతే విజయవాడ విమానాశ్రయం 20 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

## బండి రామకృష్ణకు సముచిత స్థానం

● డీసీఎంఎస్ చైర్మన్‌గా కీలక పదవి ● ఢిల్లీలో ఎంపీ బాలశౌరిని కలిసిన రామకృష్ణ



మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిని ఢిల్లీలో కలిసిన బండి రామకృష్ణ

మచిలీపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా మచిలీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి బండి రామకృష్ణను ప్రభుత్వం నియమించింది. జనసేన పార్టీని అంటిపెట్టుకుని, నమ్మకంగా పనిచేస్తున్న ఆయనకు డీసీఎంఎస్ చైర్మన్ పదవి లభించడంతో జనసేన నేతలు ఆయన్ను మంగళవారం కలుసుకుని అభినందనలు తెలిపారు. మచిలీపట్నంలో ఆర్కే గ్రూప్ ఆఫ్ హోటల్స్‌ను, ఆర్కే విద్యాసంస్థను నడుపుతూ మంచి వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో మచిలీపట్నం అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థిగా పోటీచేశారు. ఓటమి పాలైనప్పటికీ పవన్‌కల్యాణ్‌కు నమ్మకస్థుడిగా ఉన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమిపొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటులో భాగంగా పోటీ చేయకుండా ఉండిపోయారు. టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర గెలుపు కోసం నిస్వార్థంగా పనిచేశారు. మచిలీపట్నం అసెంబ్లీ సీటును త్యాగం చేసిన బండి రామకృష్ణకు కూటమి ప్రభుత్వం సముచితస్థానం కల్పిస్తుందని వేచి చూశారు.

2023 అక్టోబరులో చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం జైలులో ఉంచిన సమయంలో చంద్రబాబుకు మద్దతు తెలిపిన పవన్‌కల్యాణ్ 3 రోజులపాటు మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో వారాహి యాత్రలో పాల్గొన్నారు. అప్పట్లో 3 రోజులపాటు బండి రామకృష్ణ ఇంటిలోనే పవన్‌కల్యాణ్ బస చేశారు. దీంతో ఆయనకు అత్యంత నమ్మకస్తుడిగా మారారు. పదవులు ఆశించకుండా పదేళ్లుగా సేవ చేస్తున్నారు. ప్రస్తుతం డీసీఎంఎస్ చైర్మన్‌గా పదవి పొందిన ఆయన మంగళవారం ఢిల్లీలో ఎంపీ వల్లభనేని బాలశౌరిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ నుంచి మచిలీపట్నం వస్తున్న ఆయనకు గన్నవరం విమానాశ్రయం వద్ద మచిలీపట్నం జనసేన నేతలు గళ్లా తిమోతి, కొట్టే వెంకట్రావ్, గడ్డం రాజు, శాయన శివ, వంపుగడవల చౌదరి, పినిశెట్టి వేణు. జనసేన నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, తనకు పదవి ఇచ్చి గౌరవించిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, ఎంపీ వల్లభనేని బాలశౌరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మంగినపూడిలో బీచ్ ఫెస్టివల్

- 15 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ, పడవ పోటీలు
- పారాగ్లైడింగ్, వాటర్ స్పోర్ట్స్..
- ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్ష

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి బీచ్ కబడ్డీ, పడవ పోటీలు, పారాగ్లైడింగ్, వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ బీచ్ ఫెస్టివల్ ఏర్పాటుపై జాయింట్ కలెక్టరు గీతాంజలి శర్మ, మెప్మా పీడీ సాయిబాబు, ఆర్‌అండ్‌బీ, పంచాయితీరాజ్, రెవెన్యూ, పర్యాటకశాఖ అధికారులతో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం సమీక్షించారు. ప్రస్తుతం బీచ్‌కు వెళ్లే రోడ్డును విస్తరించాలని ఆర్ అండ్‌బీ అధికారులను మంత్రి ఆదేశించారు. జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ, పడవ పోటీలు, పారాగ్లైడింగ్, వాటర్ స్పోర్ట్స్, స్టాల్స్, ఫుడ్ కోరుల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్థలాలను పరిశీలించారు. మంగినపూడి బీచ్‌కు వచ్చే వాహనాల రాకపోకలకు అనువైన పార్కింగ్‌పై చర్చించారు. బీచ్‌కు, దత్తరామేశ్వరం, పోలీసు ఔట్ పోస్టు వరకు వచ్చే పర్యాటకులకు అనువైన మార్గంపై సమీక్షించారు. దీనిపై మెప్మా పీడీ సాయిబాబు రూపొందించిన మ్యాప్‌ను మంత్రి పరిశీలించారు. 2018లో బీచ్ ఫెస్టివల్‌కు వచ్చిన పర్యాటకుల సంఖ్య ఈసారి రెట్టింపయ్యే అవకాశాలు ఉన్నాయని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. మంగినపూడి బీచ్‌ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందించేందుకు ప్రణాళికలు రూపొందించామని మంత్రి తెలిపారు. స్వదేశీ దర్శన్ కింద 150 ఎకరాల్లో ఒక మెగా ప్రాజెక్టు డిజైన్ చేసి కేంద్రప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు మంజూరైతే ప్రైవేటు, పబ్లిక్ రంగ సంస్థలు రూ.1500 కోట్లతో స్టార్ హోటల్స్, రిసార్టులు నిర్మించేందుకు ముందుకు వస్తాయని తెలిపారు.



మంగినపూడి బీచ్‌లో పర్యటిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అధికారులు

## ఏపీ ఫైబర్ నెట్‌ను నిలబెట్టండి

● ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ నేతలు శ్రీరామ్, మధుబాబు

ధర్నాచౌక్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మానస పుత్రిక అయిన ఏపీ ఫైబర్ నెట్‌పై దృష్టి సారించి వ్యవస్థలోని సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఫైబర్ నెట్ ఆపరేటర్ల జేఏసీ చైర్మన్, ప్రధానకార్యదర్శులు మిరియాల శ్రీరామ్, పెరుమాళ్ మధుబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరాహారదీక్ష చేపట్టారు. ఏపీ ఫైబర్ నెట్‌ను నిలబెట్టండి.. ఆపరేటర్లను కాపాడంటూ నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబుపై ఉన్న నమ్మకం, భరోసాతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఫైబర్ నెట్‌ను 10 లక్షల కనెక్షన్లకు తీసుకువెళ్లామన్నారు. దురదృష్టవశాత్తు జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఈ వ్యవస్థను విస్మరించడంతో 3 లక్షల కనెక్షన్లు తగ్గి ఆపరేటర్లు తీవ్రంగా నష్టం పోయారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ 3 లక్షల కనెక్షన్లు తగ్గి కేవలం నాలుగున్నర కనెక్షన్లు మాత్రమే ఉన్నాయని ఇవి కూడా పోతే ఆపరేటర్లు రోడ్డున పడే పరిస్థితులు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఓపీజీడబ్ల్యూ ద్వారా ఏపీ ఫైబర్ ప్రసారాలు ఇవ్వాలని కోరారు. ఏపీఎస్ఎఫ్ఎల్ నెట్వర్క్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మెయింటెనెన్స్‌లను తక్షణమే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామయ్య, నారాయణ, నామా గిరి, శాంతికుమార్, నగేష్, బసవయ్య పాల్గొన్నారు.



నిరాహారదీక్షలో పాల్గొన్న జేఏసీ నేతలు

## ముప్పాళ్లలో పండుగ వాతావరణం



కుట్టుమిషన్లు అందజేస్తున్న మార్గదర్శి చందోలు భానుమూర్తి, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

చందర్లపాడు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 29: ఎన్టీఆర్ జిల్లాలో 96వేల కుటుంబాలను పీ4 పథకం ద్వారా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో పీ4 పథకం అమలు కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 5న ముఖ్యమంత్రి స్వయంగా ముప్పాళ్లలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా మార్గదర్శులు బంగారు కుటుంబాలకు ఉపాధికి అవసరమైన సాయం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కింద ముప్పాళ్లలో తొలి విడతగా 41 మందిని గుర్తించామని, ఇది ఈనాటితో పూర్తయ్యే పథకం కాదన్నారు. దశల వారీగా అభివృద్ధికి సాయం కోరుతున్న కుటుంబాలను గుర్తించి మార్గదర్శుల సాయంతో వారిని అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించిన ఇంటి యజమాని వెంకట్రావమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి సెంథినీ బయోటెక్ పరిశ్రమ ఆటో రిక్షా అందజేశారు. అలాగే నాగరత్నం కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శ క్రక్స్ బయోటెక్ పరిశ్రమ ఆటోను అందజేసింది. లక్ష్మయ్య, రమాదేవి దంపతులను దత్తత తీసుకున్న అంబా కోచ్ పరిశ్రమ ఇరువురికీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.

## పీ4 ఒక గేమ్‌చేంజర్

- ముప్పాళ్లలో విజయవంతంగా అమలవుతున్న పథకం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న మార్గదర్శులు, లబ్ధిదారులు

చందర్లపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని ముప్పాళ్ల గ్రామం చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 పథకం అమలుకు ఈ గ్రామం వేదికగా మారింది. ఈ సందర్భంగా గ్రామమంతా పండుగ శోభను అలంకరించింది. లబ్ధిదారులు, మార్గదర్శకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పథకాన్ని తక్కువ కాలంలోనే అభివృద్ధి చేసి అమలు చేయడంపై ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఊహించినట్టే ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా ఈ పథకం రూపుదిద్దుకోవడం ఓ విశేషంగా నిలిచింది. ముప్పాళ్లలోనే మొదటిసారిగా అమలవుతున్న ఈ పథకం ద్వారా ప్రభుత్వ సంకల్పం గ్రామీణ జీవితాల్లో స్పష్టంగా ప్రతిఫలిస్తోంది. ఈపథకం ద్వారా లబ్ధి పొందుతున్న బంగారు కుటుంబాలు, మార్గదర్శులు తమ అనుభవాలను పంచుకుంటూ, ఇది వారి జీవన విధానాన్ని మార్చి తీసుకెళ్తోందన్నారు.

**అరుదైన ఆలోచన.. అనూరాధ, అంబా కోచ్ అధినేత, ముప్పాళ్ల**



సమాజంలో పేదరికాన్ని రూపుమాపే బాధ్యత సమాజంలో ఎదిగిన వారికి అప్పగించే ప్రక్రియ ఎంతో అరుదైన ఆలోచన. అభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేసే దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో మెదిలిన ఈ పథకం సమాజ గమనాన్ని మార్చనుంది. చంద్రబాబు కలను సాకారం చేసేందుకు సాధ్యమైన సాయం చేసేందుకు మా సంస్థ సిద్ధంగా ఉంది.

**సమగ్రాభివృద్ధికి పీ4 దోహదం**

**మణికుమార్, క్రక్స్ బయోటెక్ ప్రతినిధి**



పీ4 పథకం ద్వారా పేద కుటుంబాలు తమ కాళ్లపై తాము నిలబడేలా సాయం చేయడం మంచి పరిణామం. మార్గదర్శుల సాయంతో బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగితే దేశానికే మేలు జరుగుతుంది. మా పరిశ్రమ సాధ్యమైన మేర సాయం అందించేందుకు సిద్ధంగా ఉంది. సీఎం ఆలోచనకు అనుగుణంగా సంస్థ పని చేస్తుంది.



**చంద్రబాబు దార్శనికతకు అద్దంపట్టే పథకం**

**మనోజ్, సెంథిని బయోటెక్ సంస్థ ప్రతినిధి**

ఉపాధి అవకాశాలు పెంచడం ద్వారా పేదలు స్వయం సంవృద్ధిని సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. సంపద సృష్టించడం, కుటుంబాలు ఆర్థిక స్థితిగతులు పెంచేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకం విజయవంతం కోసం మా సంస్థ చిత్తశుద్ధితో ఉంది.

**సామాన్యుల ఊహకందని పథకం**

**చందోలు భానుమూర్తి, పారిశ్రామిక వేత్త**

సమాజంలో ఎదిగిన ప్రతి ఒక్కరూ మరొకరికి సాయం అందించి పైకి తీసుకురావాలన్న సీఎం చంద్రబాబు ఆలోచన ఎంతో విలువైనది. ఆయన ఆలోచనలను గౌరవించి నాకు చేతనైనంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. సాయం పొందిన వారు బాధ్యతగా ముందుకు సాగి ఆర్థికంగా ఎదగాలి.

**దారి చూపిన దైవం**

**కొండ్రు వెంకట్రావమ్మ, బంగారు కుటుంబం లబ్ధిదారు**



ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న మాకు ఉపాధికి ఆటో, కుట్టుమిషన్ ఇప్పించడంతో పాటు ఇంటి స్థలం, ఇల్లు ఇస్తున్న సీఎం చంద్రబాబు మాకు దైవం వంటివారు. ఆయనిచ్చిన అవకాశంతో స్వతంత్రంగా ఎదిగి పీ4 పథకానికి మంచి పేరు తీసుకువస్తాం.

## దేశానికే రోల్ మోడల్‌గా అగ్రి వర్సిటీ

- డ్రోన్స్, ఏఐ టెక్నాలజీలను సద్వినియోగం చేసుకోవాలి
- పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు జరగాలి
- పరిపాలన భవనం నిర్మాణానికి నిధులు
- వజ్రోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి/లాంఫాం (తాడికొండ) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశానికే రోల్ మోడల్‌గా మారిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ విశ్వవిద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా లాం ఫాంలోని వర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే వజ్రోత్సవ వేడుకలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. నూతనంగా నిర్మిస్తున్న పరిపాలన భవనం వద్ద ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయం పైలాన్‌ను, ఆచార్య ఎన్జీ రంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, స్టాల్స్‌ను పరిశీలించారు. ముందుగా విశ్వవిద్యాలయంలోని డ్రోన్ టెక్నాలజీని, డ్రోన్ల పనితీరును పరిశీలించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ క్లాసులో పాఠాలు నేర్పటమే కాకుండా, ఫీల్డ్ లెవల్‌లో పాఠాలు నేర్పి దేశంలోని అన్ని యూనివర్సిటీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పరిపాలన భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు ఎంతైనా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని, డ్రోన్, ఏఐ టెక్నాలజీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం వ్యవసాయంపై విశ్వవిద్యాలయ పుస్తకాలను, సీడీలను విడుదల చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశ్వవిద్యాలయం అభివృద్ధికి వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు రూ.2లక్షల విరాళం ప్రకటించారు. తొలిరోజు వేడుకల్లో వీసీ ఆర్.శారద జయలక్ష్మీదేవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రైతునేస్తం ఫౌండేషన్ అధినేత వై.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



లాంఫాంలో ఎన్జీ రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



మేకప్‌మేన్ శేఖర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, మల్లికార్జునరావు తదితరులు

## ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో మంగళవారం సాయంత్రం ఈ ఉత్సవం ఏర్పాటు చేశారు. 22 మంది నాట్యాచార్యులు పాల్గొన్నారు. వారి శిష్య బృందాలతో వివిధ సంకీర్తనలకు, కృతులకు బృంద నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. నాట్యాచార్యులు దేవరకొండ చంద్రశేఖర్-బ్రహ్మాంజలి, ఎ.సంతోష్-అంబాస్తవం, మూల్పూరి త్రినాథ ఆచార్యులు-ముద్దుగారే యశోద, సప్పా శివకుమార్-భోశంభో, రాయన శ్రీనివాసరావు-శివకైవారం, శారదా రామకృష్ణ-శ్రీశైల మల్లికార్జున శబ్దం, అలివేలు మంగ-శ్రీ గణపతిని సేవించరాదే, శైలశ్రీ-సాంబశివ కీర్తన, పద్మశ్రీ హేమంత్-శివతాండవ స్తోత్రం, ఉషా మాధవి-కులుకక నడవరో, యల్లాజోష్యుల అనురాధ-జై దేవుని అష్టపది, భాగవతుల సౌమ్య-భావములోన, భాగవతుల వెంకట్రామ శర్మ-శంభో మహేదేవ, భాగవతుల శ్రీనివాస శర్మ- ఇదిగో భద్రాద్రి, చింత రవి బాలకృష్ణ-వినరో భాగ్యము, పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు-వారాహి స్తుతి, చదలవాడ ఆనంద్-తిల్లానా, సిహెచ్.అజయ్‌కుమార్-మరకతమణిమయ, చింత వెంకట శివరామకృష్ణ-మండోదరి శబ్దం, ఘంటసాల పవన్‌కుమార్-బృందావన నిలయే, చింత వెంకట్-ఐగిరి నందిని అంశాలకు నర్తించి మైమరిపించారు. నాట్యాచార్యులను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఘనంగా సత్కరించి అభినందించారు.



## మహేశ్ లుక్ లీక్

ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా గురించి ఏ చిన్న విషయం బయటకి రాకుండా మేకర్స్ జాగ్రత్తపడుతున్నారు. హైదరాబాద్, ఒడిసా షెడ్యూల్స్ పూర్తిచేసిన చిత్రబృందం మరో షెడ్యూల్ కోసం త్వరలో విదేశాలకు వెళ్లనుంది. ఈ సినిమా కోసం మహేశ్ లుక్ పరంగా పూర్తిగా మేకోవర్ అయ్యిన సంగతి తెలిసిందే. ఎప్పుడూ లేనంతగా గడ్డం పెంచేశారు. గుబురు గడ్డంలో ఉన్న మహేశ్ బాబు ఫొటోలు లీక్ అయ్యాయి. ఇవి ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూసిన అభిమానులు సూపర్ అంటూ మురిసిపోతున్నారు. కాగా, దాదాపు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా మొదటి భాగాన్ని 2027లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఎన్టీఆర్.. నీల్ విడుదల తేదీ వచ్చేసింది



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. 'ఎన్టీఆర్ నీల్' ఈ సినిమా వర్కింగ్ టైటిల్. ఇటీవలె, ఈ సినిమా షూట్‌లోకి ఎన్టీఆర్ అడుగుపెట్టారు. మొదట ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 9న సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలనుకున్నారు. అయితే ఇప్పుడు విడుదల తేదీ మారింది. కొత్త తేదీని మేకర్స్ మంగళవారం ప్రకటించారు. వచ్చే ఏడాది జూన్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ పోషించే పాత్ర మునుపెన్నడూ చూడనంత శక్తిమంతంగా ఉంటుందని మేకర్స్ పేర్కొన్నారు. మే20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



## అద్భుతమైన విజువల్స్‌తో...

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా కౌశిక్ పెగళ్లపాటి తెరకెక్కిస్తున్న చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన మోషన్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేసింది. తాజాగా, ఈ చిత్రం నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాయిశ్రీనివాస్ చెప్పిన 'అహం మృత్యువు' అనే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.



## ఆలయాన్ని రక్షించిన యోధుల కథ

సునీల్‌శెట్టి, సూరజ్ పంచోలి, వివేక్ ఒబెరాయ్, ఆకాంక్ష శర్మ ప్రధాన పాత్రల్లో ప్రిన్స్ ధిమాన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'కేసరివీర్'. చౌహాన్ స్టూడియోస్, పనోరమ స్టూడియోస్ బ్యానర్లపై కను చౌహాన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తుగ్లక్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు హమీర్జీ గోహిల్ కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. హమీర్జీ గోహిల్ పాత్రలో సూరజ్ పంచోలి అద్భుతంగా నటించారు. 14వ శతాబ్దంలో ఆక్రమణదారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని రక్షించిన యోధుల కథను ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కించారు. మరో యోధుడు వేగ్డాజీ పాత్రలో సునీల్‌శెట్టి నటించగా, జాఫర్ ఖాన్‌గా వివేక్ ఒబెరాయ్ కనిపించనున్నారు.

## దీక్ష, పట్టుదలతో..




కిరణ్, అలేఖ్యరెడ్డి జంటగా రూపొందుతోన్న చిత్రం 'దీక్ష'. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించడంతో పాటు పి.అశోక్ కుమార్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ప్రేమ, వినోదం నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ మంగళవారం హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాము. హీరో కిరణ్ భీముని పాత్రలో అద్భుతంగా నటించాడు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలెట్‌గా నిలుస్తుంది. పాటలు అద్భుతంగా వచ్చాయి' అని అన్నారు. ఆక్సఖాన్, తులసి, అనూష, కీర్తన తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు.



పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ.. తెలుగు చిత్ర పరిశ్రమలోని ప్రముఖులు కొవ్వొత్తులతో నిరసన చేశారు. ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు మురళీ మోహన్, 'మా' అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠభరితం...



నవీన్ చంద్ర హీరోగా లోకేష్ అజ్లీస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లెవెన్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను అజ్మల్ హరి, రేయా ఖాన్ నిర్మించారు. మే 16న సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను కమల్‌హాసన్ విడుదల చేశారు. సీరియల్ కిల్లింగ్స్ నేపథ్యంలో సాగే ఈ ట్రైలర్ క్షణక్షణం ఉత్కంఠభరితంగా ఉంది. నవీన్ చంద్ర శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రను పోషించారు. రవి వర్మ, కిరీటి దామరాజు, అభిరామి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకాంత్.ఎన్.బి, సినిమాటోగ్రఫీ: కార్తీక్ అశోకన్, సంగీతం: డి.ఇమ్మాన్.



# హజ్ యాత్ర ప్రారంభం

» హైదరాబాద్ నుంచి 260 మందితో తొలి విమానం



మదీనా విమానాశ్రయంలో భారతీయ హజ్ యాత్రికులకు స్వాగతం పలుకుతున్న భారత రాయబారి సుహేల్ ఏజాస్ ఖాన్ తదితరులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ ఏడాది హజ్ యాత్ర ప్రారంభమైంది. భారతదేశం నుంచి హజ్ యాత్రికుల తొలి విమానం మంగళవారం తెల్లవారుజామున సౌదీ అరేబియాలోని మదీనాకు చేరుకోగా, వారికి భారత రాయబారి సుహేల్ ఏజాస్ ఖాన్, కాన్సుల్ జనరల్ ఫహద్ ఖాన్ సూరీ స్వాగతం పలికారు. ఈ విమానం హైదరాబాద్ నుంచి 260 మంది యాత్రికులతో వచ్చింది. ఇందులో కడప నగరానికి చెందిన ప్రముఖ ఇస్లామిక్ పండితుడు అహ్మద్ షమీయాతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారున్నారు. మే 30 వరకు ప్రత్యేక విమానాలు హజ్ యాత్రికులను సౌదీకి తీసుకోస్తాయి. ఈ ఏడాది హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మొత్తం 12 వేల మంది హజ్ యాత్రికులు రానుండగా, వారిలో తెలంగాణకు చెందిన 8 వేల మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 1200 మంది, మిగిలినవారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు రానున్నారు. ఈ ఏడాది దేశం నుంచి లక్షా 30 వేల మంది హజ్ యాత్రకు రానున్నారు.

## నయా సైబర్ మోసం..ఆర్మీ పేరుతో విరాళాలకు విజ్ఞప్తి

» పీఎం కేర్స్ పేరుతో లింకులు.. అదంతా ఫేక్ అంటున్న అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను సైబర్ కేటుగాళ్లు అనుకూలంగా మార్చుకుంటూ.. 'సైన్యం ఆధునీకీకరణకు విరాళాలివ్వండి' అంటూ వాట్సాప్, టెలిగ్రామ్‌తోపాటు.. పలు సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పంపుతున్నారు. అది నిజమేనని నమ్మి నెటిజన్లు విరాళాలు ఇస్తున్నారు. అయితే.. అదంతా ఫేక్ అని, మోసపోవొద్దని ఆర్మీ అధికారులు. సైబర్ నేరగాళ్లు విరాళాల సేకరణకు 'పీఎం కేర్స్' పేరును వాడుకుంటున్నారు. "దేశం కోసం ప్రాణాలర్పించే సైన్యాన్ని బలోపేతం చేయడానికి విరాళాలివ్వండి..".. "సైనికుల పట్ల దేశభక్తిని చాటుకోండి..".. "సైనికుల కోసం రోజుకు ఒక రూపాయి ఇవ్వాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరుతున్నారు..".. అంటూ బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఫొటోలతో ప్రచారం చేస్తున్నారు. ఇదంతా మోసమని తెలియని నెటిజన్లు.. ఆ లింకులను బంధుమిత్రులకు షేర్ చేస్తున్నారు. తాము విరాళమిచ్చామని పేర్కొంటూ స్క్రీన్‌షాట్లను షేర్ చేస్తున్నారని సైబర్ క్రైమ్స్ డీసీపీ కవిత దార పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని నెటిజన్లకు సూచించారు.

## జస్టిస్ మన్మథరావు బదిలీని పునఃపరిశీలించాలని విజ్ఞప్తి

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు బదిలీని పునఃపరిశీలించాలని ఏపీ హైకోర్టు అడ్వొకేట్ అసోసియేషన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేసింది. బదిలీ సిఫారసులను ఉపసంహరించుకోవాలని కోరింది. ఈ నెల 25న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిదంబరం మంగళవారం పేర్కొన్నారు.

## ధార్మిక పరిషత్ అనధికార సభ్యుల రాజీనామా ఆమోదం

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ధార్మిక పరిషత్‌లోని ఐదుగురు అనధికార సభ్యుల రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు దేవదాయ శాఖ కార్యదర్శి విజయ్‌చంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ సర్కారు గతంలో ఉద్దరాజు కాశీవిశ్వనాథరాజు, ఎం.రామకుమార్‌రాజు, సంగ నరసింహారావు, దేవదాయ శాఖ రిటైర్డ్ అదనపు కమిషనర్ గోపాలకృష్ణారెడ్డి, కడప జిల్లాకు చెందిన జ్వాలా చైతన్యను అనధికార సభ్యులుగా నియమించింది. ఇటీవల వీరు స్వచ్ఛందంగా తమ రాజీనామాలను దేవదాయ కమిషనర్‌కు సమర్పించారు.

## 'ద సీబీఎన్ వే' పుస్తకావిష్కరణ

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోలోబ్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పసలపూడి సత్యేంద్ర రచించిన 'ద సీబీఎన్ వే.. ప్రిన్సిపల్స్ ఆఫ్ విజనరీ లీడర్షిప్' అనే పుస్తకాన్ని సీఎం చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. చంద్రబాబు 75 ఏళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని ఆయన విద్యాభ్యాసం, రాజకీయ నేపథ్యం, ఐటీ పాలసీ, ఈ-గవర్నెన్స్, విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలు, వృద్ధిరేటు పెరుగుదలకు తీసుకున్న చర్యలు, విజన్ 2047 వంటి వాటి గురించి ఈ పుస్తకంలో వివరించారు. చంద్రబాబు తీసుకొచ్చిన ఐటీ కంపెనీల కారణంగా తాను హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం సాధించానని, అవకాశాలను అందిపుచ్చుకుని మేనేజింగ్ డైరెక్టర్ స్థాయికి ఎదిగానని కాకినాడకు చెందిన సత్యేంద్ర తెలిపారు.

## గర్భిణికి హైకోర్టు అండ

» భర్త వేధింపులపై ఆరోపణలు.. చిక్కిశల్యమైన బాధితురాలు

» వెంటనే వాస్తవాలను గుర్తించాలని.. లీగల్ సర్వీసెస్ కమిటీకి కోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): "తల్లి కడుపులోని పిండానికి కూడా జీవించే హక్కును మన రాజ్యాంగం కల్పించింది" అంటూ హైకోర్టు ఓ గర్భిణికి అండగా నిలిచింది. ప్రేమపెళ్లి చేసుకుని, హైదరాబాద్‌లో ఉంటున్న తమ కుమార్తెను ఆమె భర్త వేధిస్తున్నాడంటూ గుంటూరుకు చెందిన దంపతులు దాఖలు చేసిన పిటిషన్‌పై వెంటనే స్పందించింది. గుంటూరులోని చంద్రమౌళినగర్‌కు చెందిన సూరే శ్రీనివాసరావు, వాసవి దంపతుల కుమార్తె ప్రవళిక(27) పెద్దలను ఎదిరించి హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివసించే ఎల్. వెంకటాచలపతిని పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం ప్రవళిక 8 నెలల గర్భవతి. ఈ దంపతులకు రెండేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే.. తమ కుమార్తె విషయంలో అల్లుడు సైకోలా వ్యవహరిస్తూ వేధింపులు, చిత్ర హింసలకు గురిచేస్తున్నాడని పేర్కొంటూ శ్రీనివాసరావు, వాసవి హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ కుమార్తె, మనవడు చిక్కిశల్యమయ్యారని కోర్టుకు వివరించారు. ఈ పిటిషన్‌ను విచారిస్తున్న జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం వెంటనే స్పందించి.. నిజానిజాలను నిగ్గుతేల్చాలంటూ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీని ఆదేశించారు. దాంతో.. కమిటీ కార్యదర్శి శాంతివర్ధిని స్వయంగా ప్రవళిక ఇంటికి వెళ్లి, పరిశీలించి, వెంటనే నివేదిక ఇచ్చారు. ప్రవళిక చాలా బలహీనంగా ఉందని, నరాల సమస్య, రక్తహీనతతో బాధపడుతోందని, ఆమె రెండేళ్ల కుమారుడిలోనూ వయసుకు తగ్గ ఎదుగుదల లేదని వెల్లడించారు. ఈ నివేదికను పరిశీలించిన ధర్మాసనం.. వెంటనే ప్రవళిక, ఆమె కుమారుడిని గాంధీ ఆస్పత్రికి తరలించి, తగిన వైద్యం అందజేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖను ఆదేశించింది. తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది. వారికి రక్షణ కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది.

### విడదల గోపి పిటిషన్లపై

# తీర్పు రిజర్వు

విజయవాడ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ వ్యాపారులను బెదిరించి రూ.కోట్లు వసూలు చేశారని అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి విడదల రజనీ మరిది వేణుగోపాలకృష్ణ(గోపి) పిటిషన్లపై వాదనలు మంగళవారం ముగిశాయి. గోపీని పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు తనకు బెయిల్ మంజూరు చేయాలని గోపీ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం ప్రాసిక్యూషన్ తరపున ఏసీబీ ప్రత్యేక పీపీ శేషయ్య వాదనలు వినిపించారు. 'రజనీ మంత్రిగా ఉన్నప్పుడు గ్రానైట్ వ్యాపారులను బెదిరించిన కేసులో గోపీకి బెయిల్ మంజూరు చేస్తే ఫిర్యాదుదారులు, సాక్షులను బెదిరించే అవకాశాలు ఉన్నాయి' అని శేషయ్య వాదించారు. వాదనలు విన్న అనంతరం ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును బుధవారానికి రిజర్వ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

### సెంట్రల్ జైలు నుంచి

# మాధవ్ విడుదల

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చేసిన అక్రమ అరెస్టులు, రాజకీయ హత్యలు.. వైసీపీ కేడర్‌ను గానీ, తమ లీడర్‌ను గానీ ఏమీ పీకలేవని వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. 'రాజమండ్రి సెంట్రల్ జైలు సాక్షిగా చెబుతున్న.. ఈ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీకి ఎదురులేదు, జగన్ మరోమారు సీఎం అవుతారనడంలో సందేహం లేదు' అని చెప్పారు. చేబ్రోలు కిరణ్‌కుమార్‌పైన, పోలీసుల పైన దాడి కేసుల్లో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న ఆయన మంగళవారం రాత్రి బెయిల్‌పై విడుదలయ్యారు. జైలు వెలుపల మాట్లాడుతూ.. ఈసారి కూటమి గెలవదని, వైసీపీ ఓడదని అన్నారు.

### నెయ్యి కల్తీ కేసులో

## ఏ12 బెయిల్ పిటిషన్ తిరస్కరణ

» వచ్చేవారం 12 మంది నిందితులపై చార్జిషీటు?

తిరుపతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో ఏ12 నిందితుడు హరిమోహన్ రాణా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. బోలే బాబా డెయిరీలో జీఎంగా ఉన్న హరిమోహన్ రాణాను సిట్ అధికారులు అరెస్టు చేశారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న హరిమోహన్ రాణా బెయిల్ కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఈనెల 24న విచారణ జరిగింది. నిందితుడి తరపున నలుగురు న్యాయవాదులు వాదనలు వినిపించగా బెయిల్ ఇవ్వవద్దంటూ సిట్ తరపున ఏపీపీ జయశేఖర్ వాదించారు. ఏపీపీ వాదనలతో ఏకీభవించిన నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. కాగా, సిట్ అధికారులు ఈ కేసులో ఇద్దరు టీటీడీ ఉద్యోగులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఆ ఇద్దరిని సిట్ ప్రశ్నిస్తోంది. వారిద్దరినీ ఈ కేసులో ఏ9, ఏ10గా చేర్చుతున్నట్టు తెలిసింది. వచ్చేవారం 12 మంది నిందితులపై చార్జిషీటు దాఖలు చేయనున్నట్టు సమాచారం.

## రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం!

» ప్రతి సచివాలయానికీ వీఏఏ, వీహెచ్ఏ లేదా వీఎస్ఏ

» వ్యవసాయశాఖ హేతుబద్ధీకరణపై మార్గదర్శకాలు

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10,965 గ్రామ, వార్డు సచివాలయాల విలీనం ద్వారా కొత్తగా ఏర్పాటు చేసిన 5,678 క్లస్టర్లలో వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకుల హేతుబద్ధీకరణకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. గ్రామీణ క్లస్టర్ల హేతుబద్ధీకరణకు మార్గదర్శకాలు జారీ చేసింది. రైతులకు మెరుగైన సేవలను అందించే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ప్రతి సచివాలయానికి వీఏఏ, వీహెచ్ఏ లేదా వీఎస్ఏను కేటాయించనున్నారు. ఇందుకోసం జిల్లా జాయింట్ కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పట్టుశాఖల అధికారులు హేతుబద్ధీకరణ ప్రక్రియను పారదర్శకంగా, కార్యనిర్వాహకుల మధ్య పని భారాన్ని సమానంగా పంపిణీ చేయనున్నారు. సామాజిక అటవీ ప్రాంతాన్ని, ఉద్యాన వనాలతో సహా, 2024 ఖరీఫ్, 2024-25 రబీలో ఈ-క్రాప్ నమోదు ప్రాంతాన్ని తీసుకుని, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సచివాలయాలకు కేటాయించనున్నారు. అత్యధికంగా ఉన్న వ్యవసాయ, ఉద్యాన, పట్టు విస్తీర్ణాన్ని బట్టి, వీఏఏ లేదా వీహెచ్ఏ లేదా వీఎస్ఏలను కేటాయించి, పేర్లు నమోదు చేయకుండా, క్యాడర్‌ను మాత్రమే చూపుతారు. ఈ-క్రాప్ పరిధిలోకి రాదని చెప్పబడే ప్రాంతాన్ని పరిశీలించి, సచివాలయాల తుది పరిధిని నిర్ధారించనున్నారు. కొన్ని జిల్లాల్లో విస్తీర్ణం హెచ్చుతగ్గులుగా ఉన్నా భూభాగాల గణాంకాలను పరిగణలోకి తీసుకుని, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్‌వోలలో ఒకరిని నియమించనున్నారు. ఈ మేరకు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు.

# నరైన్ తిప్పేశాడు

- ఆల్‌రౌండ్‌షోతో అదుర్స్
- ఢిల్లీపై కోల్‌కతా విజయం
- రేసులోనే నైట్‌రైడర్స్
- పోరాడిన డుప్లెసి, అక్షర్


సునీల్ నరైన్ (3/29)

**న్యూఢిల్లీ:** వరుస విజయాలతో జోరు చూపించిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్స్ ముంగిట తడబడుతోంది. గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిని కోల్పోగా.. అటు చావో రేవో తేల్చుకోవాల్సిన స్థితిలో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. డుప్లెసి (62), అక్షర్ (43)ల పోరాటంతో గెలుపు దిశగా సాగుతున్న ఢిల్లీని స్పిన్నర్ సునీల్ నరైన్ (3/29) తన మ్యాజిక్ బంతులతో వెనక్కి లాగాడు. దీంతో 14 పరుగుల తేడాతో నైట్‌రైడర్స్ నెగ్గింది. 9 పాయింట్లతో ప్లేఆఫ్ ఆశలను సజీవంగానే ఉంచుకుంది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్లకు 204 పరుగులు చేసింది. రఘువంశీ (44), రింకూ సింగ్ (36), నరైన్ (27) రాణించారు. స్టార్క్‌కు 3.. అక్షర్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసి ఓడింది. చివర్లో విప్రజ్ నిగమ్ (38) ఆకట్టుకున్నాడు. వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నరైన్ నిలిచాడు.

**స్పిన్నర్ల హవా:** భారీ ఛేదనలో ఢిల్లీకి తొలి ఓవర్‌లోనే ఝలక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న అభిషేక్ పోరెల్ (4)ను స్పిన్నర్ అనుకూల్ అవుట్ చేయగా, కాసేపటికే కరుణ్ నాయర్ (15), కేఎల్ రాహుల్ (7) వెనుదిరగడంతో ఢిల్లీ 60 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. అయితే డుప్లెసి ఒంటరి పోరాటానికి కెప్టెన్ అక్షర్ సహకారం తోడవ్వడంతో రన్‌రేట్ పదికి తగ్గకుండా సాగింది. తొమ్మిదో ఓవర్‌లో డుప్లెసి 4,4,6తో 16 రన్స్ అందించాడు. 13వ ఓవర్‌లో స్కోరు 130కి చేరింది. ఈ దశలో జట్టు గెలుపు ఖాయమనిపించినా నరైన్ గట్టి దెబ్బ తీశాడు. 14వ ఓవర్‌లో అతడు అక్షర్‌ను అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దీనికి తోడు ఆరో బంతికి హిట్టర్ స్టబ్స్ (1)ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ షాక్‌కు గురైంది. ఇక 31 బంతుల్లో ఫిఫ్టీతో జోరు మీదున్న డుప్లెసిని తన తర్వాతి ఓవర్‌లోనే నరైన్ అవుట్ చేయడంతో మ్యాచ్ కోల్‌కతా వైపు తిరిగింది. పైగా 18వ ఓవర్‌లో అశుతోష్ (7), స్టార్క్ (0)లను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో ఫలితం తేలిపోయింది. చివర్లో విప్రజ్ వేగంగా ఆడడం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

**చివర్లో తడబడ్డారు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్ టాప్‌గేర్‌లో సాగినా.. చివర్లో అదుపు తప్పింది. ఆఖరి ఐదు ఓవర్లలో 45 పరుగులే చేసి 5 వికెట్లు కోల్పోయిన జట్టు కష్టంగా 200 దాటింది. రఘువంశీ, రింకూ సింగ్ మాత్రం ఎదురుదాడికి ప్రయత్నించి ఐదో వికెట్‌కు 61 పరుగులు జోడించారు. అంతకుముందు ఓపెనర్లు నరైన్, గుర్బాజ్ (26) అదిరే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్‌లో గుర్బాజ్ రెండు ఫోర్లు సాధించగా.. రెండో ఓవర్‌లో నరైన్ 6,4,6,4తో 25 పరుగులు రాబట్టాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే గుర్బాజ్ 4,4,6తో ధాటిని చూపి ఆరో బంతికి వెనుదిరిగాడు. అయినా తొలి వికెట్‌కు 18 బంతుల్లోనే 48 పరుగులు సమకూరాయి. ఆ వెంటనే కెప్టెన్ రహానె (26) బౌండరీల జోరుతో పవర్‌ప్లేలో జట్టు 79/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. కానీ ఆ తర్వాత వరుస ఓవర్లలో నరైన్, రహానె వికెట్లు కోల్పోవడంతో స్కోరు 91/4కి చేరింది. కానీ రఘువంశీ రెండు సిక్సర్లతో తొమ్మిదో ఓవర్‌లో స్కోరు వందకి చేరుకుంది. వెంకటేశ్ అయ్యర్ (7) విఫలం కాగా స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పరుగులను నియంత్రించారు. ఈ దశలో 15వ ఓవర్‌లో రింకూ 4,6,4తో 17 రన్స్ రాబట్టడంతో కాస్త కోలుకుంది. వీరి ధాటికి స్కోరు 220కి చేరుతుందనిపించింది. అయితే ఢిల్లీ బౌలర్లు ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో తడబాటు ఆరంభమైంది. ఆఖరి ఓవర్‌లో తొలి మ్నది పరుగులకే కేకేఆర్ మూడు వికెట్లు కోల్పోయింది. తొలి బంతికి రస్సెల్ సిక్సర్‌తో స్కోరు 200 దాటినా.. ఆ తర్వాత స్టార్క్ వరుస బంతుల్లో రెండు వికెట్లు తీయగా రస్సెల్ (17) రనౌటయ్యాడు.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.ర‌రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 10 | 7 | 3 | 0 | 14 | 0.521 |
| ముంబై | 10 | 6 | 4 | 0 | 12 | 0.889 |
| గుజరాత్ | 9 | 6 | 3 | 0 | 12 | 0.748 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 0 | 12 | 0.362 |
| పంజాబ్ | 9 | 5 | 3 | 1 | 11 | 0.177 |
| లఖ్‌నవూ | 10 | 5 | 5 | 0 | 10 | -0.325 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 1 | 9 | 0.271 |
| రాజస్థాన్ | 10 | 3 | 7 | 0 | 6 | -0.349 |
| హైదరాబాద్ | 9 | 3 | 6 | 0 | 6 | -1.103 |
| చెన్నై | 9 | 2 | 7 | 0 | 4 | -1.302 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

### స్కోరుబోర్డు

**కోల్‌కతా:** గుర్బాజ్ (సి) పోరెల్ (బి) స్టార్క్ 26, నరైన్ (ఎల్బీ) విప్రజ్ 27, రహానె (ఎల్బీ) అక్షర్ 26, రఘువంశీ (సి) నాయర్ (బి) చమీర 44, వెంకటేశ్ (సి) విప్రజ్ (బి) అక్షర్ 7, రింకూ (సి) స్టార్క్ (బి) విప్రజ్ 36, రస్సెల్ (రనౌట్) 17, పావెల్ (ఎల్బీ) స్టార్క్ 5, అనుకూల్ (సి) చమీర (బి) స్టార్క్ 0, హర్షిత్ (నాటౌట్) 0, వరుణ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 204/9; వికెట్ల పతనం:** 1-48, 2-85, 3-91, 4-113, 5-174, 6-177, 7-203, 8-203, 9-203; **బౌలింగ్:** స్టార్క్ 4-0-43-3, చమీర 3-0-46-1, ముకేశ్ 2-0-17-0, విప్రజ్ 4-0-41-2, అక్షర్ 4-0-27-2, కుల్దీప్ 3-0-27-0.

**ఢిల్లీ:** అభిషేక్ పోరెల్ (సి) రస్సెల్ (బి) అనుకూల్ 4, డుప్లెసి (సి) రింకూ (బి) నరైన్ 62, కరుణ్ నాయర్ (ఎల్బీ) వైభవ్ అరోరా 15, కేఎల్ రాహుల్ (రనౌట్) 7, అక్షర్ (సి) హర్షిత్ (బి) నరైన్ 43, స్టబ్స్ (బి) నరైన్ 1, విప్రజ్ (బి) రస్సెల్ 38, అశుతోష్ (సి) నరైన్ (బి) వరుణ్ 7, స్టార్క్ (సి) గుర్బాజ్ (బి) వరుణ్ 0, చమీర (నాటౌట్) 2, కుల్దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 190/9; వికెట్ల పతనం:** 1-4, 2-43, 3-60, 4-136, 5-138, 6-146, 7-160, 8-160, 9-189; **బౌలింగ్:** అనుకూల్ 4-0-27-1, వైభవ్ 2-0-19-1, హర్షిత్ రాణా 4-0-49-0, వరుణ్ 4-0-39-2, నరైన్ 4-0-29-3, రస్సెల్ 2-0-22-1.

## ఐపీఎల్‌లో 'బేబీ' తుఫాన్



ఐపీఎల్ ఆరంభమైన మూడేళ్లకు జన్మించిన ఈ పిల్లాడు... ఇప్పుడు లీగ్‌కే ప్రత్యేక ఆకర్షణ అయ్యాడు. పిన్నవయసులోనే మెగా లీగ్ చాన్స్ దక్కడమే అదృష్టం అనుకొంటే.. 14 ఏళ్ల 32 రోజుల వయసులో ఏకంగా రికార్డు సెంచరీతో 'ఐపీఎల్ బేబీ' వైభవ్ సూర్యవంశీ ప్రకంపనలు సృష్టించాడు. అండర్-19, దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్రవేసిన వైభవ్‌ను మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ రూ. కోటీ 10 లక్షలకు కొనుగోలు చేసింది. రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో వైభవ్‌కు అరంగేట్రం చేసే అవకాశం దక్కింది. దీన్ని అతడు రెండు చేతులా ఒడిసిపట్టుకొన్నాడు. లీగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌కు తరలించి తన ప్రత్యేకతను చాటుకొన్నాడు. ఇక, గుజరాత్‌తో మ్యాచ్‌లో అయితే ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ చేయగా.. అందులో 11 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ క్రమంలో ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. ఎలాంటి బౌలర్ అయినా.. ఏమాత్రం తొణకకుండా పాలబుగ్గల చిన్నోడు సిక్స్‌లు బాదుతుంటే ప్రేక్షకులు మైమరచి చూశారు. చిన్నోడి ఆటకు ముగ్ధుడైన కోచ్ ద్రవిడ్.. వీల్‌చెయిర్‌లోంచి లేచి మరీ అభినందించాడు..

**వంద కిలోమీటర్లు ప్రయాణించి..:** బిహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన వైభవ్.. క్రికెట్ కోసం ఎంతో శ్రమించాడు. తొమ్మిదేళ్ల వయసులోనే 100 కి.మీ దూరంలోని పట్నాకు వెళ్లి మరీ ప్రాక్టీస్ చేసేవాడు. రోజూ దాదాపు ఆరు వందల బంతులు ఎదుర్కొనేవాడు. దాదాపు నాలుగేళ్లపాటు ఇదే తరహాలో కఠినంగా సాధన చేసినట్టు వైభవ్ చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా చెప్పాడు. సిక్స్‌లు కొట్టగలిగిన సత్తా ఉన్నప్పుడు.. సింగిల్స్ ఎందుకు అని అనేవాడన్నాడు. కొడుకు సక్సెస్ వెనుక వైభవ్ తండ్రి సంజీవ్ పాత్ర ఎంతో ఉంది. వైభవ్‌కు మెరుగైన శిక్షణ ఇప్పించడం కోసం తన పొలాన్ని అమ్మేయడమే కాకుండా నిత్యం కొడుకు వెంటే ఉండేవాడు. ఎక్కడ మ్యాచ్ జరిగినా స్వయంగా తనే తీసుకువెళ్లేవాడు. అయితే, వైభవ్‌లోని ప్రతిభను తొలుత గుర్తించింది వీవీఎస్ లక్ష్మణ్. అండర్-19 కోచ్‌గా అతడి ఆటను విశ్లేషించిన లక్ష్మణ్.. ద్రవిడ్‌కు సిఫార్సు చేశాడు. దీంతో రాజస్థాన్ మరో ఆలోచన లేకుండానే సూర్యవంశీని అతడి కనీస ధర రూ. 30 లక్షలకు నాలుగు రెట్లు అదనంగా చెల్లించి మరీ సొంతం చేసుకొంది. చిన్నవయసులోనే మితిమీరిన పాపులారిటీ రావడంతో.. సరైన మార్గదర్శనం లేక పృథ్వీ షా లాంటి ఆటగాళ్లు పక్కదారి పట్టారు. వైభవ్ అలా కాకూడదనే ఉద్దేశంతో అతడి భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యతను ద్రవిడ్ తీసుకొన్నాడు.

**వయసు తప్పు అంటూ..:** ఐపీఎల్‌లో వేలంలో వైభవ్ ను రాజస్థాన్ కొనుగోలు చేయగానే అతడి వయసుపై చర్చ రేగింది. సూర్యవంశీ జనన ధ్రువీకరణకు సంబంధించిన అవకతవకలకు పాల్పడ్డాడంటూ నెట్‌లో పుకార్లు హల్‌చల్ చేశాయి. కొందరైతే వైభవ్‌కు 15 ఏళ్లు అని కూడా ఆరోపించారు. '13 ఏళ్ల బాలుడు ఎక్కడైనా ఇలా సిక్స్ కొట్టగలడా?' అని వీడియోను పోస్టు చేసిన పాకిస్థాన్ మాజీ పేసర్ జునైద్ ఖాన్ సందేహం వ్యక్తం చేశాడు. అయితే, వీటిని అతడి తండ్రి సంజీవ్ తిప్పికొట్టాడు. 'ఎనిమిదిన్నర ఏళ్ల వయసులో బీసీసీఐ నిర్వహించిన బోన్ టెస్ట్‌కు హాజరయ్యాడు. ఆ తర్వాత అండర్-19, దేశవాళీ క్రికెట్ ఆడాడు. మాకెలాంటి భయమూ లేదు. ఎలాంటి పరీక్షకైనా సిద్ధమేనని అన్నాడు. (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

### అమ్మ మూడు గంటలే నిద్రపోయేది



'నేను సాధించిన ప్రతి విజయం వెనుక నా తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంది. నా కోసం అమ్మ తెల్లవారు జామున 2 గంటలకే లేచి వంట చేసేది. మళ్లీ రాత్రి 11 గంటలకు నిద్రపోయేది. కేవలం మూడు గంటలే ఆమెకు నిద్ర. నా కోసం నాన్న ఉద్యోగాన్ని వదిలేయడంతో.. అన్నయ్య పనిచేయాల్సిన పరిస్థితి. ఆర్థికంగా చాలా కష్టాలు పడ్డాం. అయితే, నాన్న మాత్రం ఎప్పుడూ ధైర్యం చెబుతూ నన్ను నడిపించేవారు.'
- వైభవ్ సూర్యవంశీ

### ఆరేళ్లప్పుడు ఐపీఎల్ చూస్తూ..



14 ఏళ్ల వైభవ్ ఆరేళ్ల వయస్సులో అప్పటి ఐపీఎల్ జట్టు రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఫొటో ఒకటి నెట్‌లో వైరల్ అయ్యింది. ఈ ఫొటోను లఖ్‌నవూ జట్టు యజమాని సంజీవ్ గోయెంకా ఎక్స్‌లో షేర్ చేశాడు. 'గత రాత్రి అతడి ఇన్నింగ్స్‌ను ఆశ్చర్యంతో వీక్షించా. ఈ ఉదయం 6 ఏళ్ల వైభవ్ 2017లో మా జట్టే అయిన రైజింగ్ పుణెకు మద్దతుగా మ్యాచ్‌ను వీక్షించిన ఫొటో చూశా. థ్యాంక్యూ వైభవ్. నీకు నా శుభాకాంక్షలు' అని తెలిపాడు.

### నేటి మ్యాచ్

వేదిక చెన్నై
చెన్నై x పంజాబ్ — రా.7.30 నుంచి

## భారత్‌దే రెండో వన్డే

దక్షిణాఫ్రికా ఓటమి ● మహిళల ముక్కోణపు సిరీస్


స్నేహ్ రాణా (5/43)

**కొలంబో:** మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత జట్టుకు రెండో విజయం దక్కింది. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లోనూ ఓపెనర్ ప్రతికా రావల్ (78) తన జోరును కొనసాగించడంతో పాటు, మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 500 రన్స్ (8 ఇన్నింగ్స్) పూర్తి చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది. ఇక బౌలింగ్‌లో స్నేహ్ రాణా (5/43) సఫారీల వెన్నువిరవడంతో భారత్ 15 పరుగులతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 276/6 స్కోరు సాధించింది. హర్మన్ (41), జెమీమా (41), మంధాన (36) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా పోరాడినా చివర్లో తడబడింది. దీంతో 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తజ్మిన్ బ్రిట్స్ (109) శతకం వృథా అయ్యింది. వోల్వార్ట్ (43), డెరెక్సెన్ (30) ఫర్వాలేదనిపించారు.

## నాకౌట్ ఆశలు ఆవిరి

- ఇండోనేసియా చేతిలో భారత్ ఓటమి
- సుదీర్మన్ కప్ ఫైనల్స్

**గ్జియామెన్ (చైనా):** సుదీర్మన్ కప్ ఫైనల్స్‌లో నాకౌట్ ఆశలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పోరులో భారత బ్యాడ్మింటన్ జట్టు నిరాశపరిచింది. గ్రూప్-డిలో భాగంగా మంగళవారం జరిగిన తమ రెండో పోరులో భారత్ 1-4తో పటిష్ఠ ఇండోనేసియా చేతిలో ఓటమిపాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా జోడీ మాత్రమే గెలవగా.. సింగిల్స్‌లో స్టార్లు పీవీ సింధు, ప్రణయ్, మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి, పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ జంటలు ఓటమిపాలయ్యారు. దీంతో క్వార్టర్స్ చేరకుండానే భారత జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం జరిగిన తమ తొలి పోరులో డెన్మార్క్ చేతిలో భారత్ ఓడిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్‌లో తమకు ఆఖరిదైన ఇంగ్లండ్‌తో పోరు భారత్‌కు నామమాత్రం కానుంది.

## ఇంగ్లండ్ మహిళల కెప్టెన్‌గా బ్రంట్



**లండన్:** ఇంగ్లండ్ మహిళల క్రికెట్ కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ నాట్ సివర్ బ్రంట్ ఎంపికైంది. హీథర్‌నైట్ స్థానంలో వచ్చిన బ్రంట్ అన్ని ఫార్మాట్లలో సారథ్యం వహిస్తుంది. బ్రంట్ గత మూడేళ్లుగా ఇంగ్లండ్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది.

# బిజినెస్

### మార్కెట్లోకి బజాజ్ చేతక్ 3503


ధర రూ.1.10 లక్షలు

పుణె: బజాజ్ ఆటో.. తన చేతక్ ఈ-స్కూటర్స్ సిరీస్‌లో మరో కొత్త వేరియంట్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'చేతక్ 3503' పేరుతో తీసుకువచ్చిన ఈ స్కూటర్ ధర రూ.1.10 లక్షలు (ఎక్స్‌షోరూమ్). 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన ఈ వాహనం ఒకసారి చార్జింగ్‌తో 151 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.

## దీర్ఘకాలిక పెట్టుబడులకు మన మార్కెట్ భేష్



సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే

ముంబై: అంతర్జాతీయంగా కొన్ని ఆటుపోట్లు ఉన్నా భారత స్టాక్ మార్కెట్ బాగానే ఉందని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) చైర్మన్ తుహిన్ కాంత పాండే అన్నారు. ట్రంప్ సుంకాలతో భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్ ఇప్పటికే ఆ నష్టాల నుంచి పూర్తిగా బయట పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మన ఆర్థిక పునాదులు బలంగా ఉండడమే ఇందుకు కారణమన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రిటైల్ మదుపరులు దీర్ఘకాలిక లాభాల కోసం దేశీయ స్టాక్ మార్కెట్లో పూర్తి భరోసాతో పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. అయితే నష్టభయం ఎక్కువగా ఉండే ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌కు మాత్రం రిటైల్ మదుపరులు దూరంగా ఉండాలని కోరారు. తీవ్ర స్పెక్యులేషన్‌తో కూడిన ఎఫ్ అండ్ ఓలో మదుపు చేయడం అంటే జూదం ఆడడం తప్ప మరోటి కాదన్నారు. అలాగే చెప్పుడు మాటలు విని కూడా మార్కెట్లో పెట్టుబడులు పెట్టవద్దన్నారు. పూర్తి అవగాహన, సమాచారం, తెలివితోనే రిటైల్ మదుపరులు షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు జరపాలని పాండే సూచించారు.

### ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ
## సుమంత్ రాజీనామా

డిప్యూటీ సీఈఓ అరుణ్ కూడా
అకౌంటింగ్ వైఫల్యాల నేపథ్యంలోనే..

న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో అకౌంటింగ్ వైఫల్యాలు బయటపడిన నేపథ్యంలో ఆ బ్యాంక్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ కత్పాలియా రాజీనామా చేశారు. సుమంత్ పాటు డిప్యూటీ సీఈఓ అరుణ్ ఖురానా కూడా తన పదవికి రాజీనామా సమర్పించారు. ఖురానా సోమవారమే తన రాజీనామాను బ్యాంక్ బోర్డుకు పంపించారు. ఈ ఇద్దరు అధికారుల రాజీనామాలు తక్షణమే అమల్లోకి వస్తాయని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ వెల్లడించింది. అకౌంటింగ్‌లో జరిగిన లోపాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వాటికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నానని, మంగళవారం పని గంటలు పూర్తయిన సమయం నుంచి తన రాజీనామాను పరిగణనలోకి తీసుకోవాలని బ్యాంకు బోర్డుకు రాసిన లేఖలో సుమంత్ తెలిపారు. మరోవైపు బ్యాంకులోని అంతర్గత డెరివేటివ్స్ విభాగంలో చోటు చేసుకున్న దురదృష్టకర పరిణామాల నేపథ్యంలో ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ కార్యకలాపాలకు బాధ్యుడైన తాను రాజీనామా చేస్తున్నట్టు అరుణ్ తెలిపారు.

డెరివేటివ్ పోర్టుఫోలియోలో అకౌంటింగ్ లోపాల కారణంగా బ్యాంక్ రూ.1,979 కోట్ల మేర నష్టపోయిన సంగతి తెలిసిందే. బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త ఎండీ, సీఈఓ నియామకం జరిగే వరకు ఆయన బాధ్యతల నిర్వహణ కోసం "ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ" ఏర్పాటుకు అనుమతించాలని కోరుతూ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి లేఖ రాసింది.

## స్వల్ప లాభంతో సరి

### సెన్సెక్స్ 70 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజు లాభపడ్డాయి. మంగళవారం ఆరంభ ట్రేడింగ్‌లో 442 పాయింట్లకు పైగా పుంజుకున్న సెన్సెక్స్.. చివరి వరకు అదే జోరును కొనసాగించలేకపోయింది. రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, 70.01 పాయింట్ల స్వల్ప లాభంతో 80,288.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 7.45 పాయింట్ల పెరుగుదలతో 24,335.95 వద్ద ముగిసింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. అయితే, రిలయన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 మాత్రమే రాణించాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేరు 2.32 శాతం లాభంతో 4 నెలల గరిష్ఠానికి చేరడంతో పాటు వరుసగా రెండో రోజు సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.23 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ, ఫోకస్డ్ ఐటీ సూచీలు మాత్రం ఒక శాతానికి పైగా పెరిగాయి.

- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.1,050 పెరిగి రూ.99,450కి చేరగా.. సిల్వర్ రూ.3,500 పెరుగుదలతో రూ.1.02 లక్షలకు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,311 డాలర్లు, సిల్వర్ 33.28 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

### ఐపీఓకు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్

కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కూడా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు(డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు కలిసి 23.75 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. అందులో కెనరా బ్యాంక్ 13.77 కోట్ల షేర్లు, హెచ్ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ (ఏషియా పసిఫిక్) హోల్డింగ్స్ 47.5 లక్షల షేర్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 9.5 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టనున్నాయి. కొద్ది రోజుల క్రితమే కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కూడా ఐపీఓకు వచ్చేందుకు సెబీకి పత్రాలు సమర్పించింది.

- ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ రూ.2,000 కోట్ల ఐపీఓ ప్రతిపాదనకు సెబీ ఆమోదం లభించింది. కాగా, ఏథర్ ఎనర్జీ ఇష్యూకు రెండో రోజు నాటికి 28 శాతం బిడ్లు లభించాయి.

### అజాద్ ఇంజనీరింగ్ కొత్త యూనిట్ షురూ

అజాద్ ఇంజనీరింగ్ హైదరాబాద్ సమీపంలోని తునికి బొల్లారంలో అధునాతన ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించింది. వైమానిక, రక్షణ, ఇంధన, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలకు అవసరమైన ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరికరాలను కంపెనీ ఈ యూనిట్‌లో తయారు చేయనుంది. ఏటా లక్ష బ్లేడ్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ యూనిట్ ఏర్పాటు చేసినట్టు చైర్మన్, సీఈఓ రాకేశ్ చోప్దార్ తెలిపారు.



విశాక ఇండస్ట్రీస్ లిమిటెడ్.. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో 2 మెగావాట్ల సమీకృత వీవీ ఆటమ్ సోలార్ రూఫ్, ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ వీటిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంఎల్ఏ వివేక్, బీఆర్ అంబేడ్కర్ ఇనిస్టిట్యూషన్స్ కరస్పాండెంట్ సరోజ గడ్డం, పెద్దపల్లి ఎంపీ వంశీ గడ్డం పాల్గొన్నారు.

## బీపీసీఎల్ లాభంలో 24% క్షీణత

న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్).. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ నికర లాభం 24 శాతం క్షీణించి రూ.3,214.06 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం లాభం రూ.4,224.18 కోట్లుగా ఉంది. రిఫైనింగ్ మార్జిన్లు తగ్గటం, సబ్సిడీ వంటగ్యాస్ (ఎల్‌పీజీ) విక్రయాలపై నష్టాలు కంపెనీ పనితీరును దెబ్బతీశాయి. మరోవైపు మార్చి త్రైమాసికంలో ఆదాయం కూడా 4 శాతం తగ్గి రూ. 1.26 లక్షల కోట్లకు పడిపోయింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి నికర లాభం సగానికి పైగా తగ్గి రూ.13,275.26 కోట్లుగా ఉండగా మొత్తం ఆదాయం రూ.5 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా ఒక్కో షేరుకు రూ. 5 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గతంలో చెల్లించిన రూ. 5 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

## బజాజ్ ఫైనాన్స్ 4:1 బోనస్ షేర్ల జారీ

క్యూ4 లాభం రూ.3,940 కోట్లు.. ఒక్కో షేరుపై రూ.44 డివిడెండ్


న్యూఢిల్లీ: గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి (క్యూ4) బజాజ్ ఫైనాన్స్ రూ.3,940 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ఆదాయం రూ.12,764 కోట్ల నుంచి రూ.15,808 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.11,201 కోట్ల నుంచి రూ.13,824 కోట్లకు చేరింది.

**వాటాదారులకు బొనాంజా:** ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో కంపెనీ వాటాదారులకూ తీపికబురు చెప్పింది. ఒక్కోటి రూ.2 ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లపై రూ.44 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. దీంతో పాటు రూ.12 ప్రత్యేక డివిడెండ్‌ను కంపెనీ అందించనుంది. అలాగే ఒక్కోటి రూ.2 ముఖ విలువతో కూడిన షేరును రూ.1 ముఖ విలువతో కూడిన రెండు షేర్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది. మళ్లీ ఈ రూ.1 ముఖ విలువ ఉండే ఒక్కో షేరుకు నాలుగు చొప్పున (4:1) బోనస్ షేర్లు జారీ చేసేందుకూ బజాజ్ ఫైనాన్స్ బోర్డు ఆమోదం తెలిపింది.

## టాటా ఏఐజీ 'మెడికేర్ సెలెక్ట్' పాలసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్.. కొత్త రిటైల్ ఆరోగ్య బీమా పాలసీ 'మెడికేర్ సెలెక్ట్'ను విడుదల చేసింది. రిటైల్ హెల్త్ పోర్టుఫోలియోతో పాటు బీమా వ్యాపారాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకువచ్చినట్లు టాటా ఏఐజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రతీక్ గుప్తా తెలిపారు. ఎలాంటి ఎంట్రీ వయసు లేకుండా, అందుబాటు ధరల్లో ఉండే ప్రీమియంతో ఈ సమగ్ర ఆరోగ్య బీమా పాలసీని రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఎలాంటి వయోపరిమితులు లేకుండా ఈ పాలసీని అందరికీ ఆఫర్ చేస్తున్నట్లు గుప్తా పేర్కొన్నారు. టాటా ఏఐజీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కీలక మార్కెట్లుగా ఉన్నాయని, గత ఏడాది కాలంలో కంపెనీ రిటైల్ హెల్త్ విభాగం ఇక్కడ మూడింతల వృద్ధిని నమోదు చేసిందని ఆయన చెప్పారు. తెలుగు రాష్ర్టాల్లో 1,600కు పైగా హాస్పిటల్స్ నెట్‌వర్క్‌తో పాటు 14,000 మంది అడ్వైజర్లను టాటా ఏఐజీ కలిగి ఉందన్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరుల్లో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కార్యాలయాలను కలిగి ఉంది. గడిచిన రెండేళ్లలో టాటా ఏఐజీ.. తెలుగు రాష్ర్టాల్లో తన మార్కెట్ వాటాను 2.1 శాతం నుంచి 3.6 శాతానికి పెంచుకుందని కంపెనీ హెడ్ (యాక్సిడెంట్, హెల్త్ క్లెయిమ్స్) రుద్రరాజు రాజగోపాల్ తెలిపారు. సమీప భవిష్యత్‌లో దీన్ని 5 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 30వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 425 | విజయవాడ | 440 |
| వరంగల్ | 427 | గోదావరి | 425 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 435 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

## జోస్ అలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: అక్షయ తృతీయను పురస్కరించుకుని జోస్ అలుక్కాస్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా రూ.75,000 లేదా అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఉచితంగా బంగారు నాణేన్ని అందిస్తున్నట్లు జోస్ అలుక్కాస్ ప్రకటించింది. అంతేకాకుండా వజ్రాభరణాలను కొనుగోలు చేసే వారికి ప్రతి క్యారట్‌పై రూ.15,000 ఫ్లాట్ డిస్కౌంట్‌ను అందిస్తోంది. దీంతో పాటుగా ప్రతి క్యారట్‌కు ఉచితంగా 500 మిల్లీగ్రాముల బంగారు నాణేన్ని కాంప్లిమెంటరీగా ఇస్తోంది. అలాగే ప్లాటినం ఆభరణాలపై 15 శాతం వరకు తరుగు చార్జీలను తగ్గిస్తున్నట్లు జోస్ అలుక్కాస్ వెల్లడించింది. బంగారు ఆభరణాల మేకింగ్ చార్జీల్లో 30 శాతం వరకు రాయితీని అందిస్తోంది. వెండి ఆభరణాలు తరుగు చార్జీలు లేకుండా లభిస్తాయని తెలిపింది. దీంతో పాటు తమ పాత బంగారాన్ని హెచ్‌యూఐడీ ధ్రువీకరణ కలిగిన ఆభరణాలతో మార్పిడి చేసుకోవాలనుకునే వినియోగదారులకు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ లాభాలను ఆఫర్ చేస్తున్నట్లు జోస్ అలుక్కాస్ వెల్లడించింది.



### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 125 | విజయవాడ | 127 |
| వరంగల్ | 125 | గుంటూరు | 125 |
| కరీంనగర్ | 125 | ఒంగోలు | 125 |
| మహబూబ్‌నగర్ | 125 | చిత్తూరు | 85 |
| కర్నూలు | 125 | నెల్లూరు | 90 |
| విశాఖపట్నం | 121 | అనంతపురం | 90 |
| గోదావరి | 127 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 97,970 ▲ | 89,800 ▲ | 1,11,000 ▲ |
| విజయవాడ | 99,000 ▲ | 93,000 ▲ | 1,00,000 ▲ |
| విశాఖపట్నం | 98,860 ▲ | 89,800 ▲ | 1,11,000 ▲ |
| రాజమండ్రి | 97,960 ▲ | 89,800 ▲ | 99,300 ▲ |
| ప్రొద్దుటూరు | 97,500 ▲ | 89,700 ▼ | 99,000 ▼ |
| ముంబై | 96,011 ▲ | 87,946 ▲ | 97,390 ▲ |



# హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్ హొయలు! (హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్ హకా!)

వినూత్నమైన పోకడలు నిరంతరం పుట్టుకొస్తూనే ఉంటాయి. అలాంటిదే 'హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్'. సౌకర్యం ప్రధానంగా రూపొందుతున్న ఈ డ్రెస్సులు తాజాగా మహిళల మనసులను దోచేస్తున్నాయి. వాటి మీద ఓ లుక్కేద్దామా?

ఫ్యాషన్

వేర్వేరు వస్త్రాలను భిన్నమైన కొలతలతో కత్తిరించి, వాటన్నిటినీ జోడించి తయారుచేసేదే హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్. ఈ వస్త్రాల మూలలన్నీ కిందకు వేలాడుతూ, డ్రస్సుకు భిన్నమైన లుక్‌ను అందిస్తాయి. ఈ వినూత్నమైన డ్రెస్ అందం రెట్టింపు కావాలంటే, డ్రెస్సుకు తగిన యాక్సెసరీస్‌ను కూడా జోడించాలి. ఈ డ్రెస్ ఆకర్షణను ద్విగుణీకృతం చేసే అంశాలు ఇవే...

- తప్పనిసరిగా పెన్సిల్ హీల్ లేదా బూట్స్ వేసుకోవాలి
- వీలైనంత తక్కువ జ్యువెలరీ వేసుకోవాలి



- పెద్ద డయల్ వాచీలు, బ్యాంగిల్స్ వేసుకోవచ్చు
- చెవులకు పొడవాటి, పెద్ద హ్యాంగింగ్స్ అందంగా ఉంటాయి
- సెక్విన్, మిర్రర్ వర్క్ కలిగిన హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్‌లను వేడుకల్లో ధరించాలి
- కాటన్, శాటిన్ హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్సులు ఎంతో సౌకర్యంగా ఉంటాయి
- ఈవినింగ్ వేర్, క్యాజువల్ వేర్‌గా వీటిని ఎంచుకోవచ్చు
- తేలికపాటి రంగుల హ్యాండ్‌కర్చీఫ్ డ్రెస్సులు వేసవికి ఎంతో బాగా నప్పుతాయి



సంకల్పం

# ఆడ పులులు

కొద్ది రోజుల కిందట... అడవిలో తప్పిపోయిన నిర్మల్ జిల్లా కప్పనపల్లి మహిళా కూలీలను వెతికి పట్టుకువచ్చింది **'టీమ్ శివంగి'**. చిమ్మచీకటిలో... దట్టమైన అరణ్యంలో... కూంబింగ్ నిర్వహించిన ఆ కమాండో బృందం అంతటా ప్రశంసలు అందుకుంది. ఇరవై మంది మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటైన 'టీమ్ శివంగి'... నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల మానస పుత్రిక. పోలీసు వ్యవస్థలో మహిళలను శివంగుల్లా తీర్చిదిద్దడానికి... మగవారికి దీటుగా నిలబెట్టడానికి... తీసుకువచ్చిన ఈ 'టీమ్' విశేషాలు 'నవ్య' పాఠకుల కోసం.



"మహిళా పోలీసులు ఎందులోనూ తక్కువకాదు. అవకాశం కల్పిస్తే మగ పోలీసులతో సమానంగా సేవలు అందించగలరు. అది నిరూపించడానికే 'టీమ్ శివంగి' ఫోర్స్‌ను ఏర్పాటు చేశాను. ఇప్పటికే జిల్లాలో మహిళా పోలీసులకు అనేక కీలక బాధ్యతలు అప్పగించాం. వారిలో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అంతేకాదు... వారిలో మనోధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 'టీమ్ శివంగి' పేరుతో కమాండో బృందాన్ని ఏర్పాటు చేశాం. ఈ బృందం సభ్యులు నిర్మల్ జిల్లా కప్పనపల్లి గ్రామంలోని దట్టమైన అడవుల్లో తప్పిపోయిన నలుగురు మహిళా కూలీలను వెతికి తేవడం అందరూ చూశారు. ఎంతో సాహసంతో రాత్రింబవళ్లూ కూంబింగ్ చేసి వారిని సురక్షితంగా ఇళ్లకు చేర్చారు"... అంటారు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల. రాబోయే రోజుల్లో ఈ కమాండోస్‌కు ఆమె మరిన్ని కీలక బాధ్యతలు అప్పగించబోతున్నట్టు ఆమె చెప్పారు.

## ఇలాంటివెన్నో...

ప్రయోగాత్మకంగా జానకి చేపట్టిన అనేక ప్రాజెక్టుల్లో 'టీమ్ శివంగి' ఒకటి. మహిళా సమస్యల పరిష్కారానికి, సైబర్ నేరాల అదుపునకు శాఖలోని చురుకైన మహిళా కానిస్టేబుళ్లను గుర్తించి, పురుష పోలీసులతో సమానంగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇప్పటికే పెట్రోలింగ్, వెహికిల్ చెకింగ్ వంటి క్లిష్టమైన పనులను వారికి కేటాయిస్తున్నారు. కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు అండగా 'పోలీసు అక్క' పేరిట చేపట్టిన కార్యక్రమానికి అంతటా ప్రశంసలు అందుతున్నాయి. ఇలా ఎన్నో. ఈ క్రమంలోనే 'టీమ్ శివంగి' రూపు దాల్చింది.

## ఎందులోనూ తక్కువ కాదు...

జిల్లా పోలీసు శాఖలోని 20 మంది మహిళా కానిస్టేబుళ్లతో ఏర్పాటైన 'టీమ్ శివంగి'కి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా వీరందరూ 45 రోజులపాటు హైదరాబాద్‌లో కమాండోస్ శిక్షణ తీసుకున్నారు. శివంగి అంటే ఆడ పులి. మహిళలను అంత శౌర్యవంతులుగా తయారుచేయడమే ఈ 'టీమ్' ఏర్పాటు లక్ష్యం. జాతీయ స్థాయిలో ఎన్ఎస్‌జీ, రాష్ట్ర స్థాయిలో గ్రేహౌండ్స్ దళాలకు దీటుగా 'శివంగి' కమాండోస్ అన్నింటా తర్ఫీదు పొందారు.



> ఇప్పటికే జిల్లాలో మహిళా పోలీసులకు అనేక కీలక బాధ్యతలు అప్పగించాం. వారిలో దాగివున్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. అంతేకాదు... వారిలో మనోధైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా 'టీమ్ శివంగి' పేరుతో కమాండో బృందాన్ని ఏర్పాటు చేశాం.

శారీరక దారుఢ్యం, పరుగు పందేలు, వెర్టికల్ రోప్ క్లైంబింగ్, పోరాట నైపుణ్యాలు, పేలుడు పదార్థాల నిర్వహణలో శిక్షణ, ఆధునిక ఆయుధాల వినియోగం, వెపన్ హ్యాండ్లింగ్, ఫీల్డ్ సిగ్నల్స్, మ్యాప్ రీడింగ్, మ్యాప్ లేకుండా నేవిగేషన్, శత్రువుల కదలికలు, అడవిలో సంకేతాలను చదవడం, నిఘా పద్ధతులు, ఆకస్మిక దాడి, ఎదురుదాడి కసరత్తులు, రహస్య స్థావరాలపై దాడులు చేయడం వంటి అంశాలతో కూడిన కఠినమైన శిక్షణ కార్యక్రమంతో వీళ్లు రాటుదేలారు.

## సాహసోపేతంగా...

ఆ మధ్య నిర్మల్ జిల్లాలోని మామడ మండలం కప్పనపల్లి గ్రామానికి చెందిన నలుగురు తునికాకు మహిళ కూలీలు దట్టమైన అడవుల్లో తప్పిపోయారు. గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల... వెంటనే 'టీమ్ శివంగి' కమాండోలను రంగంలోకి దింపారు. ఎస్పీ నేతృత్వంలోని ఈ టీమ్... దట్టమైన అడవిలో రాత్రంతా కూంబింగ్ నిర్వహించింది. ఎంతో ధైర్యసాహసాలతో అడవిని వడపోసి... తప్పిపోయిన నలుగురు మహిళా కూలీలనూ సురక్షితంగా తీసుకువచ్చింది. తమ సత్తా ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పింది. పురుష కమాండోస్‌కు దీటుగా... దట్టమైన అడవిలో, చిమ్మ చీకటిని లెక్క చేయకుండా కూంబింగ్ నిర్వహించిన తీరు ప్రశంసలు అందుకుంది.

• **కొండూరి రవీందర్**, నిర్మల్

# ఏ కలా పెద్దది కాదు

పేదరికం, సామాజికమైన ఆంక్షలు, వరుస వైఫల్యాలు... ఏ పరిస్థితులు ఎదురైనా చెక్కుచెదరని సంకల్పంతో లక్ష్యాన్ని సాధించారు **అదిబా అనమ్**. ఆటో డ్రైవర్ కుమార్తె అయిన ఆమె సివిల్స్‌లో ఎంపికై, మహారాష్ట్రలో తొలి ముస్లిం మహిళా ఐఏఎస్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. 'పేదలకు సేవ చేయాలనే నా ఆశయంలో ఇది తొలి అడుగు' అంటున్న అదిబా స్ఫూర్తిదాయకమైన ప్రయాణం ఇది.



"డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యాననే మాట ఇదివరకు బాగా వినిపించేది కదా! నా విషయంలోనూ అలాగే జరిగింది. నేను డాక్టర్ అవ్వాలనుకున్నా... ఐఏఎస్‌నయ్యాను. చిన్న వయసు నుంచీ వైద్యురాలు కావాలనేది నా కల. అయితే పదోతరగతికి వచ్చేసరికి... అది సాధ్యమయ్యే పని కాదని అర్థమయింది. కారణం మా ఆర్థిక పరిస్థితులు. దేశంలోనే రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా ఉండే రాష్ట్రం మహారాష్ట్ర అయితే... అందులో అత్యధిక శాతం చోటు చేసుకున్నది మా యవత్మాల్ జిల్లాలోనే. గత 24 ఏళ్లలో 6,200 మందికి పైగా రైతులు మా జిల్లాలో బలవన్మరణాలపాలయ్యారని ఈ నెల మొదటివారంలో విడుదలైన అధికారిక నివేదిక చెబుతోంది. కానీ ఆ సంఖ్య ఇంకా ఎన్నో రెట్లు ఉంటుంది. ఈ నేపథ్యంలో... వ్యవసాయ పనులు వదిలేసి ఇతర వృత్తులను చేపట్టిన వేలాది మందిలో మా నాన్న అష్ఫక్ షేక్ ఒకరు. బాగా చదువుకోవాలని నాన్నకు ఎంతో ఆశ. కానీ ఆయన పదో తరగతి మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. తొలి సంతానమైన నా ద్వారా తన కల తీర్చుకుందామని అనుకున్నారు.



## ఎంతో ఒత్తిడి ఎదుర్కొన్నాం...

అమ్మా నాన్నా, నేను, ఇద్దరు తమ్ముళ్ళు... ఇదీ మా కుటుంబం. నాన్న అద్దె ఆటో నడిపి తెచ్చే సంపాదనతోనే కుటుంబం గడవాలి, మా చదువులు కొనసాగాలి. ఉండేది అద్దె ఇల్లే అయినా, ఎలాంటి ఆస్తులూ లేకపోయినా... ఏనాడూ మా తల్లితండ్రులు అధైర్యపడలేదు. పదో తరగతిలో 98 శాతం, ఇంటర్‌లో 97 శాతం మార్కులు తెచ్చుకున్నా. అప్పుడే యుపిఎస్‌సికి ప్రిపేర్ కావాలనే ఆలోచన వచ్చింది. దానికి కారణం పుణేలో ఉన్న మా మామయ్య. అతను 'సేవా ఎన్జీవో' అనే సంస్థలో కార్యదర్శిగా పని చేస్తారు. ఆ సంస్థ కార్యక్రమాలకు హాజరయ్యే ఐఏఎస్ అధికారులకు నన్ను పరిచయం చేశారు. ఎంబీబీఎస్ ఆశ వదులుకున్న నాకు... ఐఏఎస్ కొత్త లక్ష్యంగా మారింది. పుణేలోనే డిగ్రీలో చేరాను. గణితంలో గ్రాడ్యుయేషన్ చేస్తూ... సివిల్స్ కోసం సన్నద్ధం కావడం మొదలుపెట్టాను. ఆ సమయంలో నేను, నా కుటుంబం ఎంతో ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వచ్చింది.

### అందుకోసం కృషి చేస్తా...

సమాజానికి సేవ చెయ్యడానికి ఇది మొదటి అడుగుగా భావిస్తున్నాను. పేదల శ్రేయస్సుకు, ముఖ్యంగా బాలికల చదువు కోసం నా వంతు కృషి చేస్తాను. విద్య, వైద్యం... ఈ రెండూ ఎవరికైనా చాలా ముఖ్యం. అట్టడుగు వర్గాలకు అవి అందేలా చూడాలనుకుంటున్నాను. నేను చాలా సాధారణమైన కుటుంబం నుంచి వచ్చాను. పెద్ద నగరాల్లో చదవలేదు. స్థిరమైన ఆదాయం ఉన్న కుటుంబం కాదు. కానీ ఒక లక్ష్యం నిర్దేశించుకున్నాను. ఆ దిశగా కృషి చేశాను. ఏ కలా మరీ పెద్దది కాదు. ఏ లక్ష్యమూ మరీ దూరం కాదు. కావలసిందల్లా మన మీద మనకు విశ్వాసం. చిత్తశుద్ధితో ప్రయత్నించడం. నాలాంటి అమ్మాయిలు నన్ను ప్రేరణగా తీసుకొని... ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తారనే నమ్మకం నాకుంది.

## ఎందరో సలహాలిచ్చారు...

మా ముగ్గుర్ని చదివించడం కోసం నాన్న ఆర్థికంగా పడుతున్న సమస్యలకు తోడు కమ్యూనిటీపరంగానూ ఇబ్బందులు ఎదురయ్యాయి. "ఆడపిల్లకు పెద్ద చదువులు ఎందుకు? ఎక్కడో ఉంచి చదివించడం ఏమిటి? నీ స్తోమత తెలిసే చేస్తున్నావా? పెళ్ళి చేసి పంపెయ్. ఇంకా ఇద్దరు మగపిల్లలున్నారు నీకు" అంటూ నాన్నకు ఎందరో సలహాలు ఇచ్చారు. కానీ నా తల్లితండ్రులు నా మీద నమ్మకం ఉంచారు. "సమాజం గురించి నువ్వు పట్టించుకోకు. నీ లక్ష్యం మీదే ఏకాగ్రత పెట్టు" అని చెప్పారు. నా మీద సామాజికమైన ఒత్తిడి ఎన్నడూ పడనివ్వలేదు. కానీ పరిస్థితి ఏమిటనేది నాకు తెలుసు. అందుకే ఎంతో కష్టపడి ప్రిపేర్ అయ్యాను. పరీక్ష రాశాను. ఒకసారి ఫెయిల్ అయ్యాను. రెండోసారి కూడా దగ్గరగా వచ్చినా వైఫల్యం ఎదురయింది. దాంతో నా పట్టుదల మరింత పెరిగింది. మూడోసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్ళాను. కానీ అప్పుడు కూడా ఆశాభంగం తప్పలేదు. "ఇక ఇవన్నీ ఆపెయ్, ఏదైనా ఉద్యోగం చూసుకో. పెళ్ళి చేసుకో. ఇక నీ వల్ల కాదు" అనే సలహాలు బంధువులు, మిత్రుల నుంచి కూడా వినిపించాయి. కానీ "నువ్వు సాధించగలవు. మరింత గట్టిగా ప్రయత్నించు" అంటూ నా కుటుంబం నా వెనుక నిలిచింది. 'ఇప్పటివరకూ నేను చేసిన పొరపాట్లేమిటి?' అని మరోసారి విశ్లేషించుకున్నాను. 'ఓటములు జీవితంలో భాగం. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని, కొత్త అడుగులను స్థిరంగా, సక్రమంగా వేయాలి. అప్పుడే మరింత బలంగా తయారవుతాం' అని నమ్మాను. నాలుగోసారి నా గురి తప్పలేదు. ఈసారి ఇంటర్వ్యూ కూడా బాగా చేశాను. ఫలితాల్లో నాకు 142వ ర్యాంక్ వచ్చింది. మహారాష్ట్రలో తొలి ముస్లిం మహిళా ఐఏఎస్‌ను నేనేనని అప్పటివరకూ నాకు తెలీదు. అది గొప్ప విషయంగా కూడా అనుకోవడం లేదు."

# విరేచనాలు అవుతూ ఉంటే...

వాతావరణ మార్పులు, తినే ఆహార పదార్థాలు కలుషితం కావడం, జీర్ణ సమస్యల వల్ల విరేచనాలు అవుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి ఉపశమనం పొందవచ్చు.



- నీళ్ల విరేచనాలు అవుతుంటే కొబ్బరి నీళ్లు తాగడం ఉత్తమం. దీనివల్ల శరీరం కోల్పోయిన నీటి శాతం భర్తీ అవుతుంది. కొబ్బరి నీళ్లలోని మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ శరీరానికి సత్తువను అందిస్తాయి.
- ఒక గ్లాసు మంచినీళ్లలో చిటికెడు ఉప్పు, ఒక చెంచా పంచదార కలుపుకుని తాగితే... విరేచనాల వల్ల కలిగే అలసట, నీరసం తగ్గుతాయి.
- అల్లం రసం లేదా అల్లం టీ తాగడం వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. అల్లంలోని యాంటీ మైక్రోబియల్ గుణాలు జీర్ణ సమస్యలను నివారిస్తాయి.
- పెరుగులో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాలు ఉంటాయి. ఇవి ప్రేవులను శుభ్రం చేస్తాయి. అర గ్లాసు పెరుగులో ఒక చెంచా మెంతులు కలుపుకుని తీసుకుంటే వెంటనే విరేచనాలు తగ్గుతాయి.
- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా జీలకర్ర వేసి బాగా మరగించి గోరువెచ్చగా చల్లార్చి తాగితే కడుపులో సమస్యలు తగ్గి విరేచనాలు ఆగుతాయి.
- నాలుగు పుదీనా ఆకులను నమిలినా... పుదీనా టీ తాగినా... సమస్య తీరుతుంది. ఒక చెంచా గ్రీక్ యోగర్ట్ తింటే వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- ఒక కప్పు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల యాపిల్ సైడర్ వెనిగర్ కలుపుకుని తాగితే విరేచనాలు తగ్గుతాయి.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు వేసుకుని తాగితే ప్రయోజనం కనిపిస్తుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అర గ్లాసు నీళ్లు, మూడు చెంచాల పటిక బెల్లం వేసి బాగా మరగించాలి. నీళ్లు కొద్దిగా పాకంలా మారాక స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పాకాన్ని చెంచాతో తీసుకుంటూ మెల్లగా తాగాలి. పావు గంటలో విరేచనాలు తగ్గుతాయి.



# మెరిసే సింక్ కోసం...

ప్రస్తుతం ప్రతీ ఇంట్లో సింక్‌లు ఉంటున్నాయి. వంటగదిలో, బాత్‌రూమ్‌లో, ఇంటి వెనక తప్పనిసరిగా సింక్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సాధారణంగా వీటిని స్టీల్, పింగాణీ, గ్రానైట్, సిమెంట్‌లతో రూపొందిస్తూ ఉంటారు. వాడుతున్న కొద్దీ అవి మరకలతో నిండి పాతబడుతూ ఉంటాయి. అలాంటి వాటిని ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా చిన్న చిట్కాలతో కొత్తవాటిలా మెరిపించవచ్చు. ఆ చిట్కాల గురించి తెలుసుకుందాం..!


- ఒక గిన్నెలోకి కొద్దిగా శనగపిండిని తీసుకోవాలి. ఒక స్క్రబ్బర్‌ను నీళ్లతో తడిపి దానితో శనగపిండిని అద్దుకుంటూ సింక్‌ను తోమాలి. స్టీల్, గ్రానైట్ ఇలా ఏ రకం సింక్‌నైనా శనగపిండి పూర్తిగా శుభ్రపరుస్తుంది. సింక్‌లో ఏర్పడే టూత్‌పేస్టు, సబ్బు, డిటర్జెంట్, నూనె తదితర మరకలను పోగొడుతుంది. ఈ చిట్కాతో సింక్ నుండి వెలువడే వాసనలు కూడా తొలగిపోతాయి.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. సింక్‌లోని మరకలమీద ఈ మిశ్రమాన్ని పూసి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత నీళ్లు చల్లుతూ స్క్రబ్బర్‌తో రుద్దితే మరకలన్నీ పోయి సింక్ కొత్తదానిలా మెరుస్తుంది. ఈ చిట్కాతో స్టీల్ సింక్ మీద పేరుకున్న నీటి మరకలు పూర్తిగా పోతాయి. పాలరాతి సింక్‌లను శుభ్రం చేయడానికి వెనిగర్ ఉపయోగించకూడదు.
- ఒక గిన్నెలో రెండు చెంచాల శనగపిండి, మూడు చెంచాల నిమ్మరసం వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని సింక్ మొత్తానికి పట్టించి అరగంటసేపు ఉంచాలి. తరవాత నీళ్లు చల్లుకుంటూ స్క్రబ్బర్‌తో తోవితే సింక్ మీద మరకలన్నీ తొలగిపోతాయి. ఈ చిట్కాని ఏ రకం సింక్‌కైనా ఉపయోగించవచ్చు.
- నిమ్మ తొక్క లోపలి భాగంలో కొద్దిగా ఉప్పు చల్లి దానితో సింక్ మొత్తాన్ని రుద్దాలి. పావుగంటసేపు ఆరిన తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగితే సింక్ తాజాగా మెరుస్తుంది. నిమ్మ తొక్కలను పడేయకుండా తరచూ ఇలా చేస్తూ ఉంటే సింక్ ఎప్పటికీ కొత్తగానే ఉంటుంది.

# మూడు పదులు నిండితే...

వయసు పెరుగుతున్న కొద్దీ చర్మం, కండరాలు, శిరోజాలు బలహీనమవుతూ ఉంటాయి. ప్రతిరోజూ యోగా, వ్యాయామం చేస్తూ మంచి పోషకాహారం తీసుకుంటూ ఉంటే ముప్పై ఏళ్లు నిండినా కూడా అందంగా ఆరోగ్యంగా ఉండవచ్చు అంటున్నారు నిపుణులు. ఇలా ఆరోగ్యాన్ని అందిస్తూ అందాన్ని పెంచే ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం...

- ప్రతిరోజు ఒక కప్పు బొప్పాయి ముక్కలు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు చర్మం పొడిబారకుండా, ముడుతలు రాకుండా చేస్తాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. జీర్ణక్రియ సజావుగా జరిగేలా తోడ్పడతాయి.
- వారానికి రెండు రోజులు పాలకూరని ఆహారంలో చేర్చుకోవాలి. పాలకూరలో ఐరన్, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు పనితీరుని చురుకుగా మారుస్తాయి. జ్ఞాపకశక్తిని పెంచుతాయి. శిరోజాలకు ఆరోగ్యాన్ని అందిస్తాయి.
- తరచూ అవకాడో తినడం మంచిది. దీనిలో ఇ విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది చర్మాన్ని తేమగా ఉంచడంతోపాటు అకాల వార్థక్యాన్ని నివారిస్తుంది.
- ప్రతిరోజూ సాయంత్రంపూట బాదం, పిస్తా, జీడిపప్పు, మొలకలు, గుమ్మడి గింజలు లాంటివి తీసుకుంటూ ఉండాలి. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, జింక్ ఎక్కువగా ఉంటాయి. ఇవి వయసు పెరిగే కొద్దీ శరీరంలో ఏర్పడే ఇన్‌ఫ్లమేషన్ సమస్యలను నివారిస్తాయి.
- తరచూ గ్రీన్ టీ తాగుతూ ఉంటే శరీరంలో పేరుకునే విషపదార్థాలు విసర్జితమవుతాయి. మెదడు, గుండె ఆరోగ్యంగా పనిచేస్తాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. పొట్ట పెరగకుండా ఉంటుంది.
- ప్రతిరోజూ కనీసం ఒక కప్పు పెరుగు తీసుకోవడం మంచిది. దీనిలోని బ్యాక్టీరియా జీర్ణాశయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు బలోపేతమవుతాయి. ఒత్తిడి, ఆందోళన తగ్గి మంచి నిద్ర పడుతుంది.
- తరచూ డార్క్ చాక్లెట్ తింటూ ఉంటే మెదడు ఉత్తేజితమవుతుంది. నీరసం, అలసట తగ్గుతాయి.






కాంగ్రెస్ మంగళవారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన పోస్టర్



బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ పోస్టు చేసిన ఫొటో

# కాంగ్రెస్, బీజేపీ 'పోస్టర్' వార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడిపై కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు పతాకస్థాయికి చేరాయి. మంగళవారం పోస్టర్ యుద్ధానికి దిగాయి. పసుపు రంగు కుర్తా పైజామా, నల్లటి బూట్లు ధరించిన ప్రధాని చిత్రాన్ని తల లేకుండా కాంగ్రెస్ సోమవారం రాత్రి 'ఎక్స్'లో పోస్టుచేసింది. దాని కింద 'బాధ్యత వహించాల్సిన సమయంలో మాయమయ్యారు' అనే సందేశం పెట్టింది. దీనిని పాకిస్థాన్ మాజీ మంత్రి ఫవాద్ చౌదరి రీట్వీట్ చేయడంతో బీజేపీ మంగళవారం.. కాంగ్రెస్‌పై విరుచుకుపడింది. రాహుల్‌గాంధీ పాకిస్థాన్ మిత్రుడంటూ బీజేపీ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ట్వీట్ చేయడమేగాక.. వీపు వెనుక కత్తి దాచుకుని ఉన్న రాహుల్ చిత్రాన్ని పోస్టు చేశారు. పహల్గాం ఉగ్ర ఘటన తర్వాత కేంద్రం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ప్రధాని పాల్గొనకపోవడంపై కాంగ్రెస్ తరచూ విమర్శలు చేస్తోంది. ఆ క్రమంలోనే తాజా పోస్టర్‌ను పోస్టు చేసింది. దీనిపై బీజేపీ తీవ్రస్థాయిలో స్పందించింది. కాంగ్రెస్ సంపూర్ణంగా పాకిస్థాన్‌కు మద్దతిస్తోందని.. ఆ పార్టీని 'లష్కరే పాకిస్థాన్ కాంగ్రెస్'గా అభివర్ణించింది. అఖిల పక్ష సమావేశంలో ఐక్యత గురించి ఆ పార్టీ నొక్కిచెప్పిందని.. కానీ ఆ పార్టీ నేతలు పాక్‌తో చర్చలు జరపాలంటున్నారని ఆక్షేపించింది. 'తలలేని మొండెం'.. ఆ పార్టీ ఉగ్ర సిద్ధాంతంగా మారిందని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. 'తలలేని ప్రధాని చిత్రాన్ని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పోస్టు చేసింది. తద్వారా భారత్‌లో మీర్ జాఫర్ మద్దతుదారులున్నారని పాకిస్థాన్‌కు గట్టి సందేశం పంపింది. రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే ఆ పోస్టు పెట్టారు. దీనిని చూసి దేశం సిగ్గుపడుతోంది. క్లిష్ట సమయంలో భారత్‌ను బలహీనపరిచేందుకు లష్కరే పాకిస్థాన్ కాంగ్రెస్ చేసిన ప్రయత్నమిది' అని విమర్శించారు. తలలేని మొండెం ఉగ్రవాద నినాదమని.. ఆ పార్టీ పోస్టర్ దానినే ప్రతిబింబిస్తోందన్నారు. ముస్లిం ఓటు బ్యాంకును సంతృప్తిపరచడానికే కాంగ్రెస్ తలలేని మొండెం చిత్రాన్ని పోస్టుచేసిందని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో ఆరోపించారు. ఈ వివాదంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. "పార్లమెంటు చర్చల్లో ప్రధాని పాల్గొని పహల్గాం ఘటన పరిణామాలపై వివరణ ఇవ్వాలని కోరాం. ఇందులో రాజకీయ ఎజెండా ఏమీ లేదు' అని స్పష్టం చేశారు.

### పోస్టర్ తొలగింపు..

తీవ్ర రాజకీయ దుమారం దరిమిలా 'తలలేని ప్రధాని' పోస్టర్‌ను 'ఎక్స్'నుంచి కాంగ్రెస్ పార్టీ తొలగించింది. ఈ పోస్టర్‌పై కాంగ్రెస్ నాయకుల్లోనే విభేదాలు తలెత్తినట్లు సమాచారం. పార్టీ వైఖరికి భిన్నమైన పోస్టరుకు అనుమతించినందుకు పార్టీ సోషల్ మీడియా విభాగం సారథి సుప్రియ శ్రీనతేను కాంగ్రెస్ అధిష్ఠానం మందలించిందని, తక్షణం పోస్టర్ తొలగించాలని ఆదేశించిందని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి.

## ఊదరగొట్టిన పాక్ చానళ్లు..
# తుస్‌మనిపించిన ఐఎస్‌పీఆర్ డీజీ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో.. మంగళవారం ఉదయం నుంచి ఆ దేశ మీడియా సంస్థలు సాయంత్రం 6.30కు కీలక నిర్ణయం వెలువడనుందని ఊదరగొట్టాయి. "సాయంత్రం 6.30కు ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) డీజీ అహ్మద్ షరీఫ్ చౌదరి విలేకరుల సమావేశంలో మాట్లాడతారు. మిలటరీ సన్నద్ధత నేపథ్యంలో కీలక అంశాలను వెల్లడిస్తారు" అంటూ కథనాలను ప్రసారం చేశాయి. అయితే షరామామూలుగా పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని భారత్ ఉసిగొల్పుతోందని చౌదరి ఆరోపించారు. ఇటీవల జీలం బస్ స్టేషన్ వద్ద అరెస్టయిన మాజిద్ అనే వ్యక్తి ఇంట్లో జరిపిన తనిఖీల్లో భారత్‌కు చెందిన డ్రోన్, 10 లక్షల పాకిస్థానీ రూపాయలు లభ్యమయ్యాయని.. భారత సైన్యానికి చెందిన ఓ సుబేదార్‌తో అతను మాట్లాడినట్లుగా ఆధారాలున్నాయని చెప్పారు. బలూచిస్థాన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను అంతమొందించామంటూ.. సమావేశాన్ని ముగించారు. విలేకరుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే నిష్క్రమించారు.

## ప్రధాని మోదీతో మోహన్ భాగవత్‌భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. పహల్గాం దుర్ఘటన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఆ దుర్ఘటనపైనే ఇరువురు నేతలు చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రక్షణ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, త్రి దళాల అధిపతులతో సమావేశమయిన అనంతరం ప్రధాని..భాగవత్‌తో చర్చలు జరిపారు.

## ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్టు సూచనలు అందుతున్నాయి. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ.1,000 నుంచి రూ.3,000కు పెంచే అవకాశం ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస్)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ.1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ.3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

## కెనడాలో భారత విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఒట్టావా, ఏప్రిల్ 29: కెనడాలోని ఒట్టావాలో భారతీయ విద్యార్థిని వన్షిక (21) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత హైకమిషన్ ధ్రువీకరించింది. పంజాబ్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ నేత దేవిందర్ సైనీ కుమార్తె వన్షిక రెండేళ్ల క్రితం డిప్లొమా కోర్సు చేయడానికి కెనడా వెళ్లింది. గత శుక్రవారం రాత్రి అద్దె ఇంటిని వెతికేందుకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. అదేరోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆమె ఫోను స్విచ్ ఆఫ్ అయింది. దీంతో ఆందోళన చెందిన సన్నిహితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు 3 రోజులుగా వన్షిక కోసం గాలించారు. ఈ క్రమంలోనే ఒంటారియో ప్రావిన్స్ వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది.

## గీతం విద్యార్థికి రూ. 1.4 కోట్ల వార్షిక వేతనం

» అమెజాన్‌కు ఎంపికైన ప్రియాంక రెడ్డి


పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏడాదికి రూ. 1.4 కోట్ల వేతనంతో గీతం విద్యార్థిని కారుమూరు ప్రియాంకరెడ్డి ప్రతిష్ఠాత్మక అమెజాన్ సంస్థలో ఉద్యోగం సాధించింది. ప్రియాంక గీతం యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సీఎస్‌ఈ విద్యార్థిని. 2024-25 విద్యా సంవత్సరంలో 270కి పైగా బహుళ జాతి కంపెనీలు ఇక్కడ ప్రాంగణ నియామకాలను నిర్వహించాయని గీతం వర్గాలు తెలిపాయి. అత్యధికంగా యాక్సెంచర్ కంపెనీకి 91 మంది ఎంపికవగా, టెక్ మహీంద్రా సంస్థకు 87 మంది, రినెక్స్ టెక్నాలజీస్‌కు 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రకటించింది. అట్లాసియన్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, డెలాయిట్, హెచ్‌ఎస్‌బీసీ వంటి సంస్థలు ఆకర్షణీయమైన వేతనాలతో వివిధ విభాగాలకు చెందిన గీతం విద్యార్థులను ఎంపిక చేసినట్టు పేర్కొన్నాయి. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం క్యాంపస్‌లో మంగళవారం విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు.

# పాక్ దిగ్బంధం!?

## దాయాది దేశాన్ని అన్ని అంశాల్లో ఇరుకున పెట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు

» ఇప్పటికే దౌత్య, వాణిజ్యపరంగా ఆంక్షలు

» తాజాగా పాక్ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని మూసేసే యోచన



మంగళవారం త్రివిధ దళాల అధిపతులతో సమావేశంలో ప్రధాని మోదీ. చిత్రంలో జాతీయ భద్రతా సలహాదారు డోభాల్, నౌకాదళం చీఫ్ దినేశ్ త్రిపాఠి, ఎయిర్‌ఫోర్స్ చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్‌ను అన్ని అంశాల్లోనూ ఇరుకున పెట్టేందుకు భారత్ సిద్ధమైంది. ఇప్పటికే పాక్‌కు దౌత్యపరంగా స్థాయిని తగ్గించడం, వాణిజ్యాన్ని నిషేధించడం, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం... ఇకపై వాయు, జల మార్గాలనూ మూసేయాలని నిర్ణయించినట్టు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్రస్థాయిలో స్పందించడంతో.. భారత విమానాలకు పాక్ తన గగనతలాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. అదే తరహాలో పాక్ విమానాలకు భారత గగనతలాన్ని నిషేధించేందుకు కేంద్రం సిద్ధమైనట్టు తెలిసింది. దీనివల్ల పాకిస్థాన్ నుంచి తూర్పు వైపునకు.. అంటే మయన్మార్, థాయిలాండ్, మలేసియా వంటి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లాలంటే.. చైనా మీదుగా, లేదా శ్రీలంక మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. అంత ఎక్కువ దూరం తిరగడం వల్ల పాక్ విమానయాన సంస్థలకు పెద్ద దెబ్బే తగలనుంది. మరోవైపు భారత పోర్టుల్లో పాకిస్థాన్ నౌకలు ఆగకుండా నిషేధం విధించాలని కూడా కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది.

### జమ్మూలో భద్రతపై ఎన్‌ఎస్‌జీ డ్రిల్...

భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, మరిన్ని ఉగ్రదాడులు జరగవచ్చనే వార్తల నేపథ్యంలో.. జమ్మూలో భద్రతపై జాతీయ భద్రతాదళం (ఎన్‌ఎస్‌జీ), స్థానిక పోలీసులు కలసి భారీ స్థాయిలో డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు ఎలా వ్యవహరించాలన్న దానిపై.. నిఘా డ్రోన్లు, అత్యాధునిక ఆయుధాలతో ఆప్ శంభు ఆలయం, రైల్వే స్టేషన్, జీఎంసీ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఈ డ్రిల్ నిర్వహించినట్టు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఇప్పటికే భారత్‌లో పాక్ ప్రభుత్వ అధికారిక 'ఎక్స్' ఖాతాను నిలిపివేసిన కేంద్రం..తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఖాతాను కూడా నిలిపివేసింది.

### భారత సరిహద్దుల్లోకి పాక్ నిఘా రాడార్లు..

భారత్ ఏ క్షణమైనా దాడికి దిగవచ్చన్న ఆందోళనతో ఉన్న పాకిస్థాన్.. తమ నిఘా రాడార్లను సరిహద్దులకు సమీపంలో తరలిస్తోంది. ఇప్పటికే సియాల్‌కోట్, ఫిరోజ్‌పూర్ సెక్టార్లలోకి రాడార్లను తరలించినట్టుగా భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఇటీవల అంతర్జాతీయ సరిహద్దుకు 58 కిలోమీటర్ల లోపల ఉన్న ఖోర్ కంటోన్మెంట్ ప్రాంతంలో అధునాతన టీపీఎస్-77 మల్టీరోల్ రాడార్‌ను సైతం పాక్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. ఇక నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘన కొనసాగుతోంది. సోమవారం రాత్రి కుప్వారా, బారాముల్లా, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ దళాలు కాల్పులు జరపగా.. భారత దళాలు దీటుగా బదులిచ్చినట్టు రక్షణ వర్గాలు వెల్లడించాయి.

### ఆర్మీపై సైబర్‌దాడులకు పాక్ విఫల యత్నం

భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ హ్యాకర్లు భారత ఆర్మీపై సైబర్‌దాడుల కోసం తీవ్రంగా ప్రయత్నించారు. 'ఐఓకే (ఇంటర్నెట్ ఆఫ్ ఖిలాఫా) హ్యాకర్'గా పిలిచే పాక్ హ్యాకర్ల బృందం మంగళవారం.. వైమానిక దళ ప్లేస్‌మెంట్ పోర్టల్, శ్రీనగర్, రాణిఖేత్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లు, ఆర్మీ వెల్ఫేర్ హౌసింగ్ ఆర్గనైజేషన్ (ఏడబ్ల్యూహెచ్ఓ) వెబ్‌సైట్లను హ్యాక్ చేసేందుకు ప్రయత్నించింది. అయితే నిరంతర పర్యవేక్షణ ఉండే భారత ఆర్మీ సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ ఆ ప్రయత్నాలను నిలువరించినట్టు రక్షణ వర్గాలు తెలిపాయి.

# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుపాదంతో అణచివేస్తామని.. వారి ఊహలకు కూడా అందనంత అత్యంత కఠినమైన శిక్ష విధిస్తామని హెచ్చరించినట్టు సమాచారం. కాగా.. జూలైలో జరిగే అమర్‌నాథ్ యాత్రకు రక్షణ ఏర్పాట్లు ఏలా చేయాలి, దేశంలో కీలకమైన ప్రాంతాల్లో ఉగ్రవాద దాడులు జరగకుండా ఎలా నిరోధించాలి, పాక్ కవ్వింపు చర్యలకు ఏ విధంగా బదులునివ్వాలి, అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకి ఎలా చేయాలనే అంశాలపై కూడా ఈ భేటీలో విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. అలాగే.. జమ్ము జిల్లాలోని అఖ్నూర్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ సైన్యాలు వరుసగా ఐదోసారి కాల్పులు జరిపిన వైనంపైనా చర్చించారు. రక్షణ శాఖకు చెందిన విభాగాలపై పాకిస్తాన్ సైబర్ దాడుల గురించి కూడా ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. శ్రీనగర్, రాణిఖేడ్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లు, ఆర్మీ గృహ సంక్షేమ సంస్థ, తదితర సంస్థల వెబ్‌సైట్లను ఐవోకే హ్యాకర్ పేరిట పాక్ హ్యాక్ చేసింది. ఆ వెబ్‌సైట్ల హోం పేజీలో సైట్ హ్యాక్‌డ్ అన్న వాక్యాలతో పాటు పాకిస్థాన్ జెండా, ముసుగుతో ఒక ఆగంతకుడి చిత్రం కనపడుతున్నాయి. ఈ భేటీకి ముందు.. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఒక అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఆ భేటీకి మూడు పారామిలటరీ దళాల అధిపతులు, రెండు భద్రత సంస్థల సీనియర్ అధికారులు హాజరయ్యారు. అయితే, ఆ సమావేశం అజెండా ఏమిటో అధికారికంగా వెల్లడించలేదు. కాగా.. బుధవారం ప్రధాని అధ్యక్షతన జరగనున్న జాతీయ భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) భేటీలో.. పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. వారంరోజుల వ్యవధిలో సీసీఎస్ భేటీ జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ కమిటీలో ప్రధానితో పాటు హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జయశంకర్ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశం తర్వాత కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశం కూడా జరగనుంది.

## 'పహల్గాం'పై పార్లమెంట్ నిర్వహించండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటనపై చర్చించేందుకు వీలైనంత తర్వాత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని ప్రధాన మంత్రిని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. ప్రధాని మోదీకి మంగళవారం వేర్వేరుగా లేఖలు రాశారు. "పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ప్రతీ భారతీయుడిలో ఆవేశాన్ని రగిల్చింది. ఇలాంటి కఠిన సమయంలో.. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఏకతాటిపై ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉంది. అందువల్ల పార్లమెంట్ ఉభయసభలు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారని ప్రతిపక్షం ఆశిస్తోంది. వీలైనంత త్వరగా ఆ సమావేశాలు నిర్వహించాలని కోరుతున్నా" అని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.

# 'పహల్గాం' పాపం పాకిస్థాన్‌దే!

» దాడిలో పాల్గొన్న పాక్ మాజీ పారా కమాండో హాషీమ్ మూసా!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 : పహల్గాం నరమేధం పాకిస్థాన్ పాపమేనని భారత్ తొలినుంచీ గట్టిగా నమ్ముతోంది. ఇప్పుడు అందుకు గట్టి ఆధారం కూడా దొరికింది. ఇటీవల భద్రతాబలగాల కాల్పుల్లో మరణించిన ఓ ఉగ్రవాది వద్ద హాషీమ్ మూసా అలియాస్ సులేమాన్ ఫొటో బయటపడింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత బాగా వినిపిస్తున్న పేరు మూసా. అయితే, ఇతడు గతంలో పాకిస్థాన్ ఆర్మీలో ప్రత్యేక బలగాల (ఎస్‌ఎస్‌జీ) పారా కమాండోగా పనిచేశాడని ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దీంతో పహల్గాం దాడిలో పాక్ ఆర్మీ, ఐఎస్ఐకి ఉన్న ప్రత్యక్ష పాత్ర స్పష్టమయిందని ఎన్ఐఏ అధికారులను ఉటంకిస్తూ ఓ జాతీయ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. అతడు ప్రస్తుతం ఉగ్ర సంస్థ లష్కరే తాయిబాలో కీలక వ్యక్తిగా ఉన్నాడని మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. పారా కమాండోగా ఆయన తీసుకున్న శిక్షణే పహల్గాం దాడి తర్వాత భద్రతా బలగాల నుంచి తప్పించుకోవడంలో సహకరించిందని పోలీసులు అంచనా వేస్తున్నారు. గతేడాది అక్టోబరులో మధ్య కశ్మీరులోని గగన్‌గీర్‌లో ఏడుగురు కార్మికులను ఉగ్రవాదులు కాల్చిచంపారు. అదే నెలలో బారాముల్లాలో ఆర్మీ వాహనంపై దాడిచేసి జవాను సహా ఇద్దరిని చంపేశారు. తాజాగా పహల్గాం ఉగ్రదాడి. ఈ మూడు దాడుల్లోనూ ఉమ్మడిగా వినిపించిన పేరు మూసా. ఈ నేపథ్యంలో, ఈ 3దాడులకు సంబంధం ఉందని ఎన్ఐఏ భావిస్తోంది. గతేడాది రెండు ఘటనలకు ఉన్న పోలికలను అప్పుడే నిఘా వర్గాలు గుర్తించి ఉంటే మూడో దాడిని నిలువరించడానికి వీలయ్యేదని ఎన్ఐఏ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన మూసాతో పాటు అలీ భాయ్ ఏడాది క్రితమే భారత్‌లోకి చొరబడినట్లు ఒక నివేదిక పేర్కొంది. ఇదిలా ఉండగా, కశ్మీర్‌లో మరిన్ని ప్రాంతాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఇక్కడున్న 87 పర్యాటక ప్రదేశాల్లో 48 ప్రాంతాలను మూసివేసింది. పహల్గాం దాడి తర్వాత కొందరు స్లీపర్ సెల్స్ కశ్మీర్ లోయలో యాక్టివేట్ అయినట్టు ఈ వర్గాలు గుర్తించాయి.

## ప్రజల విశ్వాసం కోల్పోతున్న సీబీఐ!

ఆ సంస్థపై పెరుగుతున్న అవినీతి ఫిర్యాదులు

మద్రాస్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

చెన్నై, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీబీఐ ప్రజల విశ్వాసం కోల్పోతోందని మద్రాస్ హైకోర్టు తూర్పారబట్టింది. సీబీఐపైనే అవినీతి ఫిర్యాదులు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించింది. తిరునల్వేలి జిల్లా పాళయంకోటలోని ఓ జాతీయ బ్యాంకులో రుణాల పేరుతో రూ.2 కోట్ల మోసం జరిగిన వ్యవహారంలో ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సహా 13 మందిపై సీబీఐ అధికారులు కేసు నమోదుచేశారు. విచారణ జరిపిన సీబీఐ కోర్టు బ్యాంక్ చీఫ్ మేనేజర్ బాలసుబ్రమణియన్‌తోపాటు 8 మందికి మాత్రమే శిక్ష విధిస్తూ 2019లో తీర్పు ఇచ్చింది. దీంతో ఆ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఆ 8మంది హైకోర్టు మదురై ధర్మాసనంలో అప్పీలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. కింది కోర్టు విధించిన శిక్షను రద్దు చేస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా సీబీఐ దర్యాప్తు తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'సీబీఐపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉండేది. కానీ, ఇక్కడ సీబీఐ విచారణలో లోపం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొన్ని కేసుల్లో ప్రధాన నిందితులను నిర్దోషులుగా విడుదల చేసి, కొంత మంది వ్యక్తులపై కేసులు నమోదు చేస్తోందని బాధితుల తరఫు న్యాయవాదులు చెబుతున్నారు. సీబీఐపై అవినీతి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. ఈ కారణంగా సీబీఐ ప్రజల విశ్వాసం కోల్పోతోంది. ఈ నేపథ్యంలో కేసులో నిందితులను చేర్చడం, వారిపై కేసులు నమోదుచేయడం, చార్జిషీటు దాఖలు చేయడం వరకు ప్రతి విషయాన్నీ సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలి' అని ధర్మాసనం సూచించింది.

## ఉగ్రవాదులపై స్పైవేర్ వాడితే
# తప్పేంటి?

### దేశ భద్రత విషయంలో రాజీపడనక్కర్లేదు

» ప్రైవేటు వ్యక్తులపై వాడితే దర్యాప్తు చేయిస్తాం

» నిపుణుల నివేదికను బహిర్గతపర్చలేం: సుప్రీం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పెగాసస్ స్పైవేర్‌ను ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వాడితే తప్పేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాగే దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన అంశాలను స్పృశించిన ఏ నివేదికనైనా బహిర్గతం చేయడం కుదరదని తెలిపింది. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలంటూ అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం దేశం స్పైవేర్‌ను కలిగి ఉండడం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే, అది ఎలా? ఎవరిపై ఉపయోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఓ పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తున్నారా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపిన సాంకేతిక నిపుణుల బృందం నివేదికను ఇప్పటివరకూ బహిర్గతపర్చలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం.. "ఉగ్రవాదులపై దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే తప్పేముంది? స్పైవేర్‌ను కలిగి ఉండడం తప్పేమీ కాదు. అయితే, దాన్ని ఎవరి మీద వాడుతున్నారన్నదే ప్రశ్న. దేశ భద్రత విషయంలో రాజీపడాల్సిన అవసరం లేదు. అదేసమయంలో ప్రైవేటు వ్యక్తులు, పౌరసమాజానికి రాజ్యాంగం కల్పించిన గోప్యత హక్కును కూడా పరిరక్షించాల్సి ఉంటుంది" అని వ్యాఖ్యానించింది. జర్నలిస్ట్ పరంజయ్ గుహ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదిస్తూ.. ఫోన్ల హ్యాకింగ్ విషయాన్ని వాట్సాప్ సంస్థే వెల్లడించిందని గుర్తుచేశారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఉగ్రవాదులపై స్పైవేర్‌ను వినియోగించడంలో ఎలాంటి తప్పూ లేదన్నారు. వారికి గోప్యత హక్కులేమీ ఉండవని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. స్పైవేర్‌ను ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వాడుకుంటే తప్పేమీ లేదంది. సామాన్యులపై ఉపయోగిస్తే, దానిపై తాము దర్యాప్తు జరిపిస్తామని తెలిపింది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. "దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ వీధుల్లో చర్చించుకునే పత్రంగా ఈ నివేదిక మారకూడదు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పహల్గాం ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. "ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొంది.

## 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్

» 14న ప్రమాణ స్వీకారం

» కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నియమితులయ్యారు. వచ్చే నెల 14న ఆయన సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ గవాయ్‌ను 52వ సీజేఐగా ఎంపిక చేసినట్లు కేంద్ర న్యాయశాఖ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ బీఆర్ గవాయ్‌ని తదుపరి సీజేఐగా నియమించినట్లు తెలిపింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వచ్చే నెల 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటి రోజు (14న) జస్టిస్ గవాయ్ సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తారు.

# కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ!

» విజయం దిశగా లిబరల్ పార్టీ

» ఓటమిని అంగీకరించిన ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ




టొరంటో, ఏప్రిల్ 29: కెనడా సార్వత్రిక ఎన్నికల్లో మార్క్ కార్నీ నేతృత్వంలోని అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్తోంది. దీంతో నూతన ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. మొత్తం 343 స్థానాలున్న కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 172 స్థానాలు అవసరం. అయితే ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం, లిబరల్ పార్టీ 168 చోట్ల విజయం సాధించింది. ఇంకా ప్రత్యేక బ్యాలెట్లలోని ఓట్లు లెక్కించాల్సి ఉంది. ఒకవేళ లిబరల్ పార్టీ మెజారిటీ సాధించనప్పటికీ మార్క్ కార్నీ మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. కెనడా ప్రధాన ప్రతిపక్షమైన కన్జర్వేటివ్ పార్టీ 134 చోట్ల విజయం సాధించింది, ఆ పార్టీ నేత పియరీ పోయిలీవ్రా తాను పోటీ చేసిన స్థానంలో ఓటమి పాలయ్యారు. ఫ్లాంకోయిస్ బ్లాంకెట్ నేతృత్వంలోని బ్లాక్ క్యూబికాయిస్ పార్టీ 22 సీట్లు గెలిచి, మూడో స్థానంలో కొనసాగుతోంది. జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని ఖలిస్థానీ అనుకూల న్యూడెమోక్రటిక్ పార్టీ కేవలం నాలుగు స్థానాలు మాత్రమే గెలిచింది. దాంతో జగ్మీత్ సింగ్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా సుంకాల యుద్ధం, కెనడాను యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేర్చాలంటూ ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్న వేళ ఈ ఎన్నికలు అత్యధిక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అటు భారత్‌తోనూ కెనడాకు విభేదాలు కొనసాగుతున్నాయి. కాగా, మార్క్ కార్నీ మంగళవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచి అమెరికాతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, అయితే ప్రస్తుతం ఆ దేశం కెనడాకు చేసిన నమ్మక ద్రోహం షాక్‌కు గురిచేసిందని చెప్పారు. అమెరికా తమకు చేస్తున్న ద్రోహాన్ని ఎప్పటికీ మరచిపోవద్దని, పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. కెనడియన్లు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## అవినాశ్‌రెడ్డి బయట ఉంటే సాక్ష్యాలు తారుమారు

» వైసీపీ ఎంపీ బెయిల్ రద్దుచేయండి

» సుప్రీంకు సీనియర్ న్యాయవాది లూథ్రా వినతి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఆయన బయటే ఉంటే కేసును ప్రభావితం చేస్తారని ఆమె తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. తన తండ్రి హత్య కేసులో నిందితులు అవినాశ్‌రెడ్డి, డి.శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిల బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాజ్యాలను మంగళవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలుచేసిన అదనపు అఫిడవిట్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి తమకు సమయం కావాలని అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది కోరారు. దీనిపై లూథ్రా అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే ఏళ్ల తరబడి కేసుపై వాదనలు జరుగుతున్నాయని.. అవినాశ్‌రెడ్డి ఇద్దరు పోలీసు అధికారులను అడ్డం పెట్టుకుని కేసును తప్పుదారి పట్టించాలని చూశారని, అన్యాయంగా రాంసింగ్, సునీత దంపతులపై కేసులు పెట్టారని వివరించారు. అవినాశ్‌రెడ్డి బయట ఉంటే సాక్ష్యాలు తారుమారు చేస్తారని, సాక్షులను బెదిరిస్తారని చెప్పడానికి ఇదే నిదర్శనమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను జూలై చివరి వారానికి వాయిదా వేసింది. అయితే.. వచ్చే వాయిదా తేదీకి తాను పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ఈ కేసును మరో ధర్మాసనానికి మార్చాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సూచించారు.



భారత వైమానికదళ రాఫెల్ యుద్ధ విమానం (ఫ్రెంచ్)

# కొట్టాలి.. తిప్పికొట్టలేకుండా!

## భారత సైన్యం ప్రతీకార వ్యూహమిదే!

- పాక్ గట్టిగా స్పందించలేని రీతిలో బుద్ధి చెప్పాలి
- పూర్తిస్థాయి యుద్ధం వచ్చే అవకాశం తక్కువే!
- భారత్‌ను అడ్డుకునేందుకే పాక్ అణు బెదిరింపులు



భారత్ టీ90 ట్యాంక్ (రష్యన్)

## పాక్ ఉగ్రవాద శిబిరాలపై, వాటి ఆయువు పట్లపై దాడి?

పహల్గాం పాశవిక ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ప్రతీకారానికి భారత్ సిద్ధమవుతోంది. ఇప్పటికే సింధు నదీ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడం, పాక్ పౌరుల్ని పంపించేయడం వంటి పలు చర్యలు చేపట్టిన భారత్... సైనికపరంగా కూడా కొన్ని సన్నాహాలు ప్రారంభించింది. అయితే భారత్ ఎంతవరకూ ముందుకు వెళుతుంది? పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మాత్రమే దాడి చేస్తుందా? లేదంటే ఉగ్రవాదులకు దన్నుగా ఉన్న పాక్ సైనిక స్థావరాలపై కూడా అస్త్రాలు గురిపెడుతుందా? లేకపోతే పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి దిగుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు అందరి మదిలో మెదులుతున్నాయి. పాక్‌పై త్వరలో భారత్ దాడి తథ్యమని సరిహద్దుకు ఇవతల, అవతల కూడా మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూర్చేలా ఉన్నాయి. "ఉగ్రవాదులు భూమ్మీద ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం. దాడికి పాల్పడ్డవారికి, దాడి వెనక సూత్రధారులకు అత్యంత కఠిన శిక్ష విధిస్తాం. వారిని కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తాం. వారి అంతు చూసేందుకు ఎంతవరకైనా వెళ్తాం. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసే సమయం ఆసన్నమైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. కానీ భారత్ దాడి ఎప్పుడు? ఎక్కడ? ఎంతమేరకు? అనే ఉత్కంఠ ఇప్పుడు అందరిలో ఉంది. గతానుభవాలు, ఇరుదేశాల బలాబలాలు-పరిస్థితులు, అంతర్జాతీయ పరిస్థితులు, రక్షణ రంగ నిపుణుల అభిప్రాయాలను పరిశీలించినప్పుడు పాక్‌పై భారత్ దాడి పూర్తిస్థాయి యుద్ధంగా కాకుండా, పరిమితంగానే ఉండే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.




భారత్, రష్యా తయారీ బ్రహ్మోస్ క్షిపణి

### భారత్ ఏం చేస్తుంది?

పాక్ ఉగ్రవాద దాడులకు భారత్ సైనిక చర్యల ద్వారా స్పందించడం ఇదే మొదటిసారి కాదు. 2001లో భారత పార్లమెంటుపై పాక్ ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు భారత్ ఆపరేషన్ పరాక్రమ్ పేరిట భారీ సైనిక మోహరింపు చేపట్టింది. అయిదు లక్షల మంది సైన్యాన్ని పాక్ సరిహద్దులో మోహరించి పాక్‌పై శతఘ్నులతో కాల్పులు జరిపింది. ఆ తర్వాత 2016లో యూరిలో భారత ఆర్మీ ఔట్‌పోస్టుపై ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైనిక కమాండోలు నియంత్రణ రేఖ దాటి ఆక్రమిత కశ్మీర్‌లోని పాక్ సైనిక శిబిరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో చాలామంది పాక్ సైనికుల్ని చంపినట్టు భారత్ ప్రకటించగా... పాక్ మాత్రం ఇద్దరే చనిపోయారని, ఓ భారత సైనికుడిని బంధించామని తెలిపింది. మొత్తమ్మీద ఆనాటి దాడిలో ఎటువైపు ఎందరు చనిపోయారనేది ఇప్పటివరకూ స్పష్టంగా తెలియదు. 2019లో పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో 40 మంది భారత సైనికులు చనిపోవడంతో భారత వాయుసేన పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. ఆ దాడిలో 350 మంది దాకా ఉగ్రవాదులు చనిపోయినట్టు భారత వాయుసేన వర్గాలను ఉటంకిస్తూ భారత మీడియా వెల్లడించగా, ఎవరూ చావలేదని పాక్ ప్రకటించింది. ఆ మర్నాడు పాక్ యుద్ధ విమానాలు భారత్‌లోకి ప్రవేశించి దాడి చేశాయి. భారత మిగ్-21 యుద్ధ విమాన పైలట్ అభినందన్ వర్ధమాన్ పాక్ ఎఫ్-16 (అమెరికా తయారీ)ను కూల్చివేసినట్లు మన వాయుసేన ప్రకటించింది. అయితే ఆ ఎఫ్-16 నుంచి అప్పటికే చేసిన క్షిపణి ప్రయోగం వల్ల మన మిగ్-21 కూలిపోయి వర్ధమాన్ పాక్ సైన్యానికి పట్టుబడ్డాడు. ఆ దాడిలో తాము ఎఫ్-16ను వాడలేదని, చైనా తయారీ జేఎఫ్ 17 విమానాల్ని మాత్రమే ఉపయోగించామని పాక్ చెప్పుకుంది. ఎఫ్-16 వాడారనేందుకు సాక్ష్యంగా భారత్ దాని నుంచి ప్రయోగించిన ఎయిమ్-120 డి క్షిపణి శకలాలను మీడియాకు చూపించింది. మొత్తమ్మీద భారత్ దాడిలో తమకు ఏమీ నష్టం జరగలేదని చెప్పేందుకు పాక్ ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో తాజా ఉగ్రవాద దాడి అనంతరం భారత్ ఏమి చేయబోతోంది? దానికి పాక్ ఎలా స్పందిస్తుంది? అనేది ఉత్కంఠ రేపుతోంది.

#### కనీసం ఇది చేయాల్సిందే!

"ఉగ్రవాద దాడులకు ప్రతీకారంగా సరిహద్దు దాటి పాక్‌పై దాడి చేయడం అనేది 2016, ప్రత్యేకించి 2019 తర్వాత ఒక కనీస చర్యగా మారింది. అందువల్ల పాక్ ఆగడాల్ని సహించబోమని సరిహద్దుకు ఇవతల, అవతల చాటి చెప్పే ఉద్దేశంతో భారత్ కొంత గట్టిగానే స్పందించే అవకాశం ఉంది. గతంలో తీసుకున్న చర్యల కంటే తక్కువ స్థాయి చర్య తీసుకోవడం అసాధ్యం" అని ప్రముఖ యుద్ధ చరిత్రకారుడు శ్రీనాథ్ రాఘవన్ బీబీసీకి చెప్పారు. "పాక్‌పై కఠిన చర్య తీసుకోవాలని భారత ప్రజల నుంచి తమ ప్రభుత్వంపై చాలా ఒత్తిడి ఉంది. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ గట్టిగా దాడి చేస్తే అది పాక్‌కు గట్టి హెచ్చరిక పంపినట్టు అవుతుంది. అయితే పాక్ ప్రతీకార చర్యలకు దిగితే ఇదంతా తీవ్ర సంక్షోభానికి, యుద్ధానికీ దారితీసే ప్రమాదమూ ఉంది" అని విదేశాంగ విధాన విశ్లేషకుడు మైఖేల్ కుగెల్‌మ్యాన్ అభిప్రాయపడ్డారు. భారత్ ఒకవేళ దాడి చేసి పాక్ మళ్లీ ప్రతీకార దాడి చేయకపోతే పాకిస్థాన్ ప్రభుత్వంపై పాక్ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల పాక్ స్పందన ఎలా ఉంటుందనే విషయంలో భారత్ ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇటు భారత్, అటు పాక్ రెండూ అణ్వస్త్ర దేశాలు కావడం వల్ల దాడి ఏ స్థాయిలో ఉండాలనేది నిర్ణయించుకోవడం అంత సులభమైన విషయం కాదు. గతంలో కొన్నిసార్లు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ రహస్య దాడులు చేసినట్టు వార్తలు వచ్చాయి. ఈసారి కూడా అలా చేయవచ్చుగానీ రహస్య దాడుల వల్ల జనాగ్రహం చల్లారదు. అందువల్ల భారత్ ఏం చేసినా బాహాటంగానే చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే భారత దాడి తర్వాత పాక్ గట్టిగా స్పందించలేని విధంగా మన వ్యూహాన్ని రూపొందించుకోవడం చాలా ముఖ్యమని రక్షణ నిపుణులు చెబుతున్నారు. భారత్ పరిమిత స్థాయిలో సైనిక చర్య తీసుకుంటే దానిపై పాకిస్థాన్ ఆగ్రహావేశాలతో స్పందించి పూర్తిస్థాయి యుద్ధానికి దిగే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. కారణం... పాక్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. అప్పులు భారీగా పెరిగిపోయాయి. ద్రవ్యోల్బణం దాదాపు 40 శాతానికి చేరింది. ప్రభుత్వ ఆదాయంలో 45 శాతంపైగా వడ్డీలకే పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి యుద్ధం చేసే దుస్సాహసానికి పాక్ పూనుకోకపోవచ్చు. అందువల్ల తమ ప్రజల్ని సంతృప్తిపరచడానికి భారత్ దాడిని తక్కువ చేసి చూపడంతోపాటు, తాము ఏదో నామమాత్రపు ప్రతిదాడి చేసినట్టుగా పాక్ నటించే అవకాశం ఎక్కువగా ఉంది. అందువల్ల పాక్ ఉగ్రవాద శిబిరాలపై దాడి... లేదంటే ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ సైనిక శిబిరాలపై, ఐఎస్ఐ స్థావరాలపై దాడి అనే రెండు ఆప్షన్లలో ఒకదానిని భారత్ ఎంచుకోవచ్చునని ఎక్కువమంది రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



బాలాకోట్ దాడుల్లో భారత్ ఉపయోగించిన ఫ్రెంచ్ మిరాజ్ యుద్ధ విమానం

### అమెరికా, రష్యా, చైనా స్పందనేమిటి?

చరిత్రను పరిశీలిస్తే భారత్‌కు రష్యా... పాకిస్థాన్‌కు అమెరికా సన్నిహితంగా ఉంటూ వచ్చాయి. ఇటీవలి కాలంలో అమెరికా భారత్‌కు కొంత చేరువైంది. ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాలు కూడా పెరిగాయి. అయితే పహల్గాం ఉగ్రదాడిని అమెరికా ఖండించినప్పటికీ, భారత్-పాక్ మధ్య తాజా పరిణామాల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టంచేసింది. భారత్‌కు చిరకాల మిత్రదేశమైన రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధంలో తలమునకలై ఉంది. భారత్ ఉపయోగించే ఆయుధాల్లో అత్యధికం రష్యా నుంచి కొనుగోలు చేసినవే. వాటిలో ఉపయోగించే క్షిపణులు, మందుగుండు, స్పేర్‌పార్టుల్లో చాలాభాగం రష్యా నుంచి రావాల్సిందే. కానీ ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఇంకోవైపు మన మరో శత్రు దేశమైన చైనా పాక్‌కు మద్దతు ప్రకటించింది. భారత్ దాడి చేసే పక్షంలో తాము పాక్‌కు అండగా ఉంటామని బాహాటంగానే చెప్పింది. ఇటీవలి కాలంలో పాక్ తన ఆయుధాల్లో అత్యధికం చైనా నుంచే దిగుమతి చేసుకుంటోంది. చైనాతో కలిసి జేఎఫ్ 17 యుద్ధ విమానాల్ని తయారు చేసింది. భారత రాఫెల్ విమానాలకు సమాధానంగా చైనా నుంచి పాక్ జే 10సీ యుద్ధ విమానాల్ని కొనుగోలు చేసింది. ఇంకోవైపు టర్కీ కూడా పాక్‌కు విమానాలు, ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఫ్రాన్స్ మాత్రం పూర్తిగా భారత్ వెన్నంటే ఉంది. గతంలో కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఫ్రాన్స్ భారత్‌కు మందుగుండు సామగ్రిని సరఫరా చేసి ఆదుకుంది. అయితే ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధాలకు అనువుగా లేవు. టారిఫ్‌ల యుద్ధం, ఆర్థిక మాంద్యం వల్ల చాలాదేశాలు ఆర్థికంగా ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. శతఘ్నుల నుంచి ప్రయోగించే 155ఎంఎం తూటాలు అన్ని యుద్ధాల్లో ఎంతో కీలకమైనవి. ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు గాజా యుద్ధం జరుగుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఆ తూటాలకు కరువొచ్చి పడింది. ఈ పరిణామాలన్నీ గమనిస్తున్న భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. చైనాకు పోటీగా ఆర్థికంగా బలోపేతం కావాలని, సూపర్ పవర్‌గా ఆవిర్భవించాలని ఆశిస్తున్న భారత్ ఇప్పుడు పాక్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి దిగితే ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. అందువల్ల భారత వ్యూహకర్తలు అన్ని ఆప్షన్లనూ పరిశీలించి మనకు తక్కువ నష్టం కలిగే రీతిలో పాక్‌కు ఏ విధంగా బుద్ధి చెప్పగలం అనే వ్యూహాన్ని రూపొందిస్తున్నారు.



ఫ్రాన్స్ నుంచి భారత్ కొనుగోలు చేసిన రాఫెల్ విమానాలకు జవాబుగా చైనా నుంచి పాకిస్తాన్ కొన్న జే10సి విమానం

## అణు దాడికి అవకాశం ఎంత?

పాక్‌పై భారత్ యుద్ధం ప్రకటిస్తే పాక్ భారత్‌పై అణు దాడికి పాల్పడుతుందా అనేది ఒక పెద్ద ప్రశ్న. కానీ పాక్ అణు విధానం (న్యూక్లియర్ డాక్ట్రిన్)ను పరిశీలిస్తే చిన్న కారణాలకే భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేయవచ్చన్నట్టుగా దానిని రూపొందించినట్టు అనిపిస్తుంది. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ సమాచారం ప్రకారం నాలుగు రకాల పరిస్థితుల్లో భారత్‌పై అణు దాడి చేయవచ్చని పాక్ అణు విధానం చెబుతోంది. (కుడివైపు బాక్స్ చూడండి) దీనిని బట్టి చూస్తే భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేయడానికి పాక్‌కు మరీ పెద్ద కారణమంటూ అవసరం లేదు. సంప్రదాయ ఆయుధాల్లో భారత్‌తో తాను పోటీ పడలేదు కాబట్టి భారత్‌తో చిన్న ఉద్రిక్తత తలెత్తితే చాలు... అణ్వస్త్రాలు ప్రయోగించేస్తామని పాక్ బెదిరిస్తూ ఉంటుంది. తాజాగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, రైల్వే శాఖ సహాయమంత్రి హనీఫ్ అబ్బాసీలు భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగిస్తామంటూ దుందుడుకు ప్రకటనలు చేశారు. ఇలాంటి ప్రకటనల ద్వారా భారత్ తమపై అసలు దాడే చేయకుండా అడ్డుకోవాలనేది పాక్ ఎత్తుగడ. అయితే పాక్ అనుసరిస్తున్న ఈ వ్యూహాన్ని అడ్డుకునేందుకు భారత్ ఒక ప్రతివ్యూహాన్ని రూపొందించింది. అదే కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్!

### పాక్ ఎప్పుడు అణుదాడి చేస్తుందంటే?

**భౌగోళిక కారణాలు**

1. భారత సైన్యం పెద్దఎత్తున పాక్ భూభాగంలోకి ప్రవేశించి ముందుకు దూసుకువెళితే... ప్రత్యేకించి సింధు లోయను దాటి వస్తే

**సైనిక కారణాలు**

2. పాక్ సాయుధ దళాల్లో అధిక భాగాన్ని భారత్ నిర్వీర్యం చేస్తే... ప్రత్యేకించి పాక్ వాయుసేనను భారత్ గట్టిగా దెబ్బతీస్తే లేదా పాక్ అణు కేంద్రాలపై/స్థావరాలపై దాడి చేస్తే లేదా పాక్‌పై రసాయన/జీవ ఆయుధాలతో దాడి చేస్తే

**ఆర్థిక కారణాలు**

3. పాక్ నౌకాదళాన్ని దెబ్బతీసి నావల్ బ్లాకేడ్ (1971లో కరాచీ పోర్టును భారత్ దిగ్బంధం చేసిన తరహాలో) ద్వారా పాక్ ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేస్తే లేదా సింధు, జీలం, చీనాబ్ నదుల్లో పాక్ వాటా జలాలను విడుదల చేయకుండా అడ్డుకుని పాక్‌ను ఆర్థికంగా అతలాకుతలం చేస్తే

**రాజకీయ కారణాలు**

4. పాక్‌లో రాజకీయ అస్థిరత కలిగిస్తే... లేదా పాక్‌లో ఏదైనా ప్రాంతాన్ని ఆ దేశం నుంచి విడగొడితే (బంగ్లాదేశ్ మాదిరి)

### ఎవరి బలమెంత?

| | భారత్ | పాకిస్థాన్ |
|---|---|---|
| రెగ్యులర్ సైన్యం | 14,55,550 | 6,54,000 |
| రిజర్వు బలగాలు | 11,55,000 | 5,50,000 |
| పారామిలిటరీ బలగాలు | 25,27,000 | 5,00,000 |
| **వైమానిక దళం** | | |
| మొత్తం విమానాలు | 2,229 | 1,399 |
| ఫైటర్ విమానాలు | 513 | 328 |
| రవాణా విమానాలు | 270 | 64 |
| ట్రైనర్ విమానాలు | 351 | 565 |
| హెలికాప్టర్లు | 899 | 373 |
| ట్యాంకర్ విమానాలు | 6 | 4 |
| **ఆర్మీ** | | |
| యుద్ధ ట్యాంకులు | 4,201 | 2,627 |
| సెల్ఫ్ ప్రొపెల్డ్ ఆర్టిలరీ | 100 | 662 |
| టోవ్డ్ ఆర్టిలరీ | 3,975 | 2,629 |
| మొబైల్ రాకెట్ ప్రొజెక్టర్స్ | 264 | 600 |
| ఆర్మర్డ్ వెహికిల్స్ | 1,48,594 | 17,516 |
| **నౌకాదళం** | | |
| మొత్తం యుద్ధనౌకలు | 293 | 121 |
| విమానవాహక నౌకలు | 2 | 0 |
| జలాంతర్గాములు | 18 | 8 |

(గ్లోబల్ ఫైర్‌పవర్ సమాచారం ప్రకారం)



భారత ఆర్మీ ఆయుధపరంగా, రవాణాపరంగా పాక్ ఆర్మీ కంటే చాలా బలమైనది. భారత నౌకాదళంతో పోలిస్తే పాక్ నౌకాదళం ఎప్పుడూ చాలా బలహీనమే. అయితే వాయుసేన పరంగా పాక్ సంఖ్యాబలంలో వెనకబడి ఉన్నప్పటికీ నాణ్యత, శిక్షణలో భారత్ కంటే కొంత ముందంజలో ఉండేది. 1990 తర్వాత భారత్ ఆ లోటును చాలావరకూ అధిగమించింది. సుఖోయ్ 30, రాఫెల్ వంటి విమానాల్ని సమకూర్చుకోవడం ద్వారా పాక్‌కు అందనంత ముందంజలో నిలబడింది. కానీ గత పదేళ్లుగా ఒక్క యుద్ధ విమానాన్నీ కొనుగోలు చేయకపోవడం, ఉన్న విమానాలు పాతబడి రిటైరైపోవడం, స్వదేశీ తేజస్ యుద్ధ విమానాల తయారీ నత్తనడకన సాగుతుండడం వల్ల భారత యుద్ధ విమానాల సంఖ్య తగ్గిపోయింది. అటు పాక్, ఇటు చైనా రెండు దేశాలతో ఒకేసారి యుద్ధం వస్తే ఎదుర్కోవడానికి భారత్ వద్ద 42 స్క్వాడ్రన్ల (ఒక స్క్వాడ్రన్ అంటే సుమారుగా 18) యుద్ధ విమానాలు ఉండాలనేది రక్షణ నిపుణుల సిఫారసు. ప్రస్తుతం అది 31 స్క్వాడ్రన్లకు పడిపోయింది. దీనిపై భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ సైతం ఇటీవల ఆందోళన వ్యక్తంచేశారు. క్షిపణులపరంగా పాక్ కంటే భారత్ చాలా ముందంజలో ఉండడం వల్ల ఈలోటును కొంత అధిగమించవచ్చు. అయితే పాక్‌కు మద్దతిస్తామని చైనా ప్రకటించిన నేపథ్యంలో రెండు దేశాలతో ఒకేసారి యుద్ధం రాని రీతిలో భారత్ తన సైనిక, దౌత్య వ్యూహాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

### కోల్డ్ స్టార్ట్ అంటే!

అణ్వస్త్రాలు ప్రయోగించేందుకు తగిన పెద్ద కారణాన్ని పాకిస్థాన్‌కు కల్పించకుండా తక్కువ సమయంలో సైన్యాన్ని మోహరించి పాక్‌పై పరిమిత దాడులు చేసి కొన్ని పరిమిత లక్ష్యాల్ని సాధించడం. పాక్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయి కాబట్టి పాక్ ఉగ్రవాద చర్యలకు పాల్పడినా మనం ఊరుకోవాల్సిందేనా? అని పార్లమెంటుపై దాడి తర్వాత భారత వ్యూహకర్తలు ఆలోచించి ఈ డాక్ట్రిన్‌ను రూపొందించారు. భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేయాలంటే అంతర్జాతీయ సమాజం ఎలా స్పందిస్తుందనే దానిని కూడా పాక్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల భారత్‌పై అణు దాడికి తగిన పెద్ద కారణమేదీ చూపే అవకాశం పాక్‌కు ఇవ్వకుండా పాక్‌పై కొంతమేర దాడులు ఎలా చేయాలి? ఏయే ప్రాంతాల్లో దాడులు చేయాలి? అనే అంశాల్ని మన వ్యూహకర్తలు ఈ కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్‌లో పొందుపరిచారు. అయితే మనం పరిమిత దాడులే అని భావించినా, అంతర్జాతీయ సమాజం వాటిని ఎలా చూస్తుంది? అవి పరిమిత దాడులే కదా అని ఊరుకుంటుందా? లేదా తీవ్ర దాడులని భావించి పాక్ అణు ప్రయోగానికి పరోక్ష ఆమోదం తెలుపుతుందా? అనేది కీలకం. ఈ విషయంలో భారత దౌత్యవేత్తల పాత్ర చాలా ప్రధానమైనది. భారత్ చేస్తున్న దాడులు ఆత్మ రక్షణ కోసం చేస్తున్న పరిమిత దాడులేనని ముఖ్య దేశాలను వారు కన్విన్స్ చేయాల్సి ఉంటుంది. కానీ అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం భారత కోల్డ్‌స్టార్ట్ డాక్ట్రిన్ అనేది కేవలం సైనిక వ్యూహంగానే ఉంది. ఇందులో దౌత్యపరమైన అంశాల గురించి ఆలోచించలేదు. గతంలో అప్పటి భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ హైదరాబాద్‌లో పర్యటించినప్పుడు ఈ ప్రతినిధి ఆయనను కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్ గురించి ప్రశ్నించగా... అది కేవలం సైనిక డాక్ట్రిన్ మాత్రమేనని, విదేశాంగ శాఖకు ఇందులో ప్రమేయం లేదని ఆయన సమాధానమిచ్చారు.

### చిన్న అణ్వస్త్రాలు

ఈ కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్‌ను ఎదుర్కోవడానికి పాక్ కూడా కొన్ని సైనిక వ్యూహాలను రూపొందించింది. వీటిలో ప్రధానమైనది టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్ అంటే చిన్న అణ్వాయుధాలు! హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన బాంబుల్ని స్ట్రాటజిక్ న్యూక్లియర్ వెపన్స్ అంటారు. అంటే భారీ అణ్వాయుధాలు. అవి లక్షల సంఖ్యలో ప్రజల్ని చంపుతాయి. నగరాల్ని నేలమట్టం చేస్తాయి. కానీ టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్ చిన్నగా ఉండి తక్కువ శక్తిని కలిగి ఉంటాయి. శత్రు దేశం తాలూకు సైనిక లక్ష్యాలపై వీటిని ప్రయోగిస్తారు. ఇవి నాలుగైదు వేల మంది సైనికుల్ని చంపగలిగే శక్తిని కలిగి ఉంటాయి. భారత సైన్యం ఒకవేళ పాక్‌లోకి పెద్దసంఖ్యలో చొచ్చుకువెళితే భారత నగరాలపై భారీ అణ్వస్త్రాలను ప్రయోగించకుండా మన సైన్యంపై ఈ చిన్న అణ్వస్త్రాలను ప్రయోగించి నిరోధించాలని పాక్ ఉద్దేశం. ఈ చిన్న అణ్వస్త్రాలు మేం వేసినా భారత్ భారీ అణ్వస్త్రాలను తమపై వేయబోదనేది దాయాది లెక్క! తద్వారా భారత్ రూపొందించిన కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్‌ను దెబ్బతీయాలన్నది వారి వ్యూహం. ఇందుకోసం నాసర్ అనే స్వల్ప శ్రేణి క్షిపణుల్ని పాక్ రూపొందించి సిద్ధంగా ఉంచుకుంది. కానీ పాక్ పన్నిన ఈ వ్యూహం చెల్లదని భారత్ అప్పట్లోనే స్పష్టం చేసింది. "మీరు ప్రయోగించే అణ్వస్త్రం చిన్నదా, పెద్దదా అనేది మాకు అనవసరం. మీరు దానికి టాక్టికల్ అని పేరు పెడతారా, స్ట్రాటజిక్ అని పేరు పెడతారా అనేది మేం పట్టించుకోం. భారత్‌పై మీరు చిన్న అణ్వస్త్రం ప్రయోగించినా సరే దానికి భారత్ చేసే అణు ప్రతీకారం పెద్ద స్థాయిలోనే ఉంటుంది" అని 2013లో అప్పటి జాతీయ భద్రతా సలహామండలి ఛైర్మన్ శ్యాం శరణ్ స్పష్టం చేశారు. అందువల్ల భారత్‌పై చిన్న అణ్వస్త్రాల్ని వేయాలన్నా పాక్ ఒకటికి పదిసార్లు ఆలోచించుకోక తప్పని పరిస్థితి ఉండవచ్చు.




భారత్‌పై చిన్న అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు పాక్ తయారుచేసిన నాసర్ క్షిపణి

భారత నౌకాదళ ఐఎన్ఎస్ విక్రాంత్ విమానవాహక యుద్ధ నౌక.. దానిపై ఉన్న రష్యన్ మిగ్ 29కే యుద్ధ విమానాలు ప్రస్తుతం దీనిని అరేబియా సముద్రంలో పాక్‌కు దగ్గరగా మోహరించినట్లు వార్తలు వచ్చాయి



## జయహో.. చంద్రన్న



వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించే పరిహారాన్ని 10 వేల నుంచి 20 వేలకు పెంచడంపై బోట్ల యజమానులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పుటేరులో బోట్ల ర్యాలీ నిర్వహించారు. ఏటిమొగ నుంచి జగన్నాథపురం పాత వంతెన వరకు 200 బోట్లతో ర్యాలీ జరిపారు. చంద్రబాబు ఫ్లెక్సీలు, టీడీపీ జెండాలను బోట్లకు కట్టి పసుపుమయం చేశారు. మత్స్యకార నాయకులు సంగాని నాగేశ్వరరావు, బలసాడి రంగారావు, బోట్ల యజమానులు పాల్గొన్నారు. - కాకినాడ సిటీ, ఆంధ్రజ్యోతి

# శ్రీతేజ.. ఎవరినీ గుర్తుపట్టడం లేదు!



- సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడిన బాలుడు
- చెల్లినీ గుర్తుపట్టడం లేదు: తండ్రి భాస్కర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద డిసెంబరు 4న పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి.. అప్పటి నుంచి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎనిమిదేళ్ల బాలుడు శ్రీతేజను మంగళవారం రాత్రి వైద్యులు డిశ్చార్జి చేశారు. బాబుకు ఆస్పత్రిలో అవసరమైన అన్ని చికిత్సలూ పూర్తయ్యాయని.. నోటి ద్వారా ఆహారం తీసుకుంటున్నాడని.. కృత్రిమ ఆక్సిజన్, వెంటిలేటర్ అవసరం లేదని వైద్యులు పేర్కొన్నారు. శ్రీతేజను ఫిజియోథెరపీ కోసం న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. థియేటర్ వద్ద తొక్కిసలాటలో తల్లి రోహిణి అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ శ్రీతేజను కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ ఆస్పత్రిలో బాబు 4 నెలలు 25 రోజుల పాటు చికిత్స పొందాడు. శ్రీతేజ ప్రాణాపాయం నుంచి బయటపడినా పూర్తిగా కోలుకోలేదని, బాలుడి ఆరోగ్యం కేవలం 10శాతమే మెరుగుపడిందని తండ్రి భాస్కర్, బాబాయి మల్లికార్జున్ మంగళవారం మీడియా ఎదుట వివరించారు. బాలుడు కళ్లు తెరిచి చూస్తున్నా.. ఎవరినీ గుర్తుపట్టడం లేదని చెప్పారు. ఐసీయూలో ఉన్నప్పుడు శ్రీజ వద్దకు చెల్లి వెళ్లి పలకరించినా, బాబులో స్పందన లేదని తండ్రి భాస్కర్ వాపోయారు.

# ఆర్థిక ప్రగతికి మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 231వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 6,60,000 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను సీఎం ఆవిష్కరించారు. అలాగే 2024-25లో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన సీఎం.. వంద శాతం లక్ష్యాలను అధిగమించి, దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు వారిని అభినందించారు. అలాగే 2025-26 లక్ష్యాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. ఏరంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్ట్‌లకు బ్యాంకులు అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని చెప్పారు. ఆర్థికాభివృద్ధిలో విశాఖ అనూహ్య పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందుతోందని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అమరావతిని వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మధ్యవర్తుల ప్రమేయంతో మత్స్యకారులు నష్టపోతున్నందున వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని కోరారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని చెప్పారు. దీనికి బ్యాంకర్ల మద్దతు చాలా అవసరం అన్నారు. డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు. 2025-26లో నిర్దేశించుకున్న రుణ ప్రణాళిక లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని తెలిపారు. ఏపీ వ్యవసాయరంగ ఆధారితరాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయ రంగానికి అండగా నిలిచామని చంద్రబాబు చెప్పారు.



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

### సీఎం ఆశయాల మేరకు రుణ ప్రణాళికలు: బ్యాంకర్లు

ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్‌ను తీసుకురావాలన్న సీఎం చంద్రబాబు ఆశయం మేరకు వార్షిక రుణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని సమావేశంలో బ్యాంకర్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా లక్ష్యాన్ని అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తామని, విద్యా, గృహనిర్మాణాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, ఎస్ఎల్‌బీసీ ప్రెసిడెంట్ మణిమేఖలై, పలువురు బ్యాంకర్లు, ఆర్బీఐ అధికారులు పాల్గొన్నారు.

### 22 శాతం రుణ లక్ష్యం పెంపు

రాష్ట్ర రుణ ప్రణాళిక లక్ష్యం 2024-25లో రూ. 5,40,000 కోట్లు ఉండగా, 2025-26లో 22% అధికంగా రూ. 6,60,000 కోట్లకు పెంచారు. ఇందులో వ్యవసాయ రంగ లక్ష్యం రూ. 3,06,000 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 1,28,000 కోట్లు ఉండగా, మొత్తం ప్రాధాన్యత రంగానికి రూ. 4,58,000 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ. 2,02,000 కోట్లు రుణ లక్ష్యంగా బ్యాంకర్ల కమిటీ నిర్దేశించింది. 2024-25లో లక్ష్యాన్ని అధిగమించి, రూ. 6,83,672 కోట్ల రుణాలు ఇచ్చినట్లు బ్యాంకర్ల కమిటీ వివరించింది. వార్షిక లక్ష్యంలో ఇది 127% వృద్ధి అని తెలిపింది. ఇందులో ప్రాధాన్యత రంగానికి రూ. 4,14,824 కోట్లు, ప్రాధాన్యేతర రంగాలకు రూ. 2,68,848 కోట్లు అందించగా, గతేడాది వ్యవసాయ రంగానికి రూ. 2,64,000 కోట్ల రుణ లక్ష్యంలో 116% వృద్ధి సాధించామని, ఖరీఫ్‌లో రూ. 1,69,797కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణాలిచ్చామని బ్యాంకర్లు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ఎంఎస్ఎంఈ రంగానికి భారీఎత్తున రుణ ప్రణాళిక అమలు చేయగా, గతేడాది రూ. 87 వేల కోట్ల లక్ష్యానికి రూ. 95,620 కోట్లు రుణాలు ఇచ్చి, 110% వృద్ధి సాధించారు. అయితే వార్షిక రుణ ప్రణాళిక అమలులో ఏటేటా వృద్ధి రేటు పడిపోతుడటంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బ్యాంకర్లను ప్రశ్నించారు. 2021-22 లక్ష్యంలో 133%, 2022-23లో 163%, 2023-24లో 138% ఉండగా, 2024-25లో లక్ష్యంలో వృద్ధి 127% మాత్రమే ఉండటంపై మంత్రి వివరణ కోరారు.

## పహల్గాం



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్, వరప్రసాద్, నాదెండ్ల మనోహర్, పంతం నానాజీ, బుద్ధప్రసాద్, బొలిశెట్టి శ్రీనివాస్, నాగబాబు, నిమ్మక జయకృష్ణ, లోకం మాధవి, కందుల దుర్గేశ్, హరిప్రసాద్, బత్తుల బలరామకృష్ణ, పంచకర్ల, పులవర్తి రామాంజనేయులు తదితరులు

# ఇది దేశ సమగ్రతపైనే దాడి

(మొదటి పేజీ తరువాయి)

చంపేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు వేటాడి చంపడం అత్యంత హేయం. మధుసూదనరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు కావలి వెళ్లినప్పుడు ఆయన భార్య, పిల్లలు పహల్గాంలో జరిగిన ఘాతుకాన్ని వివరిస్తుంటే హృదయం ద్రవించిపోయింది. 'ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని చంపేశారు. మేం ముస్లిం అయితే మమ్మల్ని వదిలివేసేవారు. హిందువుగా పుట్టడం మేం చేసిన పాపమా' అని మధుసూదనరావు భార్య నన్ను ప్రశ్నించారు. కశ్మీర్‌లో అమాయకులపై పేలిన తూటా ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయి. హిందువ్వా? ముస్లిమువా? అని అడిగి మరీ కిరాతకంగా తూటాలు దించిన ఉగ్రవాదులపై ఏమాత్రం కనికరం అవసరం లేదు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడానికి దేశమంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైంది." అని పవన్ కల్యాణ్ తెలిపారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనన్నారు. విభిన్న సంప్రదాయాలు, అభిప్రాయాలు ఉండే దేశాన్ని ఏకాభిప్రాయంతో నడపాలంటే ప్రధానమంత్రి స్థాయి వ్యక్తికి ఎంతో కష్టమని, ఆయనకు మన వంతు సహకారం అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఇది ఎన్డీఏ భాగస్వామిగా జనసేన బాధ్యత అని చెప్పారు. "ఇప్పటికి పాకిస్థాన్‌ను మూడుసార్లు ఓడించాం. మనదేశంలో అసలు ఎంతమంది ఏ ముసుగుతో ఉంటున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. మనకు సహనం ఎక్కువైంది. మితిమీరిన మంచితనం కూడా దేశానికి మంచిది కాదు." అని పవన్ అన్నారు. దేశంలో యుద్ధ పరిస్థితులు రావొచ్చు.. రాకపోవచ్చునని ఆయనఅభిప్రాయపడ్డారు. "పహల్గాం దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు నీళ్ల ఆపడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. దేశంలో లౌకికవాదం తీరు ఏమీ బాగాలేదు. 26 మందిని మత ప్రాతిపదికన చంపేస్తే.. సోకాల్డ్ సూడో సెక్యులరిస్టులు మాత్రం మతం అడిగి చంపలేదు అంటున్నారు. మధుసూదనరావు భార్య మనకు అబద్ధం చెబుతారా? కొంతమంది భారతదేశంలో కూర్చొని పాక్‌ను ప్రేమిస్తామంటారు. అలాంటి వారు అక్కడికే వెళ్లిపోండి' అంటూ ఘాటుగా స్పందించారు. పాకిస్తాన్ ఏర్పాటు సమయంలో అందర్నీ సమానంగా ఆదరిస్తామని జిన్నా చెప్పారు. కానీ, ఆనాడు పాక్‌లో రెండు కోట్ల మంది హిందువులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య కొన్ని లక్షలమందికి పడిపోయింది." అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, శాసన మండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

### మీరే జనసేనకు ఇంధనం.. ప్రేరణ

జన సైనికులు, వీర మహిళల ఆశయమే తమ పార్టీకి ఇంధనం, ప్రేరణలని పవన్ కల్యాణ్ అన్నారు. క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన వారితో మంగళవారం సాయంత్రం ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. "నేను మానవత్వాన్ని నమ్ముతాను. కొన్నిసార్లు కులాలు, మతాల ప్రస్తావన నా మాటల్లో వచ్చినా అంతిమంగా మాత్రం ప్రతి ఒక్కరూ బాగుండాలని కోరుకుంటా. విశ్వకవి గుర్రం జాషువా చెప్పినట్టు... విశ్వ నరుడిగా బతకాలని కోరుకుంటా. కులం, మతం, ప్రాంతం దాటి మనిషిగా బతకాలన్నదే నా ఆశయం." అని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ బీమా పరిహార సొమ్ము పెంపు అంశంపై బీమా కంపెనీలతో మాట్లాడుతున్నానని పవన్ తెలిపారు.

# వడివడిగా అభివృద్ధి అడుగులు

- 10 నియోజకవర్గాల్లో సిద్ధమైన ఎంఎస్ఎంఈ పార్కులు
- రేపు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ప్రారంభించనున్న సీఎం
- మరో 40 పార్కులకు శంకుస్థాపన

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నియోజకవర్గానికొక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడం, ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడం లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్రానికి భారీ పరిశ్రమలను ఆకర్షిస్తూ రూ. వేల కోట్ల పెట్టుబడులతో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తోంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి.. వాటిలో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను నెలకొల్పుతామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం వేగంగా నెరవేరుస్తోంది. అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే రాష్ట్రంలోని 10 నియోజకవర్గాల్లో అన్ని మౌలిక వసతులతో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసింది. ఈ పారిశ్రామిక పార్కులను మే 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని మరో 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నారు. ఆయా పార్కులలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే వారికి సరసమైన ధరలకే భూ కేటాయింపులు చేయడంతోపాటు అన్నివిధాలుగా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుంది.

### ఎంఎస్ఎంఈలకు రూ. 1.28 లక్షల కోట్ల రుణపరపతి

ఏపీఐఐసీ ద్వారా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కనిష్ఠంగా 15 ఎకరాల నుంచి 100 ఎకరాల వరకు భూములను సేకరించి పారిశ్రామిక పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఆయా పార్కులలో ఏటా 2వేలకు పైగా కొత్త యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ యూనిట్లకు 10,586 కోట్లు ప్రోత్సాహకాలుగా అందించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా రూ. 4లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం కొత్త పారిశ్రామికవేత్తలు వేగంగా యూనిట్లను గ్రౌండ్ చేసేందుకు బ్యాంకుల ద్వారా ఉదారంగా రుణాలు మంజూరు చేయడానికి చర్యలు చేపట్టింది. మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ అంశంపై చర్చించారు. 2025-26లో ఎంఎస్ఎంఈలకు రూ.1.28 లక్షల కోట్ల రుణపరపతి కల్పించేలా బ్యాంకర్లను ఒప్పించారు. గతంలో 87వేలకోట్లు మాత్రమే రుణపరపతి కల్పించగా.. ఈ ఏడాది సీఎం చొరవతో 48 శాతం ఎక్కువ రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ముందుకు వచ్చారు.

## మాదకద్రవ్యాల కేసుల్లో
# ఆస్తులు సీజ్ చేస్తాం

- ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ లేకుండానే అరెస్టులు
- ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ వెల్లడి



ఏలూరు క్రైం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్) కేసుల్లో నేరస్థుల ఆస్తులతోపాటు వారు లావాదేవీలు జరిపిన కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల ఆస్తులను కూడా సీజ్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని రాష్ట్ర ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌ను నియంత్రించడానికి ప్రతిష్ఠాత్మకంగా చర్యలు తీసుకుంటోందని, దీనిలో భాగంగా 45వేల ఈగల్ టీమ్‌లను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టం చాప్టర్ 5(ఎ) ప్రకారం మత్తుపదార్థాలు,మాదక ద్రవ్యాలు తయారు చేసేవారు, విక్రయించేవారితోపాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఆస్తులను కూడా సీజ్ చేసే అధికారాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు గుర్తించిన 22 కేసుల్లో విచారణ చేపట్టామన్నారు. ఇప్పటికే నాలుగు కేసుల్లో నేరస్థుల ఆస్తులను సీజ్ చేశామన్నారు. అల్లూరిజిల్లాల్లోని 9 మండలాల్లో గంజాయి పండించే 375 గ్రామాలను గుర్తించామని చెప్పారు. గంజాయి కేసులో ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరిని, కడప జిల్లాలో ఐదుగురిని ఎన్‌డీపీఎస్ చట్టం-1988 ప్రకారం ఎఫ్ఐఆర్ లేకుండానే అరెస్టు చేశామని చెప్పారు.

# డీఎస్సీ అభ్యర్థులకు ఉపశమనం

- ఎస్సీ,ఎస్టీ,బీసీ,దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీలో 40% మార్కులున్నా అర్హులే
- సర్టిఫికెట్ల అప్‌లోడ్ ఐచ్ఛికం: విద్యాశాఖ

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులకు డిగ్రీ మార్కుల విషయంలో ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. టెట్‌తో సమానంగా డీఎస్సీ అర్హతకు సవరణలు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీలో 40 శాతం మార్కులు ఉన్నా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఓసీ అభ్యర్థులు 50 శాతం, మిగిలినవారు 45 శాతం మార్కులు డిగ్రీలో కలిగి ఉండాలనే నిబంధన పెట్టారు. కానీ, గతేడాది నిర్వహించిన టెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు 40శాతం డిగ్రీ మార్కులు ఉన్నా టెట్‌కు అనుమతించారు. కానీ, ఇప్పుడు వారికి 45శాతం చేయడంతో అనేక మంది అర్హత కోల్పోయారు. డీఎస్సీకి అర్హత లేనప్పుడు టెట్‌లో ఎందుకు అర్హత కల్పించారని అభ్యర్థులు ప్రశ్న లేవనెత్తారు. టెట్‌లో అర్హత సాధించిన వారందరికీ డీఎస్సీలో అర్హత కల్పించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల వినతులను పరిగణలోకి తీసుకున్న పాఠశాల విద్యాశాఖ టెట్‌తో సమానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీలో 40 శాతం మార్కులున్నా డీఎస్సీలోకి అనుమతించేలా ఈ సవరణలు చేసింది. స్కూల్ అసిస్టెంట్, టీజీటీ పోస్టులకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడం ఐచ్ఛికమని పేర్కొంది. నోటిఫికేషన్ ఇచ్చిన సమయంలో తప్పనిసరిగా దరఖాస్తు సమయంలోనే సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలనే నిబంధన పెట్టారు. దీనివల్ల సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఉద్యోగాలకు ఎంపికైన వారి సర్టిఫికెట్లు మాత్రమే పరిశీలించాలని అభ్యర్థులు కోరారు. దీనిపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయడాన్ని ఆప్షనల్‌గా మారుస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది.

### ఏకరీతిన ఉండాలి: ఏపీటీఎఫ్

ఉపాధ్యాయుల నియామకం అన్ని పాఠశాలలకు ఏకరీతిన ఉండాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి అన్నారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేసి, మూడంచెల పాఠశాలల విధానం అమలు చేయాలన్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.